thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08


# చురకలు
సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 133 | కరీంనగర్ మంగళవారం, 22 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పుళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డనగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.







## యుద్ధప్రాతిపదికన మొత్తం సంసిద్ధం చేస్తున్న అధికారులు!!

హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఎలక్షన్స్‌కు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు స్పీడప్ పెంచారు. యుద్ధ ప్రాతిపదికన సకలం సంసిద్ధం చేస్తున్నారు అధికారులు. ఈ క్రమంలో బ్యాలెట్ పేపర్ల కలర్లను ఫైనల్ చేశారు. ఎంపీటీసీకి గులాబీ, జెడ్పీటీసీకి తెలుపు రంగు బ్యాలెట్‌వినియోగించనున్నారు.

దీనిపై ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ సిబ్బందిని నియమిస్తున్నారు. పోలింగ్, బ్యాలెట్ పేపర్, బ్యాలెట్‌బాక్సులు, స్టేషనరీ తదితర వాటన్నింటినీ మరోసారి సరిచూసుకొని సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

**400 మందికి ప్రిసైడింగ్ అధికారి...** ఒక పోలింగ్ కేంద్రంలో 400 మంది వరకూ ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారి, నలుగురు పోలింగ్?అధికారులను నియమించనున్నారు. 400 నుంచి 600 వరకూ ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఐదుగురు పోలింగ్ అధికారులను నియమిస్తారు.

ఓటు వేసేట ప్పుడు ఓటరు ఎడమ చేతి చూపుడు వేలుకు సిరా వేస్తారు. బాణం క్రాస్ మార్క్ రబ్బరు స్టాంపుతో ఓటు వేస్తారు. మొదట ఎంపీటీసీకి ఓటు వేసిన తర్వాత జెడ్పీటీసీ బ్యాలెట్ పేపర్ ఇస్తారు. ఒకే సారి రెండు బ్యాలెట్ పేపర్లు ఇవ్వరు. ఓటు ఎవరికీ కనిపించకుండా వేయాల్సి ఉంటుంది.

ఇష్టం వచ్చినట్టు చూపించి వేస్తామంటే నిబంధనలు అంగీకరించవు. ప్రతి బ్యాలెట్ పేపర్ వెనకాల ప్రిసైడింగ్ అధికారి తప్పకుండా సంతకం చేయాల్సి ఉంటుంది. ప్రతి బ్యాలెట్ పేపర్ వెనుక ప్రత్యేక గుర్తు ఒక వల యంలో భిన్నంగా ఉంటుంది. ఇందులో గణితంలో భాగాహరం విధానంలో పైన మండల ప్రజా పరిషత్?కోడ్, కింద జిల్లా ఎన్నికల అధికారి ఆమోదించిన పోలింగ్?స్టేషన్ నంబర్ ఉంటుంది.

**ముగ్గురు ఎంపీటీసీలకు ఒక రిటర్నింగ్ అధికారి...** మూడు అంత కంటే ఎక్కువ కానీ తక్కువ ఉన్న ఎంపీటీసీలకు ఆయా జిల్లాల్లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఒక గెజిటెడ్ అధికారిని రిటర్నింగ్ ఆఫీసర్‌గా నియమిస్తారు. జెడ్పీటీసీకి మరో రిటర్నింగ్ అధికారిని నియమిస్తారు.

ఎంపీటీసీ స్థానాల రిటర్నింగ్ అధికారులందరూ జెడ్పీటీసీ రిటర్నింగ్ అధికారికి సహాయ రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. 2018 తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 243(3) ప్రకారం ఏ అభ్యర్థి కూడా ఒక మండల ప్రజాపరిషత్ లేదా జిల్లా ప్రజా పరిషత్‌లోని ఒకటి కంటే ఎక్కువ ప్రాదేశిక నియోజకవర్గాలకు పోటీ చేయొద్దని స్పష్టం చేస్తోంది. ప్రతి ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు కనీసం ఒక రోజు ముందుగా ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేకంగా బ్యాంకులో ఖాతా తెరిచి, ఖాతా నంబర్ నామినేషన్ వేసే సమయంలో ఆర్‌వోకు రాత పూర్వకంగా ఇవ్వాలి. ఎన్నికల వ్యయం మొత్తం ఈ ఖాతా ద్వారా మాత్రమే చేయాలి. అభ్యర్థి సొంత నిధులతో సహా ఇతర మార్గాల ద్వారా వచ్చిన డబ్బును సైతం ఈ ఖాతాలో జమ చేసి ఖర్చు పెట్టాల్సి ఉంటుంది.

**పోటీ చేయాలంటే 21 ఏళ్లు నిండాల్సిందే..** జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్‌కు పోటీ చేసే వారు ఖచ్చితంగా 21 ఏండ్లు నిండి ఉండాలి.

ఏదైన గ్రామ సేవలకు కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థల అధికారి, ఉద్యోగి, ప్రభుత్వ నిధుల నుంచి సహాయం పొందుతున్న ఏదేని సంస్థలోని ఉద్యోగి, శాసనసభ లేదా పార్లమెంట్ ఉభయ సభలు చేసిన చట్టం కింద ఏర్పాటైన ఏదైనా సంస్థ కార్యనిర్వహక సభ్యుడు, ఉద్యోగి, వీరిలో ఎవరు కూడా స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు అనర్హులు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువగా ఉన్న వారు సైతం ఈ ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో మార్పు తీసుకొచ్చింది. ఈ సారి నోటా గుర్తు సైతం బ్యాలెట్?పేపర్‌లో ఉండనుంది.

## సభలో నన్ను మాట్లాడనీయడం లేదు




న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజే లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అధికార పక్షంపై విమర్శలు గుప్పించారు. సభలో విపక్షాలు ప్రస్తావించదలచిన అంశాలపై తనను మాట్లాడేందుకు అనుమతించడం లేదని విమర్శించారు రాహుల్ గాంధీ. కేంద్రమంత్రులను మాట్లాడేందుకు అనుమతిస్తూ విపక్షనేతగా ఉన్న తనను అనుమతించకపోవడం ఏంటని ప్రశ్నించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రస్తావించేందుకు పహల్గాం ఉగ్రదాడి, బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ సహా 8 అంశాలను విపక్ష పార్టీలు గుర్తించాయి. తమ డిమాండ్లపై విపక్ష పార్టీలు లోక్‌సభలో నినాదాలు చేయడంతో తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఆ తర్వాత 2 గంటల వరకూ సభ వాయిదా పడింది. 'ప్రశ్న ఏంటంటే- సభలో రక్షణ మంత్రిని మాట్లాడేందుకు అనుమతించారు.

కానీ విపక్ష నాయకుడిగా ఉన్న నాతో సహా ప్రతిపక్ష సభ్యులను అనుమతించలేదు. ఇదో కొత్త తరహా విధానం. ప్రభుత్వం వైపు ఉన్న వాళ్లను మాట్లాడేందుకు అనుమతించినప్పుడు మాకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వడమే సంప్రదాయం' అని రాహుల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌పై చర్చించేందుకు సిద్ధమేనని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ప్రస్తావిస్తూ.. వాళ్లు చర్చించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు విపక్ష నేతను కూడా మాట్లాడనీయాలని, ఆయన మాట్లాడేందుకు లేచినప్పుడు అనుతించాల్సి ఉంటుందని అన్నారు. దీనికి ముందు సభలో విపక్ష సభ్యుల ఆందోళన మధ్య రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఏ అంశంపై అయినా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కిరణ్ రిజిజు మరింత వివరణ ఇస్తూ, మధ్యాహ్నం 2.30 గంటలకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం ఉందని, ప్రభుత్వం చర్చించడానికి సిద్ధంగా ఉంటే వాళ్లు (విపక్ష ఎంపీలు) సభలో నిరసన తెలుపుతున్నారని, సమావేశాల తొలిరోజే ఇలా చేయడం సరికాదని అన్నారు.




హైదరాబాద్: జిల్లాల పరిధిలోని ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రోజూ కలెక్టర్లు ఏ పనిచేశారో తనకు తెలియజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వారి కార్యాచరణ రిపోర్టు రోజూ తనకు పంపించాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షాలు, వానాకాలం పంటసాగు, సీజనల్ వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. "రాష్ట్రంలో సరిపడినంత ఎరువులు ఉన్నాయి. ఆందోళన అవసరం లేదు. ఎరువుల దుకాణాల్లో ఎంత స్టాక్ ఉందో బయట నోటీస్ బోర్డు పెట్టాలి. రాయితీ ఎరువులను ఇతర అవసరాలకు వాడితే కఠిన చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు వాటర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.కోటి కేటాయించాలి. ఇప్పటి వరకు 7లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు ఇచ్చాం. ఈనెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు రేషన్‌కార్డుల పంపిణీ చేయాలి. ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలి. అన్ని మండల కేంద్రాల్లో పంపిణీ జరగాలి. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ.. ఆందోళన అవసరం లేదు" అని సీఎం అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు.

# ముచ్చెమటలు పుట్టించాం!

## శత్రువుల ఇంట్లోకి వెళ్లి, ఉగ్రవాదుల స్థావరాలు ధ్వంసం!!




## 'ఆపరేషన్ సింధూర్'పై పార్లమెంటు సాక్షిగా సైనికులను కొనియాడిన ప్రధాని మోదీ!

భారత పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నేటి (జూలై 21) నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ ప్రాంగణం నుంచి ప్రసంగించారు. దేశ భద్రత, సైనిక శక్తి, ఆర్థిక వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయ రంగంలో జరుగుతున్న అభివృద్ధిని గురించి ఆయన మాట్లాడారు. ఈ సమావేశం దేశానికి గర్వకారణమైన విజయోత్సవంగా ఆయన అభివర్ణించారు. మోదీ తన ప్రసంగంలో దేశం ఎదుర్కొంటున్న హింసాత్మక ఘటనల గురించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశం ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. నేడు నక్సలిజం, మావోయిజం ప్రభావం వేగంగా తగ్గుతోందని చెప్పారు.

**దేశ భద్రతలో గణనీయమైన పురోగతి...** దేశ భద్రతా దళాలు ఉత్సాహంతో విజయం వైపు పయనిస్తున్నాయని, వందలాది జిల్లాలు నక్సలిజం ప్రభావం నుంచి విముక్తి పొందాయని ఆయన తెలిపారు. గతంలో రెడ్ కారిడార్‌గా పిలిచే ప్రాంతాలు ఇప్పుడు గ్రీన్ జోన్‌లుగా మారుతున్నాయని, ఇది దేశ ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని ఆయన అన్నారు. బాంబులు, తుపాకుల ముందు భారత రాజ్యాంగం విజయం సాధిస్తోందని ఆయన ఉద్ఘాటించారు.

**సైనిక శక్తిలో భారత్ అభివృద్ధి...** ప్రధాని మోదీ భారత సైనిక శక్తి గురించి మాట్లాడుతూ, దేశం సైనిక రంగంలో గొప్ప పురోగతి సాధిస్తోందని తెలిపారు. సైనిక రంగంలో పరిశోధన, తయారీ, మేక్ ఇన్ ఇండియా ఆయుధాల ఉత్పత్తి బలపడుతోందన్నారు. ఇది యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం 100 శాతం లక్ష్యాలను సాధించిందని, కేవలం 22 నిమిషాల్లోనే శత్రువుల ఇళ్లలోకి వెళ్లి వారి స్థావరాలను నాశనం చేసిందని పేర్కొన్నారు. ఈ విజయం దేశానికి గర్వకారణమని మోదీ అన్నారు.

**సైన్స్ అండ్ టెక్నాలజీలో కొత్త ఉత్సాహం...** సైన్స్, టెక్నాలజీ రంగంలో భారతదేశం సాధిస్తున్న విజయాల గురించి మోదీ మాట్లాడారు. ఈ రంగంలో దేశం కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని, అంతరిక్ష రంగంలో భారత్ కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత త్రివర్ణ పతాకం ఎగిరిన సందర్భాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ క్షణం దేశ ప్రజలందరికీ గర్వకారణమని, పార్లమెంట్ లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఒకే సమయంలో ఈ విజయాన్ని కొనియాడాయని మోదీ అన్నారు. ఈ విజయాలు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలకు ప్రేరణగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థలో ఆశాజనక సూచనలు...** వర్షాకాలం సమావేశాలకు మీ అందరికీ స్వాగతం అని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. దేశంలో వాతావరణం చాలా బాగా అభివృద్ధి చెందుతోందన్నారు. వ్యవసాయ రంగంలో అభివృద్ధిని కూడా ప్రస్తావించారు. ఈ ఏడాది వర్షాకాలం వ్యవసాయానికి అనుకూలంగా ఉందని, నీటి నిల్వలు గత దశాబ్దంతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు పెరిగాయని తెలిపారు. ఇది రైతుల ఆర్థిక వ్యవస్థ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఈ అభివృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వర్షాకాల సమావేశాన్ని ప్రధాని మోదీ జాతీయ గర్వంతో నిండిన విజయోత్సవ సమావేశంగా అభివర్ణించారు.




## డయాలసిస్ పేషెంట్లకి గుడ్‌న్యూస్.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్: డయాలసిస్ పేషెంట్లకి రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. నూతనంగా 681 మంది డయాలసిస్ పేషెంట్లకు తెలంగాణ ప్రభుత్వం చేయూత పెన్షన్లని మంజూరు చేయనుంది. ఈ మేరకు పెన్షన్ మంజూరు ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం చేశారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాకముందు 4011 మంది డయాలసిస్ పేషెంట్లకు సామాజిక పెన్షన్లని గత ప్రభుత్వం ఇచ్చింది.

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4029 మంది డయాలసిస్ పేషెంట్లకు చేయూత పెన్షన్లని మంజూరు చేసింది రేవంత్ ప్రభుత్వం. తాజాగా మరో 681 మంది డయాలసిస్ పేషెంట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేసింది. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న డయాలసిస్ పేషంట్లను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వం గుర్తిస్తుంది. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ గుర్తించిన 681 మంది డయాలసిస్ పేషెంట్ల వెరిఫికేషన్ పూర్తి చేసిన తర్వాత పెన్షన్లను సెర్ప్ మంజూరు చేసింది.

681 మంది డయాలసిస్ పేషెంట్లలో.. అత్యధికంగా హైదరాబాద్‌లో 629 మంది చికిత్స పొందుతున్నారు. మిగిలిన అన్ని జిల్లాల్లో కలిపి 52 మంది పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. వీరు పూర్తిస్థాయిలో పనిచేసుకోలేకపోవడంతో వారి ఆరోగ్య, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసింది. వచ్చే నెల నుంచి కొత్త పింఛన్‌దారులు పెన్షన్ అందుకోనున్నారు.




## బెట్టింగ్ యాప్ కేసులో సినీ సెలబ్రెటీలకు బిగ్ షాక్

హైదరాబాద్: బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ అధికారులు ముమ్మరంగా విచారణ చేస్తున్నారు. బెట్టింగ్ యాప్ కేసులో నిందితులుగా ఉన్న సినీ సెలబ్రెటీలకు ఇవాళ(సోమవారం) నోటీసులు జారీ చేశారు ఈడీ అధికారులు. ఇప్పటికే పలువురిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.

ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని నోటీసులు పంపించారు ఈడీ అధికారులు. జులై 23న దగ్గుబాటి రానా, జులై30న ప్రకాష్‌రాజ్, ఆగస్ట్6న విజయ్ దేవరకొండ, ఆగస్ట్ 13న మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని నోటీసులో తెలిపారు ఈడీ అధికారులు. విదేశీ బెట్టింగ్ యాప్‌లను వీరు ప్రమోట్ చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్నలని మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు ఆయా కంపెనీల నుంచి సెలబ్రెటీలకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేయనున్నారు ఈడీ అధికారులు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు ECIR నమోదు చేశారు. సెలబ్రెటీలు బెట్టింగ్ యాప్‌లని ప్రమోట్ చేయడంతోనే పలువురు ఆకర్షితులు అయ్యారని ఈడీ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి అమాయకులు మోసపోయినట్లు అధికారులకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈడీ అధికారులు, పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఎంతోమంది బెట్టింగ్ యాప్‌ల బారిన పడి ఆత్మహత్యలు చేసుకోవడంతో పోలీసులు ఈ కేసుని సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతున్నారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లోకి తీసుకురాలేం: రామచంద్రరావు



దిల్లీ: బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం, భాజపాపై నిందలు వేస్తే ఊరుకోబోమని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని.. సాధ్యం కాదని తెలిసినా బిల్లు తీసుకొచ్చారని విమర్శించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామచంద్రరావు మాట్లాడారు. అసాధ్యమైన పనిని కేంద్రంపైకి నెట్టివేస్తున్నారన్నారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా.. ఓటు బ్యాంకు పాలిటిక్స్ కోసం మోసం చేస్తున్నారు. భాజపా, కేంద్ర ప్రభుత్వంపై నిందలు వస్తే ఊరుకోం. మీకు న్యాయ సలహాదారులు లేరా?ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ తీసివేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. ముస్లింలకు ఇచ్చినవి రాజకీయ రిజర్వేషన్లు.. అందుకే వ్యతిరేకిస్తున్నాం. 42 శాతం బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లోకి తీసుకురాలేం. దానికి సుప్రీంకోర్టు అనుమతించదు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదు?" అని రామచంద్రరావు ప్రశ్నించారు.

## ఏటీసీల్లో ఫార్మా లైఫ్‌సైన్సెస్ కోర్సులు నిర్వహించాలి: రేవంత్

హైదరాబాద్: పరిశ్రమలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ ఇవ్వాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీ), తెలంగాణ రైజింగ్-2047పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తవ్వాలన్నారు. ఈ పనులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. 3 దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు సీఎంకు అధికారులు వివరించారు. ఫేజ్-1లో 25, ఫేజ్-2లో 40, ఫేజ్-3లో 46 ఏటీసీలను అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటివరకు 49 అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. సీఎం మాట్లాడుతూ.. ఏటీసీల పూర్తికి అవసరమైతే నైపుణ్యం ఉన్న సంస్థల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏటీసీల్లో ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ కోర్సులు నిర్వహించాలన్నారు. జీనోమ్ వ్యాలీలో మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. స్థలం కేటాయింపు, అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు.

**గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ నిధి...** గిగ్ వర్కర్స్ ప్రతిపాదిత పాలసీని అధికారులు సీఎంకు వివరించారు. సంక్షేమబోర్డు ఏర్పాటుచేసి ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటా ఆన్‌లైన్‌లో ఉండాలని సీఎం ఆదేశించారు. గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలన్నారు. వారికి ప్రమాద, వైద్య బీమా సౌకర్యాలు కూడా కల్పించాలని చెప్పారు.




## హైదరాబాద్ మహా నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో మరో బస్టాండ్: మంత్రి పొన్నం

**హైదరాబాద్ మహా నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో మరో బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇప్పుడు ఉన్న ఎంజీబీఎస్, జేబీఎస్‌లకు దీటుగా నూతన బస్టాండ్‌ను నిర్మించాలని తెలంగాణ ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నూతన బస్టాండ్ కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఓ టీవీ నిర్వహించిన ముఖాముఖిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు విషయాలను వెల్లడించారు.**




## స్థానిక ఎన్నికలపై హరీష్‌రావు కీలక వ్యాఖ్యలు

సిద్దిపేట: స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలపై ఈ మధ్య సర్వే చేయిస్తే.. తెలంగాణలో మొత్తం 31 జిల్లా పరిషత్‌లు ఉంటే.. 16 నుంచి 18 స్థానాలని బీఆర్ఎస్ కైవసం చేసుకోబోతోందని ఆ సర్వేలో తేలిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఇవాళ(సోమవారం) ప్రజ్ఞాపూర్‌లో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్‌రావు పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గజ్వేల్ అని ఉద్ఘాటించారు. రేవంత్ ప్రభుత్వం అన్నదాతలని ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీమంత్రి హరీష్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు ఎరువులకు లైన్‌లో నిలబడ్డ దాఖలాలు లేవని.. రేవంత్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎకరానికి ఒకటే బ్యాగ్ అంటున్నారని... మళ్లీ లైన్లలో నిలబడే పరిస్థితి తీసుకువచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరూ రైతులకు రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లోకి కాళేశ్వరం నీళ్లు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో మోటార్లు కాలకపోయేవని.. ఇప్పుడు మోటార్ వెండింగ్ దుకాణాలకు గిరాకీ పెరిగిందని విమర్శించారు. ఆనాడు తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే ఆంధ్రాలో పది ఎకరాలు భూమి కొనవచ్చని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్ పాలనలో తెలంగాణలో రెండు ఎకరాలు అమ్మితే ఆంధ్రాలో ఒక ఎకరం కొనే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు మాజీమంత్రి హరీష్‌రావు. 20 నెలల కాంగ్రెస్ పరిపాలనలో తెలంగాణ పరిస్థితి ఏవిధంగా ఉందో ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పుకొచ్చారు. ఊర్లలో చెత్త ఎత్తే పరిస్థితి కనపడటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని.. కానీ 12 వేల ఉద్యోగాలు ఇచ్చి మోసం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష అరవై వేల ఉద్యోగాలు ఇచ్చామని ఉద్ఘాటించారు. నిరుద్యోగులు ఎక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారోనని వందలాది మంది పోలీసులతో తిరుగుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 4 వేల పెన్షన్‌లు ఇస్తామని చెప్పి.. 2 లక్షల పెన్షన్ లు తీసేశారని ఫైర్ అయ్యారు. రేవంత్ ప్రభుత్వంలో కొత్త పెన్షన్ ఒక్కటి కూడా ఇవ్వలేదని... ఇరవై నెలల్లో రెండు నెలల పెన్షన్‌లు ఎగ్గొట్టారని హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాల్లో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ప్రమేయముందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి ఆరోపించారు. పదేళ్లుగా రాష్ట్రంలోని క్రికెట్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారని.. చాలా మందికి క్రికెటర్లకు గుర్తింపు లేకుండా చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కేటీఆర్, కవితతో పాటు హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంపత్‌కుమార్‌ను తక్షణమే విచారించాలి. వారి తప్పుడు నిర్ణయాల వల్ల గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరిగింది. సమ్మర్ క్యాంపులను ఉచితంగా నిర్వహించాలి.

కానీ డబ్బులు తీసుకున్నారు. దానికి మా వద్ద ఆధారాలున్నాయి. ఆ డబ్బంతా ఎక్కడికి పోయింది. అవకాశాల కోసం తెలంగాణ క్రికెటర్లు ఎదురుచూస్తున్నారు. హెచ్‌సీఏలో జరిగిన అక్రమాల వివరాలను సీఐడీ, ఈడీకి అందజేస్తాం. హెచ్‌సీఏ కార్యవర్గాన్ని రద్దు చేయాలి.

**రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి...** హెచ్‌సీఏ ఎన్నికపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. క్రికెట్‌తో సంబంధం లేని జగన్మోహన్‌రావు ఎలా అధ్యక్షుడు అయ్యారు?ఆయన వెనుక కేటీఆర్, కవిత ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలా ఓట్లు వేస్తారు?ఐపీఎస్ అధికారి సజ్జనార్ కూడా ఎన్నికల్లో పాల్గొన్నారు. 155 క్రికెట్ అసోసియేషన్లు యాక్టివ్‌లో లేవు. అలాంటి వాటికి ఎన్నికలు ఎలా నిర్వహించారు?వెంటనే ఎన్నికలు రద్దు చేసి క్లబ్బులను ప్రక్షాళన చేయాలి" అని గురువారెడ్డి డిమాండ్ చేశారు.




తిరువనంతపురం: కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ (101) కన్నుమూశారు. గత నెల 23న గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు.

2006 నుంచి 2011 వరకు ఆయన కేరళకు సీఎంగా పనిచేసిన విషయం తెలిసిందే. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సీపీఎంను స్థాపించిన వ్యక్తుల్లో అచ్యుతానందన్ కూడా ఒకరు. 1923 అక్టోబరు 20న కేరళలో వెనకబడిన ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్.. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు.. ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత.

**కార్మిక ఉద్యమాల్లోంచి.. ప్రజా నేతగా..** బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేసి... దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ.. జీవనం సాగించిన అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టారు. 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో ఆరంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా ప్రజా నేతగా ముఖ్యమంత్రి స్థాయికి చేరింది. 1964లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి.. సీపీఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 దాకా కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఆయన ఒకసారి (2006-2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు.

**ప్రజాపక్షమే ఊపిరిగా..** అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో ఎన్నడూ వెనకంజ వేయని అచ్యుతానందన్... రాష్ట్రంలో భూ ఆక్రమణదా రులపైనా ముఖ్యమంత్రిగా ఉక్కుపాదం మోపారు. ఈ చర్యలతో అనేకమంది వ్యతిరేకమైనా ఆయన వెరవలేదు. ప్రజలు.. పార్టీ మధ్య అంతరం వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ క్రమశిక్షణనూ పక్కనబెట్టి ప్రజల పక్షాన నిలబడటానికే పెద్దపీట వేశారు.

ఈ క్రమంలో అవమానాలు ఎదురైనా తన నిజాయితీబాటను, నిరాడంబరతను ఏనాడూ వీడలేదు.

**నిరంతర అధ్యయనశీలి..** పుట్టింది 1923లో అయినా... ఆధునిక అవసరాలను కూడా అర్థం చేసుకున్న నిత్య అధ్యయనశీలి. పాతతరంలో భూమి కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమైనట్లుగా... సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్‌ల రూపంలో కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం సాగుతోందని గుర్తించిన ఆయన... అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమించారు. 2016లో తన 93వ ఏట కూడా కమ్యూనిస్టులకు వీఎస్ విజయవీచిక అయ్యారు.

# “భారత జాతీయ పతాక నేపథ్యం”

## - జూలై 22... జాతీయ పతాక ఆమోద దినం



20వ శతాబ్దం ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకున్నప్పుడు జాతీయోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతిబింబించే జాతీయ పతాకం అవసరమైంది. 1904లో వివేకానందుడి శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత భారతదేశపు మొట్టమొదటి పతాకాన్ని రూపొందించింది. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా. జెండా మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులున్నాయి. “(భారత) మాతకు వందనం'' అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు (వందేమాతరం)” ఆ జెండా మీదున్నాయి. ఎరుపు స్వాతంత్ర్య పోరాటానికి, పసుపు విజయానికి, తెల్లతామర స్వచ్ఛతకు చిహ్నాలు. 1907 లో మేడం భికాజీ కామా ఎగరేసిన జండా మొట్ట మొదటి త్రివర్ణ పతాకం1905లో జరిగిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో 1906 ఆగష్టు7 న కలకత్తాలోని పార్శీబగాన్ స్క్వేర్లో శచీంద్ర ప్రసాద్ బోస్ చే ఆవిష్కరించ బడింది. ఈ పతాకాన్ని “కలకత్తా పతాకం” అంటారు. ఈ పతాకంలో సమాన వెడల్పుతో అడ్డంగా మూడు పట్టీలున్నాయి: పైన నారింజ రంగు, మధ్యలో పసుపుపచ్చ, క్రింద ఆకుపచ్చ. పైపట్టీ మీద సగం విచ్చుకున్న ఎనిమిది తామర పూలు, క్రింది పట్టీ మీద నెలవంక, మధ్యలో దేవనాగరి లిపిలో “వందేమాతరం” అనే అక్షరాలు ఉన్నాయి. 1917 లో హోంరూల్ ఉద్యమంలో వాడిన జండా, 1907 ఆగష్టు 22 న మేడం భికాజీ కామా జర్మనీ లోని స్టుట్‌గార్ట్ లో మరో జండాను ఎగరేసింది. ఈ జండాలో పైన ఆకుపచ్చ, మధ్యన కాషాయం, అడుగున ఎరుపు రంగులు ఉన్నాయి. ఇందులో ఆకుపచ్చ ఇస్లాముకు, కాషాయం హిందూ, బౌద్ధాలకు సూచికలు. ఆకుపచ్చ పట్టీలో బ్రిటిషు భారతంలోని 8 ప్రావిన్సులకు గుర్తుగా 8 పద్మాలు ఉన్నాయి. మధ్యనున్న కాషాయ పట్టీలో దేవనాగరి లిపిలో వందేమాతరం రాసి ఉంది. అడుగున ఉన్న పట్టీలో స్థంభానికి దగ్గరగా నెలవంక, రెండో చివర సూర్యుడు ఉన్నాయి. ఈ జండాను భికాజీ కామా, వీర సావర్కార్, శ్యాంజీ కృష్ణ వర్మలు కలిసి తయారు చేసారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యాక, బెర్లిన్ కమిటీలోని భారతీయ విప్లవకారులు దీన్ని స్వీకరించాక, ఈ జండా బెర్లిన్ కమిటీ జండాగా పేరు పొందింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసొపొటేమియాలో ఈ జండాను విస్తృతంగా ఉపయోగించారు. గదర్ పార్టీ జండాను కూడా అమెరికాలో భారతీయ చిహ్నంగా కొన్నాళ్ళు ఉపయోగించారు. 1917లో తిలక్, అనీబిసెంట్లు హోంరూల్ ఉద్యమంలో ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చని అడ్డపట్టీలు గల ఇంకొక జెండాను వాడారు. జెండా పైభాగంలో ఎడమవైపు తాము కోరిన డొమినియన్ హోదాకు సూచికగా యూనియన్ జాక్ గుర్తు, కుడివైపు తార-నెలవంక గుర్తులను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తర్షి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలున్నాయి. యూనియన్ జాక్ ఉండడం వల్లనేమో ఇది జనామోదం పొందలేకపోయింది. 1916లో మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించే ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాన్ని గుర్తించిన ఉమర్ సుభాని, ఎస్.బి.బొమ్మన్‌జీ ఇండియన్ నేషనల్ ఫ్లాగ్ మిషన్ ను ఏర్పాటుచేశారు. వెంకయ్య తాను రూపొందించిన పతాకాన్ని గాంధీజీకి చూపించగా, ఆయన దాంట్లో భారతదేశానికీ, దేశం తానెదుర్కొంటున్న సమస్యలనుంచి విముక్తి పొందడానికీ చిహ్నంగా నిలిచిన చరఖా (రాట్నము)ను చేర్చమని సలహా ఇచ్చాడు. నిరాడంబరమైన రాట్నము గాంధీజీ నేతృత్వంలో భారతదేశ ఆర్థిక పునరుత్థానానికి ప్రతీకగా నిలిచింది. పింగళి వెంకయ్య గాంధీ సూచన ప్రకారం ఎరుపు-ఆకుపచ్చ రంగు పట్టీలమీద రాట్నము గుర్తును రూపొందించి చూపాడు. ఐతే అది అన్నిమతాలకూ ప్రాతినిధ్యం వహించేలా లేదని గాంధీ దాన్ని తిరస్కరించాడు. గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకొక త్రివర్ణపతాకం పైనుంచి క్రిందకు వరుసగా తెలుపు, ఆకుపచ్చ, ఎరుపుపట్టీలతో, మూడు పట్టీలమీదుగా ఒకే పెద్ద రాట్నము గుర్తుతో రూపొందించ బడింది. ఆ మూడు పట్టీలు మైనారిటీ మతాలు, ముస్లిం, హిందూ మతాలకు సూచికలు. ఇది అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపోరాటం సాగిస్తోన్న ఐర్లాండు పతాకాన్ని పోలి ఉంది. ఈ పతాకాన్ని అహమ్మదాబాదు కాంగ్రెసు సమావేశంలో ఆవిష్కరించారు. ఇది కాంగ్రెసు అధికార పతాకం కాకపోయినా జాతీయోద్యమంలో ఎక్కువగా వాడారు. ఐతే ఆ జెండాలో మతాలకు చిహ్నాలుండడం చాలామందికి నచ్చలేదు. 1924లో కలకత్తాలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ హిందువులకు చిహ్నాలుగా కాషాయ రంగును, గదను చేర్చాలని కోరింది. అదే సంవత్సరం హిందూ యోగుల, ముస్లిం ఫకీర్లు-దర్వేషీల వైరాగ్యానికి చిహ్నమైన జేగురు రంగును చేర్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. సిక్కులు తమ మత చిహ్నంగా పసుపురంగును కూడా చేర్చాలని, లేనట్టైతే మతపరమైన సూచికలను పూర్తిగా తొలగించాలని కోరారు. భారత దేశంలో అతిపెద్ద రాజకీయ వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు 1921లో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో అనధికారికంగా ఒక పతాకాన్ని రూపొందించుకొంది. ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ ఇస్లాం మతానికి, తెలుపు ఇతర మతాలకు సూచికలు. కాంగ్రెసు 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, మధ్యలో రాట్నము బొమ్మగల పతాకాన్ని తన అధికారిక పతాకంగా స్వీకరించింది. ఈ పతాకంలో ఎటువంటి మతపరమైన ప్రతీకలూ లేవు. 1931లో సూచించబడిన జెండా ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1931 ఏప్రిల్ 2న ఈ వివాదాలను పరిష్కరించడానికి ఏడుగురు సభ్యులతో ఫ్లాగ్ కమిటీని నియమించింది. “జెండాలోని మూడు రంగులూ మతాలనుద్దేశించినవే కాబట్టి అభ్యంతరకరమైనవేనని” కమిటీ తీర్మానించింది. ఫలితంగా పూర్తిగా ఎర్రమట్టిరంగులో, పైభాగాన రాట్నము గుర్తుతో ఒక కొత్త జెండా తయారైంది. దీన్ని ఫ్లాగ్ కమిటీ ఆమోదించినా ఇది కూడా మతపరమైన భావజాలాన్నే సూచిస్తోందనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆమోదించలేదు. 1931లో, పింగళి వెంకయ్య రూపకల్పన చేసి, 1923లో మొదట ఎగిరిన స్వరాజ్ పతాకం అని పేరున్న భారత జాతీయ కాంగ్రెస్ పతాకం భారత జాతీయ పతాకానికి ఆధారం. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వాడిన జెండా, అదే సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ పతాకాన్ని స్వల్ప మార్పులతో - చరఖా స్థానంలో “ఆజాద్ హింద్” అన్న అక్షరాలు, ముందుకు దూకుతున్న పులి బొమ్మతో - వాడుకొంది. ఈ మార్పులు గాంధీ అహింసాయుత పద్ధతులకు, సుభాష్ చంద్ర బోస్ వీరోచిత పద్ధతులకు గల తేడాను ప్రతిబింబిస్తాయి. ఈ త్రివర్ణపతాకం భారత దేశపు గడ్డమీద మొదటి సారిగా బోస్ చేత మణిపూరులో ఆవిష్కరించ బడింది. స్వతంత్ర భారతదేశ జాతీయ పతాకాన్ని నిర్ణయించడానికి రాజ్యాంగసభ, 1947 జూన్ 23న బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, కె.ఎం.పణిక్కర్, సరోజినీ నాయుడు, రాజాజీ, కె.ఎం.మున్షీ, బి.ఆర్.అంబేద్కర్ లతో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 1947 జూలై 14న కాంగ్రెస్ పతాకాన్నే అన్ని పార్టీలకు, మతాలకు ఆమోదయోగ్యమయ్యే మార్పులతో జాతీయపతాకంగా స్వీకరించాలని నిర్ణయించింది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది. 1947 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి కొన్నిరోజుల ముందు ఏర్పాటైన రాజ్యాంగసభ, కాంగ్రెస్ పార్టీ పతాకాన్నే అన్ని పార్టీలకు, అన్ని మతాలవారికి ఆమోదయోగ్యమైన మార్పులు చేసి జాతీయపతాకంగా స్వీకరించడానికి నిర్ణయించింది. అన్నిటికంటే ముఖ్యమైన మార్పు రాట్నము స్థానంలో అశోకచక్రాన్ని చేర్చడం. చరఖా స్థానంలో సారనాథ్ స్థూపంలోని ధర్మచక్రాన్ని చేర్చారు. 1947 జూలై 22న భారత రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రస్తుతం ఉన్న రూపంలో ఆమోదం పొందింది. ఈ కొత్త పతాకాన్ని స్వతంత్ర భారత జాతీయ పతాకంగా ఉద్వేగ భరిత వాతావరణంలో 1947 ఆగష్టు 15 నాడు ఆవిష్కరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తెలంగాణ వైతాళిక కవినేత దాశరథి

## - జూలై 22... దాశరథి కృష్ణమాచార్య శత జయంతి



తెలంగాణలో జన్మించిన గొప్ప వైతాళికులలో, మహాకవి దాశరథి అగ్ర శ్రేణికి చెందిన వారు. హైదరాబాద్ సంస్థాన విముక్తి మహోద్యమంలో దూకి, నిజాం నవాబు అలీఖాన్ ను ఎదిరించి, తెలంగాణ విముక్తికై కారాగార శిక్ష అనుభవించి, లక్ష్యాన్ని సాధించిన స్వాతంత్రోద్యమ కవి సింహం దాశరథి. దాశరథిగా సుపరిచితులు అయిన - దాశరథి కృష్ణమాచారి 1925 జూలై 22 నాడు, ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా, చినగూడూరు గ్రామంలో శ్రీమతి వేంకటమ్మ, శ్రీమాన్ వేంకటాచార్యులకు జన్మించారు. దాశరథి రంగాచారి దాశరథి ఆయన తమ్ముడు. చినగూడూరులో నాల్గవ తరగతినీ, ఖమ్మం ఉస్మానియా హైస్కూల్ లో మెట్రిక్యులేషన్ నూ పూర్తి చేశారు. ఖమ్మంలో చదువు కుంటున్నప్పుడే మీర్జాగాలిబ్ శృంగారాత్మక సాహిత్యాన్ని, ఇక్బాల్ విప్లవ గీతాలను అధ్యయనం చేశారు. మరోవైపు ఉపనిషత్తుల సారాన్ని ఎదనిండా నింపు కున్నారు దాశరథి .“నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనొ అందాక ఈ భూగోళమ్మున అగ్గి పెట్టెదను” %-% అంటూ విప్లవ చైతన్య మూర్తియై ప్రజ్వరిల్లినారు. ప్రజల బాధలకు,కారణ భూతులైన భూస్వాముల ఆటకట్టించాలనీ, రైతుల హక్కుల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులతో కలిసిపోయారు. కార్యకర్తగా, కావ్యకర్తగా ఉద్యమించారు. కోయగూడేలలో తిరిగి వాళ్లను సమైక్య పరచారు. లంబాడీలను, హరిజనులను, రైతులను, కూలీలను, వర్తకులను మేల్కొలిపి, వాళ్లను స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములుగా చేశారు. పుంఖానుపుంఖంగా కవితలు రచించి, పీడిత ప్రజల, భావాలకు ప్రతినిధిగా తన కలాన్ని ఝుళిపించారు. తెలుగు భాషా సంస్కృతుల పునరుద్ధరణ కోసం ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలలో పాల్గొని, కావ్యగానం చేసేవారు దాశరథి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవ సభ 1944 లో ఓరుగల్లు కోటలో ఏర్పాటైంది. రజాకార్లు సభపై - వేసిన పచ్చని పందిళ్లను తగులబెట్టారు. అప్పుడు దాశరథి నిర్భయంగా- “ జ్వాలలో ఆహుతి అయిపోతాం గాని, కవి సమ్మేళనం జరిపి తీరుతాం ” అంటూ గళం విప్పి “ఓ పరాధీన మానవా! ఓపరాని దాస్యము విదల్చ లేని శాంతమ్ము మాని, తలుపులను ముష్టి బంధాన కలచివైచి, చొచ్చుకొని పొమ్ము స్వాతంత్ర్య సురపురమ్ము” %-% అంటూ ప్రబోధించారు. సభాధ్యక్షులైన సురవరం ప్రతాపరెడ్డి వెంటనే లేచి ‘సింహగర్జన చేశావు నాయనా’ అంటూ దాశరథిని మెచ్చుకొన్నారు. దేవులపల్లి రామానుజరావు దాశరథి మెడలో పుష్పహారం వేసి కౌగలించు కొన్నారు. తరువాత ‘మంచిర్యాల’లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభా కవి సమ్మేళనానికి, దాశరథి అధ్యక్షత వహించి ప్రజలను ప్రబోధించారు. 1945-46 ప్రాంతంలో దాశరథికి కమ్యూనిస్ట్ లతో అభిప్రాయ భేదాలేర్పడ్డాయి. అప్పుడు దాశరథి హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడానికీ, మహోద్యమాన్ని సాగిస్తున్న ‘ స్టేట్ కాంగ్రెసు’ లో చేరినారు. స్వామీ రామానందతీర్థ నాయకత్వంలో, జమాలాపురం కేశవరావు, కొండా వెంకటరంగారెడ్డి, మాడపాటి హనుమంతరావు మొదలగు వారితో కలసి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. “ఇదేమాట ఇదేమాట పదేపదే అనేస్తాను” అంటూ, “నిజాం రాజు జన్మజన్మల బూజు” అంటూ, ఉద్యమ కవితావేశ మూర్తియై, దాశరథి సత్యాగ్రహానికి తలపడ్డారు. అప్పటి దాకా పొంచి ఉన్న పోలీసులు ‘గార్ల ‘ గ్రామంలో, దాశరథిని అరెస్టు చేసి, నిజాం ప్రభుత్వం దాశరథికి 16 నెలల కఠిన కారాగార శిక్షను విధించింది. కొన్ని నెలలు వరంగల్ జైల్లో ఉంచి, తరువాత దాశరథిని నిజామాబాద్ సెంట్రల్ జైలుకు పంపింది. నిజామాబాద్ జైల్లో దాశరథి ముఖం కడుక్కునే బొగ్గుతో జైలు గోడ మీద “ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజుకు మాకెన్నడేని తీగెలను తెంపి, అగ్నిలో దింపినావు నాతెలంగాణ కోటి రత్నాల వీణ ” అని రాస్తే జైలు అధికారులు తుడిచి వేయించారు. అపుడు అదే జైల్లో ఉన్న వట్టికోట ఆళ్వారు స్వామి, మళ్లీ మళ్లీ గోడ మీద రాసేవారు. జైల్లో దాశరథి స్వామి రామానంద తీర్థను దర్శించు కొన్నారు. స్వామీజీ దాశరథి సాహసాన్ని ప్రశంసించినారు . “నా తెలంగాణ తల్లి కంజాతవల్లి” - “నా తెలంగాణ కోటి అందాల జాణ” %-% “నా తెలంగాణ సీమ సౌందర్య సీమ”- “నా తెలంగాణ కోటి రత్నాల వీణ” అంటూ తెలంగాణ తల్లిని వేనోళ్లా ప్రశంసించిన తెలంగాణ ముద్దు బిడ్డ దాశరథి. “తెలంగాణలోని కోటి ధీరుల గళధ్వనినె గాక ఇలా గోళ మందుండెడి ఎల్లరి శబ్దాన్ని నేను నా పేరు ప్రజాకోటి నా ఊరు ప్రజావాటి” అని చాట గలగిన ప్రపంచ ప్రజాకవి దాశరథి. “అగ్నిధార” మొదలు ‘ నేత్రపర్వం ‘ దాకా ముప్పైకి పైగా, గ్రంథాలు రచించారు దాశరథి. 200 కు పైగా చలన చిత్రగీతాలు రాశారు. దాశరథిని గూర్చి అనేక విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. ఆయన రచనలు అనేక భాషలలోనికి అనువాదిత మైనాయి. తెలుగులో గజల్ రుబాయీ ప్రక్రియలను, ప్రప్రథమంగా ప్రవేశ.పెట్టిన ప్రయోక్త దాశరథి మహాకవే. ‘జాతీయోద్యమ రథసారథిగా’ భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చేతుల మీదుగా తామ్రపత్ర సన్మానాన్నీ, అప్పటి ఉప రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకట్రామన్ చేతుల మీదుగా సన్మానాన్ని అందు కొన్నారు దాశరథి. ‘కళాప్రపూర్ణ’, ‘డి.లిట్’ వంటి గౌరవ పట్టాలతో వివిధ విశ్వ విద్యాలయాలు దాశరథిని సన్మానించాయి. అమెరికా తెలుగు వాళ్లు ‘ ఆంధ్ర కవితా సారథి’ గా సన్మానించారు. ఒంగోలు ‘ గండపెండేరం ‘ తొడిగి సన్మానించింది. వరంగల్లు దాశరథికి స్వర్ణోత్సవం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 లో ఆస్థానకవిగా నియమించి సన్మానించింది. అనేక దేశాలలో పర్యటించి , దాశరథి తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను గూర్చి ప్రసంగించారు. దాశరథి అనారోగ్యానికి గురై 1987 నవంబరు 5 వ తేదీ ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**





పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ ‘హరి హర వీరమల్లు’. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకులు. నిధి అగర్వాల్ కథానాయిక. ఏఎం రత్నం నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ మూవీ జులై 24న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈసందర్భంగా టీమ్ స్పెషల్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఇందులో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పోడియం లేకుండా మాట్లాడటం కష్టంగా ఉందని నవ్వుతూ పవన్ తన స్పీచ్‌ను ప్రారంభించారు. “నా జీవితంలో సినిమాపరంగా మీడియాతో మాట్లాడడం ఇదే తొలిసారి. సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో నాకు తెలియదు. దీనికోసం ఇంత కష్టపడ్డాం అని చెప్పడం నాకు మొహమాటంగా ఉంటుంది. నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నా ఫొటోలు కూడా పేపర్లో వేయలేదు. దీంతో పబ్లిసిటీ లేకుండానే నా సినిమాలు రిలీజ్ అయ్యాయి. సినిమా గురించి నాకు ఏం మాట్లాడాలో తెలియదు. ఈ ప్రెస్‌మీట్ పెట్టడానికి కారణం ఏఎం రత్నమే. సినిమాను తెరకెక్కించాలంటే ఎన్నో యుద్ధాలు చేయాలి. మన చిత్ర పరిశ్రమని పాన్‌ఇండియా స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తి రత్నం. ఈ సినిమా చాలా ఒడుదొడుకులు ఎదుర్కొంది. నేను పాలిటిక్స్‌కు వెళ్లిపోయిన తర్వాత సినిమాకు టైం ఇవ్వలేకపోయాను. అయినప్పటికీ నా బెస్ట్ ఇచ్చాను. గతంలో నేను నేర్చుకున్న మార్షల్‌ఆర్ట్స్ ఈ సినిమాకు ఎంతో పనికి వచ్చింది” అని పవన్ వివరించారు.

**అందుకే ప్రత్యర్థులు తిడుతున్నా వచ్చా..** “ఈ సినిమాకు క్లైమాక్స్ ఆయువుపట్టు. కోహినూర్ వజ్రం చుట్టూ కథ తిరుగుతుంది. క్రిష్ చాలా మంచి కాన్సెప్ట్‌తో ముందుకువచ్చారు. ఆయనకు మా టీమ్ అందరి తరపున కృతజ్ఞతలు. ఒక్కోసారి ఇండస్ట్రీ చాలా కఠినంగా ఉంటుంది. రత్నం ఎంతో ముందుచూపు ఉన్న నిర్మాత. ఆయన ఈ సినిమా కోసం ఎంతో నలిగిపోయారు. ఈ సినిమా పూర్తవుతుందా, లేదా? అని అనుకున్నప్పుడు దీనికి కీరవాణి ప్రాణం పోశారు. ఒక్కోసారి డబ్బులు, సక్సెస్ కోసం కాదు ఇండస్ట్రీ బాగుకోరే వ్యక్తుల వెంట నిలవడం ఎంతో ముఖ్యం. అందుకే ప్రత్యర్థులు తిడుతున్నా ఈ మీటింగ్‌కు వచ్చాను. ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా రత్నం పేరును ప్రతిపాదించాను. నాకు సినిమా అన్నం పెట్టింది. సినిమా అంటే నాకు ప్రాణవాయువుతో సమానం” అని పవన్ తెలిపారు.

**రేపు నా కుమారుడైనా అంతే..** “మిగతా హీరోలకు బిజినెస్ అయినంతగా నా సినిమాలకు అవ్వదు. నేను ప్రజల కోసం దృష్టిపెట్టాను. బాబీడియోల్ అద్భుతంగా చేశారు. ఈ సినిమా ప్రమోషన్‌ను నిధి తన భుజాలపై వేసుకుంది. ఈ సినిమా అనాథ కాదు.. నేనున్నా అని చెప్పడానికే వచ్చాను. కోట్లాది మంది ప్రజలకు అండగా ఉండేవాడిని. దేశ సమస్యల కోసం పోరాటాలు చేసేవాడిని. నా సినిమాకు అండగా ఉండలేనా అనిపించింది. నా సినిమాల సమయంలో గతంలో ఎన్నో ఇబ్బందులు పెట్టారని మీకూ తెలుసు. మన ప్రభుత్వం చిత్రపరిశ్రమను ఎంతో ఆదరిస్తోంది. అందుకే ఈ సినిమా ప్రచారంలో భాగం కావాలని వచ్చాను.

భారతీయ సినిమాకు కుల, మత భేదాలు ఉండవు. క్రియేటివిటీ మీదనే ఆధారపడి ఉంటుంది. చిరంజీవి కుమారుడైనా, తమ్ముడైనా ఎవరైనా టాలెంట్ లేకపోతే నిలబడలేరు. రేపు నా కుమారుడైనా అంతే. ఇక్కడ ప్రతిభే ముఖ్యం” అని పవన్ పేర్కొన్నారు. “ఈ సినిమా కోసం తెల్లవారుజామున 2 గంటలకు లేచి కష్టపడేవాడిని. జ్యోతికృష్ణ ఎంతో సత్తా ఉన్న దర్శకుడు. ఈ సినిమా ఫలితం పూర్తిగా ప్రజల చేతిలో ఉంటుంది. మిగతా వారితో పోలిస్తే నేను కొన్ని పనులు చేయలేను. సుస్వాగతం సినిమాలో బస్సు మీద ఎక్కి డ్యాన్స్ చేయమన్నారు. నేను చేయలేక చచ్చిపోయా. సినిమాలు చేయలేను మానేస్తాను అని మా వదిన (చిరంజీవి సతీమణి సురేఖ)కు కూడా చాలాసార్లు చెప్పాను. యాక్షన్ సీక్వెన్స్ కూడా మార్షల్ ఆర్ట్స్ చేశా కాబట్టి అవగాహన ఉంది. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అని వేరు చేయడం నాకు నచ్చదు” అని పవన్ అన్నారు. ఈ సినిమాలో 20 నిమిషాల ఫైట్ సన్నివేశానికి పవన్‌కల్యాణ్ కొరియోగ్రఫీ చేశారని దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పారు. పవన్‌తో నటించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు నటి నిధి అగర్వాల్ అన్నారు.

# ప్రజల మనసుల్లో నిలిచిన శతాధిక వత్సర కమ్యూనిస్టు నేత వి.ఎస్. అచ్యుతానందన్



వామపక్ష సిద్ధాంతాలకు జీవ రూపంగా, ప్రజాస్వామ్యానికి జీవ నాడిగా, అవినీతి వ్యతిరేక పోరాటాలకు సంచలనం సృష్టించిన నేతగా నిలిచిన వీఎస్ అచ్యుతానందన్ పేరు కేరళ రాజకీయ చరిత్రలో ఓ తిరుగులేని మైలురాయి. అనాథ బాల్యం నుంచి ముఖ్యమంత్రి పీఠం వరకు ఆయన చేసిన యాత్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సాగింది. పార్టీ శక్తికే నిదర్శనంగా, విలువల పరిరక్షకుడిగా ఆయన జీవితం అనేక రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచింది. గత కొంతకాలంగా వయో భారం కారణంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన గుండె పోటుతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 21జూలై 2025 సోమవారం తుదిశ్వాస విడిచారు. వి.ఎస్. అచ్యుతానందన్ జననం అక్టోబర్ 20, 1923న అలెప్పి జిల్లాలోని పున్నప్రా గ్రామంలో ఓ వెనుకబడిన కులానికి చెందిన వ్యవసాయ కూలీ కుటుంబంలో జరిగింది. అతి చిన్న వయస్సులో తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన, ఏడవ తరగతి వరకే విద్యను అభ్యసించి ఆ తరువాత స్వీయ బోధన ద్వారా మలయాళంలో నైపుణ్యం సంపాదించాడు. ముద్రణ కారుడిగా జీవనం ప్రారంభించిన ఆయన, ప్రజల కష్టాలను నేరుగా అనుభవించి, ఉద్యమాలలో చురుకుగా పాల్గొనడం ప్రారంభించాడు. 1940లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ)లో చేరిన అచ్యుతానందన్ 1946లో జరిగిన పున్నప్రా-వయలార్ రైతు ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ఉద్యమంలో పాల్గొనడం వల్ల ఆయనపై బ్రిటీష్ రాజ్ పోలీస్ కేసులు నమోదు చేయగా, అనేక కాలం పాటు ఆయన అండర్‌గ్రౌండ్ జీవితాన్ని గడిపాడు. 1964లో సిపిఎం స్థాపన తర్వాత ఆయన ఆ పార్టీతో కొనసాగాడు. అంతటి ఉద్యమ నేపథ్యాన్ని కలిగిన అచ్యుతానందన్ రాజకీయ ప్రస్థానం కూడా సమానంగా ప్రభావవంతంగా సాగింది. 1967లో తొలిసారిగా కేరళ శాసనసభకు ఎన్నికైన ఆయన, ఆ తరువాత 1991, 1996, 2001, 2006, 2011, 2016 సంవత్సరాల్లో వరుసగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన మొత్తం 7 సార్లు శాసనసభ సభ్యుడిగా సేవలందించారు. 1992 నుంచి 1996 వరకూ సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శిగా, ఆపై 1998 నుంచి 2005 వరకు పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. 2006 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 82 ఏళ్ల వయస్సులో సీఎంగా ఎన్నికైన అచ్యుతానందన్ ప్రజల్లో అపూర్వ ఆదరణ పొందాడు. ముఖ్యమంత్రిగా ఆయన పాలనలో ప్రధానంగా అవినీతి నిరోధక చర్యలు, భూ ఆక్రమణలపై సుదీర్ఘ పోరాటం, హరిత అభియాన్, గనుల అక్రమాలపై విచారణలు, ఐటీ రంగ అభివృద్ధి, ఆరోగ్య-విద్య రంగాలలో సామాజిక మద్దతు కార్యక్రమాలు కేంద్రంగా నిలిచాయి. 2007లో ఆయన టెక్నో పార్క్ విశాలీకరణ, కొచ్చి స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుట్టారు. 2008లో కేరళలో మొదటిసారిగా వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ పెంపు, చిన్న రైతులకు భూ హక్కుల చట్టాన్ని అమలు చేయడం వంటి చర్యలు ఆయన ప్రభుత్వం చేపట్టింది. అయితే పార్టీ అంతర్గత విభేదాల కారణంగా 2009లో పొలిట్‌బ్యూరో నుండి ఆయనను తొలగించగా, 2011లో ఎన్నికల్లో ఆయనను సీఎంగా ప్రకటించనందుకు పార్టీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయినా తన నియోజకవర్గమైన మాలంపుఝా నుంచి పెద్ద మెజార్టీతో గెలిచి తిరిగి శాసనసభకు వచ్చారు. 2016లో మళ్లీ మాలంపుఝా నియోజకవర్గం నుంచి విజయం సాధించగా, వయో పరిమితిని దృష్టిలో ఉంచుకుని ఆయనకు అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్ కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. అచ్యుతానందన్ తన రాజకీయ జీవితం మొత్తం అవినీతికి వ్యతిరేకంగా, ప్రజల హక్కుల కోసం, స్వచ్ఛ పాలన కోసం ధీటుగా పోరాడిన మహానాయకుడిగా నిలిచారు. ఆయనపై ‘లాల్ సలాం’ అనే డాక్యుమెంటరీ తీసిన చలనచిత్ర దర్శకులు ఆయనను “జీవితమంతా ప్రజా ఉద్యమమే” అని వివరించారు. తన అధికారిక జీతాన్ని పార్టీకే విరాళంగా ఇచ్చిన ఆయన జీవితం నిజమైన కమ్యూనిస్టు నేతకు గర్వకారణం. ఆయన రచనలు, ప్రసంగాలు ప్రజల్లో రాజనీతిపై నమ్మకాన్ని పునః స్థాపించాయి. “నేను పుట్టిన రోజు జరుపుకోను %-% ఎందుకంటే అది ఒక్క నాకే కాదు, ఎప్పటికీ శ్రమజీవులందరికీ!” అని అన్న ఆయన మాటలు, జీవితం నేటికీ ప్రజల గుండెల్లో మార్మోగుతూనే ఉన్నాయి. పార్టీలోని ఆంతరార్థిక రాజకీయాలు ఎంతగా అవమానించాయి గానీ ప్రజల ప్రేమను మాత్రం అచ్యుతానందన్ ఎప్పటికీ కోల్పోలేదు. కమ్యూనిజాన్ని నైతికతతో ముడిపెట్టి, ప్రజల మధ్య నిబద్ధతతో నడిచిన ఈ నేత జీవితంలో అనేక మలుపులు ఉన్నా, విలువల పట్ల చిత్తశుద్ధి మాత్రం అసలే మారలేదు. ప్రజాస్వామ్యానికి స్పష్టమైన అర్థం చెప్పిన, నాయకత్వం అంటే సేవ అని చూపించిన, పార్టీ అనే పదాన్ని ప్రజల పక్షంలో నిలబెట్టిన అచ్యుతానందన్ భారతీయ రాజకీయ చరిత్రలో ఒక చిరస్మరణీయ చిహ్నంగా నిలిచిపోతారు. రాజకీయ నాయకులంతా అధికారాన్ని కాదు, బాధ్యతను మానవికంగా చూసే విధంగా మారాలంటే, ఆయన జీవితాన్ని అధ్యయనం చేయాల్సిందే. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# చురకలు

## సంపాదకీయం

## ప్రధాని మోడీ విదేశీ పర్యటనల లెక్కే వేరప్పా!

సాధారణంగా దేశ ప్రధానిగా ఉన్న వారు విదేశీ పర్యటనలు చేస్తుంటారు. అదేమీ తప్పు కూడా కాదు. కానీ.. అదే పనిగా విదేశీ పర్యటనలు చేసే ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ దేశ చరిత్రలో నిలుస్తారు. ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రిగా వ్యవహరిస్తున్న ఆయన గతాన్ని చూస్తే.. అప్పుడప్పుడు అదే పనిగా విదేశీ పర్యటనల్ని చేస్తుండటం కనిపిస్తుంది. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఆయన 90 విదేశీ పర్యటనలు చేశారు. మొత్తంగా 78 దేశాల్ని పర్యటించారు. భారత దేశ చరిత్రలో అత్యధిక దేశాల్లో పర్యటించిన ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ నిలుస్తారు. అత్యధికంగా అమెరికాను ఈ పదకొండేళ్ల సమయంలో పదిసార్లు పర్యటించటం విశేషం. ఆ తర్వాతి స్థానంలో ఫ్రాన్స్ (8సార్లు) వెళ్లారు. ఇప్పటివరకు 7సార్లు జపాన్.. రష్యా.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ను సందర్శించారు. జర్మనీని ఆరుసార్లు.. చైనా.. నేపాల్.. సింగపూర్ దేశాల్ని ఐదు సార్లు.. బ్రెజిల్.. శ్రీలంక దేశాల్ని నాలుగు సార్లు పర్యటించారు. భూటాన్.. ఇండోనేషియా.. సౌదీ.. దక్షిణాఫ్రికా.. థాయిలాండ్.. యూకే.. ఉజ్జెకిస్తాన్ దేశాల్ని మూడుసార్లు పర్యటించగా.. ఆఫ్ఘనిస్తాన్ , అర్జెంటీనా , ఆస్ట్రేలియా , బంగ్లాదేశ్ , కెనడా , ఇటలీ , కజకిస్తాన్ , లావోస్ , కిర్గిజ్తాన్ , మలేషియా , మాల్దీవులు , మారిషస్ , మయన్మార్ , ఖతార్ , దక్షిణ కొరియా , స్విట్జర్లాండ్ దేశాల్ని రెండుసార్లు చొప్పున పర్యటించారు. ఇవి కాకుండా మరో 44 దేశాల్ని ఒక్కసారి చొప్పున పర్యటించిన రికార్డు మోడీ సొంతం. అంతెందుకు ఈ నెల 2 నుంచి 9 వరకు ఐదు (ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా) దేశాల్లో పర్యటించిన సంగతి తెలిసిందే. పదకొండేళ్లు ప్రధానిగా ఉన్న మోడీ.. తాను చేసిన సుదీర్ఘ విదేశీ పర్యటనల్లో ఇదొకటిగా నిలిచింది. ఈ టూర్ లో ఆయన రెండు ఖండాల్ని సందర్శించారు. ప్రధాని హోదాలో మోడీ ఒకే పర్యటనలో ఐదు దేశాల్ని పర్యటించిన రెండో సందర్భంగా ఈ టూర్ ను చెప్పాలి. 2015 జులైలోనూ ఎనిమిది రోజుల్లో ఆరు దేశాల్లో పర్యటించిన రికార్డు ఉంది. ఈ జులైలోనూ ఆయన 8 రోజుల ఫారిన్ టూర్ ముగించుకొని వచ్చిన 2 వారాల్లోనే మరోసారి 3 రోజుల పాటు (జులై 23 - జులై 26) యూకే.. మాల్దీవుల పర్యటనకు మోడీ వెళ్లేందుకు వీలుగా షెడ్యూల్ సిద్ధమైంది. స్వల్ప వ్యవధిలోనే బ్యాక్ టు బ్యాక్ ఫారిన్ టూర్లు వేస్తున్నప్రధానిగా మోడీనే కనిపిస్తారు. ఆసక్తికరమైన మరో అంశాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. ఈ నెలాఖరులో యూకే.. మాల్దీవులకు వెళ్లి వచ్చిన కొద్ది రోజులకే జపాన్.. చైనా.. మలేషియా..సౌతాఫ్రికా.. నార్వే దేశాలకు సంబంధించిన ఫారిన్ టూర్లు ఇప్పటికే షెడ్యూల్ అయి ఉన్నాయి. ఏమైనా.. ఇంత భారీగా విదేశీ పర్యటనలు చేసిన దేశ ప్రధాని మోడీ రికార్డును మాత్రం సమీప భవిష్యత్తులో బ్రేక్ చేయటం సాధ్యం కాదనే చెప్పాలి.

## తొలి మహిళా కార్టూనిస్టు రాగతి పండరి - జూలై 22... రాగతి పండరి జయంతి



రాగతి పండరి పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చేవి నవ్వు తెప్పించే కార్టూన్లే. ఆమె పేరు తెలియని సాహిత్య అభిమానులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. వ్యంగ్య చిత్రాలతో నవ్వించాలనే లక్ష్యంతో అన్ని అడ్డంకులను అధిగమించి జీవిత ఆశయం నెరవేరుకున్న అపురూప కళాకారిణి. సామాజిక అంశాలను ప్రతిబింబించే కార్టూన్లు గీస్తూ మన్ననలు, పురస్కారాలూ అందుకున్న కార్టూనిస్టు రాగతి పండరి. విధి వంచితయై, నాలుగడుగులు వేసి చుట్టూ ఉన్న ప్రపంచంలో స్వేచ్ఛగా తిరిగే భాగ్యానికి నోచుకోక పోయినా అన్నింటిని అవగాహన చేసుకొని హాస్యంలో రంగరించి లక్ష్యాన్ని చేరుకున్న ఘనత, అసమాన ప్రతిభ ఆమెకే సొంతం. రాగతి పండరి (జూలై 22, 1965 – 19 ఫిబ్రవరి, 2015) తెలుగు వ్యంగ్య చిత్రకారులలో రాశిలోనూ, వాసిలోనూ సమానమైన కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించుకున్న ఏకైక మహిళా కార్టూనిస్టు. అంతే కాదు, అనతి కాలంలోనే తెలుగు వ్యంగ్య చిత్ర కళా రంగంలో ఎనలేని పేరు తెచ్చుకుని, ఆ రంగంలో అగ్రగణ్యులైన బాపు, జయదేవ్ ల సరసన నిలబడ గలిగిన స్థాయి చేరుకున్న గొప్పతనం ఆమెది. ఆ గొప్పతనం వెనక అకుంఠిత దీక్ష, అంకిత భావంతో కృషి, వ్యంగ్య చిత్ర కళ మీద ఎనలేని ప్రేమ, నిరంతర పరిశ్రమ ఉన్నాయి. దురదృష్ట వశాత్తూ, ఆమెకు చిన్నతంలో వచ్చిన పోలియో మూలంగా శారీరకంగా బలహీనురాలైనా, ఆ బలహీనతను అధిగమించి, మానసిక ఒత్తిడిని అతిక్రమించి, తనకు ఇష్టమైన కళకే అంకితమై, కార్టూన్లు గీసి అందరి మన్ననలు పొందారు. ఆమె కార్టూనులో ఏ మూల వెదికినా తేట తెలుగు దనమే, ఏ చోట స్పృశించినా తేనెల తెలుగు మాటలే దర్శనం ఇస్తాయి. పండగలు, పబ్బాలు, అల్లుళ్ళు, ఆడ పడుచులు, దొంగలు, పోలీసులు, ఆఫీసులు, పార్కులూ, ఆమె తాకని విషయం లేదు, లాగని తీగ లేదు, నడవని డొంక లేదు. తెలుగు వ్యంగ్య చిత్ర రంగంలో అనేక వ్యంగ్యచిత్ర ధారా వాహికలు వార పత్రికలలో నిర్వహించిన ఘనత ఆమెదే. పన్నెండు వేలకు పైగా కార్టూన్లు వేసిన ఏకైక మహిళగా ఆమె గుర్తింపు పొందారు. రాగతి పండరి 1965 సంవత్సరం జూలై 22 న విశాఖ పట్టణంలో రాగతి గోవిందరావు, శాంతకుమారి దంపతులకు జన్మించారు. చదువు ఇంటి వద్దనే కొనసాగింది. అతి చిన్న వయసులోనే పోలియో వచ్చి, శారీరక లోపం ఏర్పడినా, పట్టుదల, ధైర్యం కలిగి జీవితాన్ని ఆత్మ విశ్వాసంతో, కఠోర పరిశ్రమతో ఎదుర్కొని, కార్టూన్ రంగంలో అగ్రగణ్యుల సరసన చేరారు. ఆమె తన వ్యంగ్య చిత్ర ప్రస్థానాన్ని 1973లో తన 8వ ఏటనే మొదలు పెట్టారు. బాల్యంలోనే వ్యంగ్య చిత్రాలు ప్రచురణ ప్రారంభ మయ్యింది. 1980-1990 దశకాల మధ్య కొన్ని వేల వ్యంగ్య చిత్రాలను శరపరంపరగా చిత్రించారు. పాఠకుల మనసులను దోచుకున్నారు. అన్ని ప్రముఖ వార, మాస పత్రికలలో ఆమె కార్టూన్లు ప్రచురించ బడ్డాయి. పండుగల సందర్భాలలో పత్రికల సంపాదకులు ఆమె కార్టూన్లను కోరుకుని, అడిగి తెప్పించుకుని తమతమ పత్రికలలో ప్రచురించేవారు. రాగతి పండరి ఆలోచన వచ్చిందే తడవుగా కాగితంపై పెన్సిల్‌తో గీతలు కూడా గీసు కోకుండా నేరుగా స్కెచ్ పెన్నుతోనే కార్టూన్ వేసే వారు. ఆ క్రమంలో ఐదు పది నిమిషాల స్వల్ప వ్యవధి లోనే కార్టూన్ గీసే విభిన్నమైన శైలి ఆమెది. జయదేవ్ గురువుగా భావించి ఆయన శైలిలో కొద్దిరోజుల పాటు కార్టూన్లు వేసినా, వేగంగా తనదంటూ ఓ ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకుని ఆమె గీత చూడగానే గుర్తుపట్టేలా శైలిని ఏర్పరుచు కున్నారు. రాగతి పండరి కార్టూన్లలో ఆడవారిని గయ్యాళి భార్య గానో, అత్త గానో మాత్రమే కాకుండా, అనేక ఇతర పాత్రలను, సృష్టించి, చూపించారు. కుదురైన చక్కటి చిత్రీకరణ, గుండ్రటి చేతివ్రాత, తేట తెలుగులో సంభాషణలు ఆమె వ్యంగ్య చిత్రాల ప్రత్యేకత. తెలుగు వ్యంగ్య చిత్రరంగంలో అనేక వ్యంగ్యచిత్ర ధారావాహికలు వార పత్రికలలో నిర్వహించిన ఘనత ఆమెది. సమకాలీన వ్యంగ్య చిత్రకారులలో, వార్తా పత్రికలలో పనిచేస్తూ ఉన్న కార్టూనిస్టులను మినహాయిస్తే, రాజకీయ వ్యంగ్య చిత్రాలు వేసే ఏకైక ఫ్రీలాన్స్ కార్టూనిస్టు ఆమె. 'రాజకీయ చెదరంగం' అన్న పేరుతో ఒక దశాబ్దం పైగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురించబడటం తనకెంతో ఆనందం కలిగించిందని ఆమె చెబుతుండే వారు. ఆమె వ్యంగ్య చిత్రాలు హాస్యం ప్రధానంగా, ఆకర్షణీయంగా ఉండి, మానవ ప్రవృత్తిలో ఉన్న ద్వంద్వ అలోచనా విధానం, సామాజిక దురాచారాల పట్ల విమర్శల తో ఆమె పాఠకులను నవ్వులలో ముంచెత్తటమే కాకుండా, ఆలోచించటానికి కూడా ఉద్యుక్తులను చేస్తాయి. 2001 సంవత్సరం ఉగాది పురస్కారం ఆంధ్ర ప్రదేశ్ అప్పటి గవర్నర్ సి.రంగరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. రాగతి పండరి కార్టూన్ సామ్రాజ్యాన్ని మొత్తం తన కైవసం చేసుకున్న ఏకైక మహిళ కార్టూనిస్టుగా పేరు ప్రఖ్యాతులు నార్జించారని ఆమె గురు తుల్యులు కార్టూనిస్టు జయదేవ్, వ్యాఖ్యానించారు. కాలక్రమేణా, తనకంటూ స్వంత శైలి ఏర్పరుచుకుని, చాలామంది మగ తెలుగు కార్టూనిస్టులు, వృత్తిపరంగా అసూయ పడేలా దూసుకు వచ్చిన ఒకే ఒక మహిళా కార్టూనిస్టుగా కార్టూనిస్టు రామకృష్ణ అభివర్ణించారు. కార్టూన్ల సాధనలో మొదట్లో తాను గీసిన చిత్రాలను చెన్నైలో నివసించే కార్టూనిస్టు జయదేవ్‌కు పండరి పంపితే మెచ్చుకోవడమే కాకుండా, ఆయన జవాబు రాస్తూ, కార్టూన్లను అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. స్వయంగా విశాఖపట్నం వచ్చి తన శిష్యురాలిని అభినందించారు... బాపు అంతటి గొప్ప చిత్రకారుడు రచన మాస పత్రికలో 2005లో ప్రచురించిన వినాయక చవితి కార్టూన్ మెచ్చుకొంటూ లేఖ రాసి, పండరి కార్టూన్‌కు బాపు బొమ్మ గీయడం విశేషం. 2015 ఫిబ్రవరి 19 న విశాఖపట్టణంలో ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధితో కన్ను మూశారు. ఆమె కోరిక ప్రకారం కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను సావిత్రిబాయి పూలే మెమోరియల్ ట్రస్ట్ ద్వారా దానం చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## "ఆరోగ్యానికి అగ్రస్థానం - మెదడు సంరక్షణే అసలైన జీవన పథం" - జూలై 22...ప్రపంచ మెదడు దినోత్సవం

జూలై 22న ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా "ప్రపంచ మెదడు దినోత్సవం" జరుపుకోవడం ఆరోగ్య పరిరక్షణ చరిత్రలో ఒక కీలకమైన ఘట్టంగా నిలుస్తోంది. మానవ శరీరంలోని అత్యంత సంక్లిష్టమైన, అత్యంత విలక్షణమైన అవయవం అయిన మెదడుపై ప్రజల్లో గౌరవ భావన, అవగాహన కలిగించాలనే దృష్టితో 2014లో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీ ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. నిజానికి 2013లోనే న్యూరాలజీకి సంబంధించిన అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న ఆలోచన తలెత్తింది. ఆ సంస్థ స్థాపితమైన తేదీ అయిన జూలై 22, 1957ను గుర్తు చేసుకోవడానికి 2014 నుంచి ప్రతి సంవత్సరం ఇదే రోజున "వరల్డ్ బ్రెయిన్ డే" నిర్వహిస్తున్నారు. నాడీ వ్యవస్థకు హృదయం ఎంతైనా అవసరమైతే, దాన్ని నడిపించే నియంత్రణ కేంద్రంగా మెదడు తలమానికంగా నిలుస్తుంది. భావోద్వేగాలు, జ్ఞాపక శక్తి, ఆలోచనా విధానం, బుద్ధి, తర్క శక్తి, శరీర కదలికలు, నిద్ర, శ్వాస, భయాలు, ఆనందం, హాస్యం, రోదనం – అన్నీ మెదడే నిర్ణయిస్తుంది. ఇది దెబ్బతింటే వ్యక్తిత్వమే మారుతుంది. కానీ ఈ కేంద్రాన్ని మనం పట్టించుకునే తీరు, దానిపై కసరత్తులు చేసే స్థాయి, ఆరోగ్య పరిరక్షణకై చూపే శ్రద్ధ – ఇవన్నీ నిర్లక్ష్యంగా మారి పోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ మెదడు దినోత్సవం ఎంతో అవసరమైన సంఘటనగా నిలుస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 100 కోట్ల మందికి పైగా ప్రజలు మెదడు సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారు. వీటిలో మైగ్రేన్, స్ట్రోక్, మూర్ఛ (ఎపిలెప్సీ), అల్జీమర్స్, పార్కిన్సన్స్, మల్టిపుల్ స్క్లెరోసిస్, ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజురీ వంటి వ్యాధులు ముఖ్యమైనవిగా ఉన్నాయి. ఒక్క మైగ్రేన్ వ్యాధి తోనే దాదాపు 100 కోట్ల మంది బాధ పడుతున్నారు. అల్జీమర్స్ వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 5.5 కోట్ల వృద్ధుల జీవన నాణ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ప్రతీ వార్షికంగా దాదాపు 1.2 కోట్ల మంది స్ట్రోక్‌కు గురవుతున్నారు.




పార్కిన్సన్స్ వ్యాధితో ఏడాదికి లక్షల కొద్దీ కేసులు నమోదవుతున్నాయి. ఈ సమస్యలు శారీరక, మానసిక శక్తులను క్రమంగా చూర్ణం చేస్తూ జీవన నాణ్యతను తగ్గిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మెదడు ఆరోగ్యం పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరం మరింత పెరిగింది. 2025 సంవత్సరానికి వరల్డ్ బ్రెయిన్ డే థీమ్ "Brain Health and Climate Change"గా ప్రకటించ బడింది. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వాయు కాలుష్యం, భూకంపాలు, హీట్ స్ట్రోక్, గాలి నాణ్యతలో లోపం – ఇవన్నీ నేరుగా లేదా పరోక్షంగా మెదడు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. సైబీరియా నుంచి ఆఫ్రికా వరకు, అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు అనేక దేశాల్లో తలెత్తుతున్న తీవ్రమైన వాతావరణ స్థితులు మానవ మానసిక స్థిరత్వాన్ని దెబ్బ తీస్తున్నాయి. మన మెదడు శరీరంలోకి ప్రవేశించే ఆక్సిజన్ మోతాదును నిరంతరం ఆశ్రయిస్తుంది. కానీ వాయు కాలుష్యం కారణంగా మెదడుకు నాణ్యమైన ఆక్సిజన్ అందకపోతే నెమ్మదిగా నాడీ వ్యవస్థ మందగించడంతో పాటు మానసిక స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అత్యంత ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడితో నిండి ఉన్న జీవిత నిర్వహణ, శారీరక కదలికల లేమి, నిద్రలేమి, తారసపడే వార్తల ప్రభావం, గాడిలో లేని ఆహార అలవాట్లు... ఇవన్నీ మెదడు సామర్థ్యాన్ని తగ్గిస్తున్నాయి. గుండె జబ్బుల కంటే ముందు గుర్తించలేని మెదడు వ్యాధులే ఎక్కువ సంఖ్యలో ప్రాణాలు హరిస్తున్నాయి. అల్జీమర్స్ వంటి జ్ఞాపక నష్ట రుగ్మతలు ఒక్కసారిగా మొదలైనా వాటికి పునాదిగా ఉంటున్న అనేక కారణాలను ముందుగానే దృష్టి పెట్టడం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చు. పౌష్టికాహారం, నిద్ర, వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, మానసిక ఉద్దీపన, సామాజిక సంబంధాలు – ఇవన్నీ మెదడు ఆరోగ్యానికి అత్యవసరమైన నియమాలు. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్-B12, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న ఆహారం, రోజు కనీసం 30 నిమిషాలు నడక లేదా యోగా, ప్రాణాయామం చేయడం, రోజుకు 7-8 గంటల నాణ్యమైన నిద్ర, పుస్తకాలు చదవడం, పజిల్స్, శబ్దాలు గుర్తించడం వంటి మెదడును ఉపయోగించే పనులు, కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపే సమయం – ఇవన్నీ మెదడు చురుకు తనాన్ని పెంచుతాయి. దీర్ఘకాలిక ఒత్తిడికి కారణమయ్యే పరిస్థితులను తొలగించడం అత్యవసరం. మానసిక ఒత్తిడి కారణంగా మెదడులో కార్టిసోల్ అనే హార్మోన్ స్థాయి పెరిగి, న్యూరాన్ల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అత్యవసర సమయంలో మెదడుకు సరైన రక్త ప్రసరణ జరగకపోతే స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితిలో 'గోల్డెన్ అవర్'గా పరిగణించే తొలి 3-4 గంటల్లో చికిత్స ప్రారంభిస్తే ప్రాణాలు కాపాడే అవకాశముంది. కానీ అవగాహన లేకపోవడం వల్ల, లక్షణాలను గుర్తించలేక పోవడం వల్ల, సమయం పాలన జరగక పోవడం వల్ల లక్షల మంది ప్రాణాలు పోతున్నాయి. ఇది ఆరోగ్య వ్యవస్థకు కూడా ఆర్థికంగా భారంగా మారుతోంది. ఒక దేశ అభివృద్ధిలో ప్రజల మానసిక స్థిరత్వం, ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకత, బుద్ధి చాతుర్యం కీలకపాత్ర పోషిస్తాయి. ఇవన్నీ మెదడులో ముడిపడ్డ అంశాలు. కాబట్టి మెదడును ఆరోగ్యంగా ఉంచడమే వ్యక్తిగత, కుటుంబ, సమాజ, దేశ స్థాయిలో మంచి అభివృద్ధికి బాటవేసినట్లే. ఈ దినోత్సవం మానవాళికి ఒక హెచ్చరిక.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## అజరామరాలు.. ముకేష్ పాటలు... - జూలై 22... హిందీ సినీ గాయకుడు ముకేష్ జయంతి

ముకేష్ చంద్ మాథుర్ అంటే ఎవరు అని అడిగితే భారత దేశంలో దాదాపు దేశ ప్రజలు తెలియదనే అంటారు. హిందీ సినీ నేపథ్య గాయకుడు ముకేష్ పేరు తెలియని వారు దాదాపు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హిందీ సినీ గాయకునిగా సుపరిచితుడైన ముకేష్ పూర్తి పేరు ముకేష్ చంద్ మాథుర్ అంటే జిజా అనే వారి తప్ప మిగతా అనే వారు బహు అరుదుగా వుంటారు. హిందీ సినీ సంగీతానికి మరపురాని మధుర గీతాలను అందించిన విలక్షణ గాయకుడు ముకేష్. అతి పిన్న వయసులోనే లోకం వదిలి వెళ్లినా, జీవిత చరమాంకం వరకు ముకేష్ పాడుతూనే వున్నారు. భౌతికంగా దూరమైనా, ఆయన పాడిన పాటలు అజరామరాలై, సంగీత ప్రియుల నోళ్లలో దశాబ్దాలుగా నానుతూనే ఉన్నాయి. ముకేష్ (జూలై 22, 1923 – ఆగస్టు 27, 1976) 1950 నుండి 1970 ల మధ్యకాలంలో భారతీయ హిందీ సినిమా రంగం నేపథ్య ప్రముఖ గాయకుడు. ముకేష్ కొద్ది పాటలు పాడినా, నేటికినీ మరపురాని గాయకునిగా చిరస్మరణీయుడు. ఆయన పాటలు ఎన్నిసార్లు విన్నా, వినుగు రాకుండా ప్రతి సారీ ఆయన గాత్రంలో లీనం అవుతుండ డాన్ని బట్టి ముకేష్ ప్రత్యేకత స్పష్టం అవుతున్నది. జూలై 22, 1923న ఢిల్లీ నగరంలో జోరావర్ చంద్ మాథుర్ చంద్రాణి దంపతులకు ఆరవ సంతానంగా జన్మించారు. తండ్రి ఇంజనీరుగా ఉద్యోగం చేసేవారు. ముకేష్ అక్క సుందర్ ప్యారికి సంగీతం నేర్పేందుకు ఒక పండిట్ వారి ఇంటికి వచ్చేవారు. దూరంగా ఉన్న గదిలో కూర్చొని ముకేష్ ఆ సంగీత పండితుడు తన అక్కకు సంగీతం ఎలా నేర్పిస్తున్నారో శ్రద్ధగా గమనిస్తూ తనలో తనే పాడుకుంటూ ఉండేవారు. అలా సంగీతం పట్ల ముకేష్ కు అభిమానం ఏర్పడింది. మెట్రిక్యులేషన్ పూర్తి కాగానే కాలేజి చదువుకు వెళ్లకుండా ప్రభుత్వ నిర్మాణ శాఖలో ఉద్యోగంలో చేశారు. ఉద్యోగం చేస్తూనే తన సంగీతాభిరుచికి మెరుగులు దిద్దుకునే ప్రయత్నం చేశారు. హార్మోనియం వంటి కొన్ని వాద్య పరికరాలను ఎలా వాయించాలో శిక్షణ తీసుకున్నారు. ముకేష్ దూరపు బంధువు, సినీ నటుడు మోతిలాల్ కు ముకేష్ స్వరం కొత్తగా, వినూత్నంగా తోచింది. తండ్రి అనుమతితో ముకేష్ ను బొంబాయి తీసుకెళ్లి పండిట్ జగన్నాథ్ ప్రసాద్ వద్ద సంగీత పాఠాలు నేర్పించారు. ఆ సంగీత పండిట్ వద్దకు హిందీ సినిమా పరిశ్రమకు చెందిన వాళ్లు వచ్చిపోతు ఉండేవారు. దర్శకుడు వీరేంద్ర దేశాయ్ ముకేష్ ను చూసి 1941లో నిర్దోష్ అనే సినిమాలో హీరోగా పరిచయం చేశారు. ముకేష్ సరసన నళిని జయవంత్ హీరోయిన్ గా నటించింది. ఆ సినిమాలో ముకేష్ ఒక గాయకుడి పాత్ర. నీలకంఠ తివారి పాట రాయగా, అశోక్ ఘోష్ స్వరపరచిన 'దిల్ హి బుఝా హువా హోతో ఫసి– యే–బహార్ క్యా' అనే పాటను ముకేష్ తొలిసారి పాడారు. రెండవ సినిమా వి.సి. దేశాయ్ నిర్మించిన 'ఆదాబ్ అర్'లో కూడా నళిని జయవంత్ సరసనే హీరోగా ముకేష్ నటించారు. తర్వాత రామ్ దర్యాని దర్శకత్వంలో వచ్చిన 'దుఃఖ్ సుఖ్' (1942 సినిమాలో హీరోగా సితారాదేవి సరసన నటించారు. ఖేమ్ చంద్ ప్రకాష్ సంగీత దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సితారాదేవితో కలిసి రెండు యుగళ గీతాలను పాడారు. 'అబ్ దేర్ న కర్ సాజన్ యులాలో సే జో మిల్నా హై, మేరీ అటరియా పే ఆజావో పరదేశీ పంఛీ' అనే ఈ రెండు పాటలు పాపులర్ అయ్యాయి. రాజకపూర్తో సాన్నిహిత్యం పెరిగిన తర్వాత 'ఆహ్' సినిమాలో క్యారేజ్ డ్రైవర్ ముకేష్ ఒక అతిథి పాత్రలో కనిపించారు. తర్వాత ముకేష్ నేపథ్య గాయకుడిగా స్థిరపడాలని నిర్ణయించుకొని ఆ దిశగా అడుగులు వేశారు. గాయక నటుడు కె.ఎల్. సైగల్ అంటే ముకేష్ వీరాభిమాని. నేపథ్య గాయకుడుగా పరిచయమైన తొలిరోజుల్లో సైగల్ పంథాను ముకేష్ అనుకరించే ప్రయత్నం చేసేవారు. నిజానికి సైగల్ ముకేష్ పాడిన 'దిల్ జల్తా హై' పాటను విని ఆ కొత్త గళాన్ని హిందీ చిత్రసీమకు దొరికిన ఆణిముత్యంగా శ్లాఘించారు. దిలీప్ కుమార్, మహమ్మద్ రఫీని నేపథ్య గాయకుడుగా ఇష్టపడితే, ముకేష్ రాజ్‌కపూర్ కు గాయకుడయ్యారు. తోటి గాయకుల గళాలతో పోలిస్తే ముకేష్ గొంతుక ప్రత్యేకంగా వుంటుంది. ఆ ప్రత్యేక అభిమానుల్ని ఆకట్టుకుని మైమరపించే సమ్మోహన అస్త్రంగా మారింది. నేపథ్య గాయకుడిగా శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వంలో ముకేష్ 133 పాటలు పాడితే, కళ్యాణ్ జీ ఆనంద్ జీ ఆధ్వర్యంలో 99 పాటలు పాడారు. ముకేష్ గెలుచుకున్న నాలుగు ఫిలింఫేర్ బహుమతుల్లో మూడు సినిమాలకు శంకర్ జైకిషన్ సంగీత దర్శకులు కావడం విశేషం. అవి 'సబ్ కుచ్ సీఖా హమ్ ' (అనారి – రాజకపూర్), 'సబ్ సే బడా నాదాన్ వహీ హై' (పెహచాన్ మనోజ్ కుమార్), 'జై బోలో బేయిమాన్ కి' (బేయిమాన్– మనోజ్ కుమార్), 'కభీ కభీ మేరె దిల్ మే ఖయాల్ ఆతా హై' (కభీ కభీ – అమితాబ్ బచ్చన్) పాటలు. 1974లో సలీల్ చౌదరి సంగీతం సమకూర్చిన 'రజనీగంధ' సినిమాలో ముకేష్ పాడిన 'కహి బార్ యూహి దేఖా హై' పాటకు జాతీయ బహుమతి లభించింది. ముకేష్ మొత్తం మీద 1300 పాటలు పాడారు. ఒక నాటి మేటి క్రికెటర్లు భగవత్ సుబ్రహ్మణ్య (బి.ఎస్) చంద్రశేఖర్, సునీల్ మనోహర్ గవాస్కర్, సయ్యద్ కిర్మాణీ, గుండప్ప విశ్వనాథ్ కు ముకేష్ పాటలంటే ఎంతో ఇష్టం. డ్రెస్సింగ్ రూమ్ లో స్ఫూర్తి పొందాలని వాళ్లు ముకేష్ పాటలు లో గొంతుకలతో హమ్ చేసేవారు. అమెరికా పర్యటనలో వుండగా ముకేష్ కు గుండెనొప్పి వచ్చింది. డెట్రాయిట్ (మిచిగన్ రాష్ట్రం)లోని హోటల్ రూమ్ లో ముకేష్ తన 53వ (27 ఆగస్టు 1976) ఏట అసువులు బాశారు. "ముకేష్ భయ్యాకు వచ్చిన మంచి పాటలు నాకు రాలేదు. ఆయన ఎంత అదృష్టవంతుడో" అని కిషోర్ కుమార్ ఓ సందర్భంలో అన్నాడట. ముకేష్ అంటే రాజ్ కపూర్, రాజ్ కపూర్ అంటే ముకేష్ గా సాగింది వాళ్లిద్దరి అనుబంధం. అందుకే ముకేష్ మరణంతో, రాజకపూర్... 'నా గొంతు మూగబోయింది. నా ఆరో ప్రాణం గంగలో కలిసింది' అంటూ రోదించారు.



**రామ కిష్టయ్య సంగన భట్ల.. 9440595494**

# అవి'నీటి'దే అధికం



గోదావరిఖని : ఉమ్మడి జిల్లాలో నీటి పారుదల శాఖ అధికారుల అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌తో పాటు ఈఈ స్థాయి అధికారి వరకు అక్రమాల చిట్టా బయటపడింది. ఉమ్మడి జిల్లాలోని నీటి పారుదల శాఖల్లో పనిచేసిన ఉన్నతాధికారులు ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారు. కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో కీలకంగా వ్యవహరించిన విశ్రాంత ఈఎన్సీ స్థాయి అధికారి వద్ద ఊహించని రీతిలో ఆదాయాలు వెలుగు చూస్తున్నాయి. నెల రోజుల కిందట ఎస్ఆర్ఎస్పీ ఈఈ శ్రీధర్ నివాసాలపై అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు చేపట్టిన సోదాల్లో రూ.కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. ఉమ్మడి జిల్లాలో నీటిపారుదల శాఖలో పనిచేసిన అధికారుల అవినీతిబాగోతం వెలుగు చూస్తుండగా మరికొంత మందిపై కూడా అనిశా అధికారులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

**రూ.వందలకోట్ల ఆస్తులు**

విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు అక్రమాల పుట్ట బయటపడింది. మంగళవారం కరీంనగర్‌తో సహ మరో పది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అనిశా అధికారులకు స్థిర, చరాస్తుల చిట్టాలు బయటపడుతున్నాయి. ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. కరీంనగర్‌లో చాలా కాలం పనిచేసిన మురళీధర్‌రావు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అక్రమంగా ఆస్తులను కూడబెట్టినట్లు సమాచారం. కాళేశ్వరం పునరాకృతితో పాటు అంచనాల మార్పు చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఆయనది సిరిసిల్ల జిల్లా కోనరావుపేట. నీటిపారుదల శాఖలో అంచెలంచెలుగా ఎదిగి ఈఎన్సీ స్థాయికి చేరి ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం ఆయనను కొనసాగించింది. ఉమ్మడి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల నిర్మాణాలు ఆయన పర్యవేక్షణలోనే సాగాయి. ఈ క్రమంలోనే భారీ మొత్తంలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అనిశా అధికారులు చేపట్టిన సోదాల్లో ఒక్కరోజులోనే రూ.వందల కోట్ల విలువ చేసే భూములు, బంగారం, బాండ్ల రూపంలో లభించినట్లు తెలుస్తోంది.

**స్థిర, చరాస్తులు**

సరిగ్గా నెల రోజుల కిందట ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శ్రీరాంసాగర్ ఈఈ శ్రీధర్ అనిశా అధికారులకు చిక్కగా అంతుచిక్కని ఆస్తులు బయటపడ్డాయి. కరీంనగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో భూములు, ఇతర ఆస్తుల వివరాలు సేకరించిన అనిశా అధికారులు రూ.కోట్లలో అక్రమంగా సంపాదించినట్లు గుర్తించారు. చొప్పదండి ఎస్ఆర్ఎస్పీ డివిజన్–8 ఈఈగా పనిచేసిన శ్రీధర్‌ను మొదట ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణ చేపట్టిన అనిశా అధికారుల కళ్లు బైర్లు కమ్మే ఆస్తులు వెలుగు చూశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, హనుమకొండ, సిద్దిపేట ప్రాంతాల్లో అక్రమాస్తులు గుర్తించారు. భూములు, విల్లాలు, నగదు, బంగారం బయటపడ్డాయి. వీటి విలువ రూ.కోట్లలోనే ఉండటంతో అక్రమార్జన ఏ స్థాయిలో ఉందో వెల్లడైంది.

**మరి కొంత మందిపై నిఘా**

ఉమ్మడి జిల్లాలో నీటిపారుదల శాఖలో పనిచేసిన మరికొంత మందిపై కూడా అనిశా అధికారులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బ్యారేజీల నిర్మాణంతో పాటు వివిధ అనుమతులకు సంబంధించిన అంశాల్లో కీలకంగా వ్యవహరించిన వారి చిట్టాను అనిశా అధికారులు తయారు చేసినట్లు తెలుస్తోంది. అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెచ్చేందుకు దృష్టి సారించినట్లు భావిస్తున్నారు.

## జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

సిరిసిల్ల : పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథక నిర్మాణాల్లో కొన్ని చివరిదశకు చేరుకున్నాయి. మొదటి విడతలో 1028 ఇళ్లు ఎంపిక కాగా.. అధికారుల ఆధ్వర్యంలో 439 నిర్మాణాలకు ముగ్గు పోశారు. ఇందులో 206 వరకు బేస్‌మెంట్ పనులు పూర్తి కాగా వారి ఖాతాల్లో రూ.లక్ష జమయ్యాయి. 90 వరకు స్లాబ్ దశకు చేరుకున్నాయి. రెండో విడతలో 6780 మంది ఎంపికయ్యారు. వీటిలో 4500కు పైగా ఇళ్ల పనులు ప్రారంభించగా 500 వరకు బేస్‌మెంట్‌లు పూర్తయ్యాయి. స్లాబ్ లెవల్ వరకు 10 చేరుకున్నాయి.

**అందుబాటు ధరలోనే ఇసుక**

జిల్లాలో మొదటి విడతలో ప్రారంభించిన వాటిలో ఇప్పటివరకు 50 వరకు ఇళ్ల స్లాబ్‌లు పూర్తయ్యాయి. మరో 90 స్లాబ్ దశకు చేరుకున్నాయి. స్లాబ్‌లు పూర్తయిన 5 ఇళ్లకు ప్లాస్టరింగ్ పూర్తయ్యాయి. ఈ నెలాఖరు వరకు మరో 5 ఇళ్లతోపాటు.. స్లాబ్‌లు పూర్తయిన మరికొన్నింటిని పూర్తి చేసేందుకు అధికారులు ప్రోత్సహిస్తున్నారు.



లబ్ధిదారుల ఖాతాల్లో నాలుగు విడతల్లో బిల్లులు చెల్లిస్తున్నారు. బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, గోడల నిర్మాణం అనంతరం మరో రూ.లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.2 లక్షలు, మిగతా పనులు పూర్తి చేసిన తర్వాత రూ.లక్ష చెల్లిస్తారు. లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ధరలకు ఇసుక చేరేలా వారంలో రెండు రోజులు అధికారులు అనుమతులిస్తున్నారు. దీంతోపాటు బేస్‌మెంట్ లెవల్‌లో మట్టి నింపేందుకు చొరవ చూపుతున్నారు.

**పొదుపు ఖాతాలోనే జమ**

కొందరు లబ్ధిదారులు బ్యాంకులో వారి ఖాతా బ్లాక్ అయిన అకౌంట్ నంబరును అందజేస్తున్నారని అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో డబ్బులురాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. లబ్ధిదారులు బ్యాంకులో సేవింగ్ ఖాతా అందించాలని అధికారులు చెబుతున్నారు. ఖాతాలో కనీస నగదు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు కేవైసీ తప్పనిసరిగా చేయించాలి. ముఖ్యంగా క్రాప్‌లోన్, జనధన్, జీరో ఖాతాలు పనిచేయడం లేదని పేర్కొన్నారు.

## భట్టిసారూ.. సాగర్‌కు నిధులు ఇవ్వరూ

నల్గొండ : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నాగార్జున సాగర్‌కు రానున్నారు. ఈ మేరకు జిల్లా పాలనాధికారితో పాటు విద్యుత్తు, ఆర్థిక, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ఇవి కావాలి**

నాగార్జునసాగర్ జలాశయ స్పిల్‌వే ప్రాంతం వద్ద తరచూ గుంతలు ఏర్పడుతున్నాయి. మరమ్మతుల నిర్వహణ విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. 2014 కంటే ముందు వచ్చిన భారీ వరద కారణంగా పెద్ద గుంతలు పడటంతో ప్రభుత్వం రూ.40 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టింది. 2023–24లో రూ.19 కోట్లతో మరోసారి చేయగా.. 2024లో మళ్లీ అవే సమస్యలు వచ్చాయి. నాగార్జునసాగర్ బుద్ధవన ప్రాజెక్టు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం రూ.15.39 కోట్లు యువజన సాంస్కృతిక శాఖ నిధుల నుంచి కేటాయించారు. వాణిజ్య దుకాణాల నిర్మాణం, లైటింగ్, పెయింటింగ్, కాటేజీల పునర్నిర్మాణ పనులు ఆగుతూ సాగుతూ నడుస్తున్నాయి. బుద్ధవనంలోనూ చేయాల్సిన పెండింగ్ ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. పర్యాటకుల కోసం 'డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ మ్యూజిక్ సెంటర్' పనులు చేపట్టాల్సి ఉంది. బుద్ధచరితవనానికి కుడివైపు ప్రతిపాదిత స్థలం అందుబాటులో ఉన్నా పనులు సాగడం లేదు. నాగార్జున కొండపై 'టూరిస్ట్ డెస్టినేషన్' చేస్తామని చెప్పి.. నిధులు కేటాయించలేదు. రిజర్వాయర్ వద్ద ఉన్న 'చాకలిగట్టు'ను 'ఎకో టూరిజం' చేస్తామని ప్రకటించినా ప్రగతి లేదు. నాగార్జున సాగర్‌లోని నందికొండ పురపాలికకు సంబంధించి సరైన ఆర్థిక వనరులు లేవు. హిల్‌కాలనీ, పైలాన్ కాలనీలలో రహదారుల నిర్మాణానికి నిధులు లేవు.

## పొలం చెంత.. చినుకు చింత

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో చినుకు జాడ లేక రైతన్నలు నింగికేసి దిగాలుగా చూస్తున్నారు.. వేసిన పంటకు నీరందక.. నారు మడులు బీటలు వారి ఆవేదనలో మునిగిపోయారు.. వర్షాకాలం ప్రారంభమై రెండో నెల ముగిసే తరుణం సమీపిస్తున్నా భారీ వర్షాలు లేక ఉసూరుమంటున్నారు..

**లోటు ఇలా..** మొత్తం 63 మండలాలకుగానూ 11 మండలాల్లో సాధారణ లోటు కనిపిస్తుండగా మిగతా 52 మండలాల్లో తీవ్రమైన లోటు వర్షపాతం ఉంది. జగిత్యాల, రాయికల్, గన్నేరువరం, తిమ్మాపూర్, చిగురుమామిడి, సైదాపూర్, శంకరపట్నం, హుజూరాబాద్, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఫరవాలేదనే పరిస్థితి ఉంది. ఇక అత్యధికంగా ఓదెల మండలంలో 65 శాతం లోటు వర్షపాతం నమోదవగా రామగుండం (61 శాతం), ఎలిగేడు (60), సుల్తానాబాద్ (60), కరీంనగర్ గ్రామీణం (59), మంథని (57), రామగిరి (57), గంగాధర (55), ధర్మారం (55), జూలపల్లి (55), రుద్రంగి (55), పెద్దపల్లి (54), వీణవంకలో (54), గొల్లపల్లి (51), చొప్పదండి (51), కరీంనగర్ (50), అంతర్గాం (50), కమాన్‌పూర్ మండలంలో 50శాతం లోటు నమోదైంది.

**పంటల పరిస్థితి..!**

ఈ సీజన్‌లో 12,47,811 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గానూ ఇప్పటి వరకు 3,47,263 ఎకరాల్లో మాత్రం వరి సహా అన్ని పంటలు వేశారు. మొత్తంగా 27.82 శాతం పంటలు వేశారు. జూలై రెండోపక్షం వచ్చిందంటే వాతావరణం పూర్తిగా చల్లబడాలి. కానీ ప్రస్తుతం పగలు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటూ ఉక్కపోత ఉంటోంది. వీచే గాలులు, గాలిలో తేమశాతం తగ్గి పొడి వాతావరణం నెలకొనడం, రుతుపవనాల మందగమనం, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడకపోవటం, ద్రోణిప్రభావాలు తగ్గి పంటలకు కష్టమవుతోంది. ఈ వాతావరణం వల్ల నాలుగు జిల్లాల్లో విత్తుకున్న పత్తిలో రసం పీల్చు పురుగులు, మక్కలో కత్తెరపురుగు, వరిలో మొగిపురుగు తదితరాలు కొన్ని చోట్ల ఆశిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. పత్తి, సోయా చిక్కుడు పెరుగుదలకు కిలో 19:19:19ను నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేస్తే మంచిది. వరి నారుమడిలో మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చల్లాలి.

## దాతలు స్పందిస్తే.. ఓ సీసా అందిస్తే..!



మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాల అంటేనే పేద, మధ్య తరగతి ప్రజల పిల్లలు చదువుకునే చోటని అందరికీ తెలిసిన విషయమే. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న ప్పటికీ తాగునీటిని ఇంటి నుంచే తీసుకొస్తున్నారు. అయితే పాఠశాలల్లోని అనేక మంది విద్యార్థులు తాగునీటి అవసరాలకు వాడేసిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలు, శీతల పానీయాల సీసాలను వాడుతున్నారు. దీంతో చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో 68,216 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 30,900 మంది ఉన్నారు. వీరిలో సుమారు 20 వేల మంది హానికర ప్లాస్టిక్ సీసాలే వాడుతున్నారని అంచనా. తొమ్మిది, పది తరగతులు చదువుతున్న విద్యార్థులు 37,316 మంది ఉండగా..వీరిలో సుమారు 15వేల మందికి పైగా ప్లాస్టిక్ సీసాలు వినియోగిస్తున్నారు.


**ప్లాస్టిక్‌తో అనర్థమే..**

ప్లాస్టిక్ సీసాలు వాడడం వల్ల అందులోని మైక్రో ప్లాస్టిక్స్ చిన్నారుల శరీరంలో ప్రవేశించి..పొట్టలో సమస్యలతో పాటు మెదడుపై సైతం ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మంది విద్యార్థులు పేదలే ఉండడంతో వారిలో ఎక్కువ మంది వాడి పడేసిన ప్లాస్టిక్ సీసాలే వాడుతున్నారు. మరోవైపు ఎక్కువ మంది విద్యార్థులు ఒకసారి మాత్రమే వినియోగించాల్సిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలు, శీతల పానీయాల సీసాలు సైతం వాడుతున్నారు. దీని వల్ల ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులు పిల్లల శరీరంతో పాటు రక్తంలో చేరి క్యాన్సర్ వంటి రోగాలకు సైతం దారి తీస్తుంది. దీనిని నివారించాలంటే పిల్లలు తప్పనిసరిగా ప్లాస్టిక్ సీసాలకు ప్రత్యామ్నాయంగా స్టీలు, గాజు, మట్టితో తయారైన సీసాలు వాడడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి పేద విద్యార్థులకు ఆరోగ్యకరమైన నీళ్ల సీసాలను పంపిణీకి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**అవగాహన కల్పించాలి..**

–డాక్టర్ నితిన్ ప్రసాద్ రాయ్, ఆర్బీఎస్కే వైద్యాధికారి, మిర్యాలగూడ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మంది విద్యార్థులు హానికర ప్లాస్టిక్ సీసాలే వాడుతున్నారు. ఇటీవల మేము పలు పాఠశాలల్లో వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లినప్పుడు ఈ విషయాన్ని గుర్తించాం. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని నిపుణులు, వైద్యులు ఎంతగా హెచ్చరిస్తున్నా..ప్రజల్లో మార్పు రావట్లేదు. దీనికి ప్రధాన కారణం వారిలో అవగాహన లేకపోవడమే. ప్రభుత్వ అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు ముందుకు వచ్చి ప్లాస్టిక్ సీసాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.

## బోడకాకరకు భలే గిరాకీ



సూర్యాపేట: బోడ కాకర(ఆగాకర) సీజన్ వచ్చేసింది. మార్కెట్‌లో ఆకర్షిస్తున్నాయి. ఈ రకమైన కూరగాయలు ఏడాదిలో రెండు నెలలు మాత్రమే దొరుకుతాయి. సూర్యాపేట పట్టణంలో మార్కెట్‌లో ఇప్పుడిప్పుడే విక్రయానికి తీసుకొస్తున్నారు. ధర కిలో రూ.300 నుంచి రూ.350 వరకు పలుకుతోంది. స్థానిక కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం బండ్లతో పాటు, పలువురు వ్యాపారులు విక్రయించారు. సీజన్‌లో ఒక్కసారైనా తినేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతారు.


**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..** బోడ కాకరను ఎక్కువగా ఖమ్మం, ఆంధ్రా ప్రాంతాల్లో పండిస్తారు. స్థానికంగా ఎక్కడ సాగు చేపట్టరు. పట్టణాల్లో డిమాండ్ ఉండటంతో వ్యాపారులు ఆయా ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ఎక్కువగా గుంటూరు ప్రాంతంలో రైతులు పండిస్తారు. నెలవరిహేను రోజులు వ్యాపారులు వీటిని మార్కెట్లలో విక్రయించి లాభాలు గడిస్తుంటారు. బోడ కాకరలో యాంటి ఇన్ఫ్లమేటరీ, యాంటి మైక్రోబయల్ గుణాలు కలిగి ఉంటాయి. వీటితో ఇన్ఫెక్షన్లు, దగ్గు, జలుబు, చెవి నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. కంటితోపాటు పక్షవాతం, వాపు వంటి సమస్యలను నివారిస్తాయి. శిశువు ఎదుగుదలకు ఉపయోగకరంగా ఉంటుంది. గర్భిణులకు మంచి ఆహారం. కనీసం వారానికి రెండుసార్లు తింటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. రోజుకు 25 కిలోలు అమ్ముతున్నామన్నమల్లయ్య, వ్యాపారిగుంటూరు నుంచి తీసుకొస్తున్నాను. రోజుకూ 25 కిలోలు అమ్ముతున్నాను. ప్రస్తుతం డిమాండ్ ఉండటంతో చాలామంది కొనేందుకు ముందుకొస్తున్నారు. ధర అధికంగా ఉన్నా వెనకడటం లేదు.

## కొత్త కొత్త పరికరాలు.. చకచకా పనులు..!

ఖమ్మం : రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్త కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, యూపీఎస్‌లు సహ బయోమెట్రిక్, ఐరిష్ పరికరాలను ప్రభుత్వం ఇటీవల సరఫరా చేసింది. ఖమ్మంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సహా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎనిమిది కంప్యూటర్లు, నాలుగు స్కానర్లు కేటాయించింది. వీటిలో ఒక స్కానర్‌ను రిజర్వ్‌లో ఉంచింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే ఈ స్కానర్‌ను పంపనుంది. కొత్త పరికరాలు సరఫరా చేసిన కంపెనీ ప్రతినిధులు వీటిని అమరుస్తున్నారు. ఉభయ జిల్లాల్లో ఖమ్మం, కూసుమంచి, ఖమ్మం రూరల్, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఖమ్మంలోని కార్యాలయంలో మాత్రమే కొత్త పరికరాలు అమర్చారు. మిగతా వాటిలో త్వరలో ఏర్పాటు చేయనున్నారు.

**సబ్ రిజిస్ట్రార్లు ఎక్కడ...?**

రెవెన్యూ, స్టాంపులు– రిజిస్ట్రేషన్లు, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గం సహ ఉభయ జిల్లాల్లోని ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేరు. ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. మంత్రి పొంగులేటి ప్రత్యేక శ్రద్ధ వహించి గతేడాది ఆగస్టులో ఈశాఖలో పెద్దఎత్తున బదిలీలు చేశారు. పదేళ్లుగా పాతుకుపోయిన వారికి స్థానచలనం కలిగించారు. ఉభయ జిల్లాల్లోనూ పదకొండు మంది సబ్ రిజిస్ట్రార్లను మార్చి కొత్తవారికి పోస్టింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఎక్కువమంది సెలవుపై వెళ్లిపోయారు. ఇక్కడే ఉన్నా ఎక్కువగా సెలవులు పెడుతూ.. అప్పుడప్పుడు విధులకు హాజరవుతున్నారు. భద్రాచలం, బూర్గంపాడు,



ఇల్లెందులో సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఏడాది కాలంగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొత్తగూడెం, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్లు సెలవుపై వెళ్లిపోయారు. కల్లూరు, మధిర ఎస్ఆర్‌ఓలు అప్పుడప్పుడు వచ్చిపోతుంటారు. ఖమ్మం రూరల్ ఎస్ఆర్ఓ మే మాసంలో ఏసీబీకి చిక్కారు. వైరా ఎస్ఆర్ఓ బల్క్ రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురై అర్ధాంతరంగా ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ కార్యాలయాల్లో ఎస్ఆర్ఓ పోస్టులు ఖాళీగా ఉండగా సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఖమ్మంలో ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు, కూసుమంచిలో ఒక ఎస్ఆర్ఓ మాత్రమే రెగ్యులర్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో తర్వాత తమ కార్యాలయాలకు కొత్త కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు కొత్తవాటిని ప్రభుత్వం సమకూర్చిందని, పనులు వేగంగా చేయవచ్చునని ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2 రామకిశోర్‌రెడ్డికి తెలిపారు. ఎస్ఆర్ఓ పోస్టుల భర్తీఅంశం ప్రభుత్వ పరిధిలో ఉందన్నారు.

## పల్లెల్లో పడకేసిన ప్రత్యేక పాలన..!

ఖమ్మం : గ్రామ పంచాయతీల్లో 17 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. అప్పటి నుంచి స్థానిక సంస్థల్లో ప్రజల భాగస్వామ్యం లేకుండాపోయింది. ఒక్కో గెజిటెడ్ అధికారికి 3–6 పంచాయతీల బాధ్యతలను సర్కారు కట్టబెట్టింది. సదరు అధికారి ఏరోజు ఏ పంచాయతీలో ప్రజలకు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. పైగా సొంత శాఖలో విధుల నిర్వహణకు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. గ్రామ సర్పంచి స్థానంలో చేయాల్సిన పనులు ప్రత్యేకాధికారి చేపట్టాల్సి ఉంటుంది. ప్రత్యేకాధికారి, గ్రామ కార్యదర్శికి సంయుక్త చెక్ పవర్ ఇచ్చారు. జిల్లాలోని 20 మండలాల్లో 571 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

**గ్రామసభల నిర్వహణ కాగితాలకే పరిమితం**

గతంలో మాదిరిగా రోజూ ఇళ్ల నుంచి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు రవాణా చేయటంలేదు. సెగ్రిగేషన్ షెడ్లను గాలికొదిలేశారు. ట్రాక్టర్లకు డీజిల్ పోయించేందుకు డబ్బులు కరవయ్యాయి. చాలా పంచాయతీలకు డీజిల్ అప్పు పుట్టడం లేదని అధికారులు వాపోతున్నారు. ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు పోసి కాపాడాలి. ఇలా చేస్తే డీఆర్డీఏ నుంచి డబ్బులు ఇస్తారు. అయినా ట్యాంకర్లను వదిలేశారు. బ్యాంకు రుణం తీసుకుని ట్రాక్టర్లు కొనుగోలు చేయగా ప్రతి పంచాయతీ నుంచి ఈఎంఐ (రుణ వాయిదా) సొమ్ము బకాయిలు పేరుకుపోతున్నాయి. వీధి దీపాలకు విద్యుత్తు బిల్లులు




పెండింగ్‌లో ఉన్నాయి. వీధి దీపాలు కాలిపోతే కొత్తవాటిని అమర్చలేని చిన్న పంచాయతీలు అంధకారంలో మగ్గుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసే నిధులు నిలిచిపోయాయి. ఎన్నికలు నిర్వహిస్తేనే కేంద్రం నిధులు ఇవ్వనుంది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం సైతం పంచాయతీలకు నిధులు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు కార్యదర్శులు తంటాలు పడుతున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనేందుకూ పంచాయతీల్లో డబ్బులు లేవంటున్నారు. చాలామంది కార్యదర్శులు సొంత డబ్బులతో పనులు చేయిస్తున్నారు. పంచాయతీలకు నిధులొస్తే తీసుకోవచ్చునని భావిస్తున్నారు.

గ్రామ పంచాయతీల్లో కొన్ని సమస్యలున్నాయి. ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన పంచాయతీలకు వెళుతున్నారు. పల్లెల్లో పాలన మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుబాటులో ఉన్న నిధులను సర్దుబాటు చేస్తున్నాం. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు వేర్వేరు ఉద్యోగ బాధ్యతలు అప్పగించగా వాటిని నెరవేర్చాల్సిన అవసరముంది. ఆశాలత, డీపీఓ

# ఆకాశ మార్గంలో చారిత్రక అందాలు

హైదరాబాద్: నగరంలోని చారిత్రక ప్రాంతాల్లో గోల్కొండ కోట ముందు వరుసలో ఉంటుంది. నిత్యం 10 నుంచి 12 వేల మంది సందర్శిస్తుంటారు. విదేశీ పర్యాటకులను సైతం ఇది ఆకర్షిస్తోంది. పక్కనే ఉన్న కుతుబ్‌షాహీ సమాధులనూ సందర్శించి చరిత్ర విషయాలను తెలుసుకుంటుంటారు. త్వరలో ఈ రెండు చారిత్రక ప్రాంతాలకు మరింత శోభ రానుంది. కోట పైభాగం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న టూంబ్స్‌కు రోప్‌వే నిర్మించేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కోటను సందర్శించిన తరువాత పర్యాటకులు టూంబ్స్ వద్దకు వెళ్తుంటారు. ఇరుకైన రహదారుల కారణంగా ఇబ్బందులు పడుతుంటారు. కొందరు కాలినడక, మరికొందరు ఆటోలను ఆశ్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు రోప్‌వే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



**సాధ్యాసాధ్యాలు పరిశీలించాకే..**


పూర్తి స్థాయిలో అధ్యయనం కోసం వారం పది రోజుల్లో కన్సల్టెంట్ నియామకానికి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇవ్వనుంది. రోప్‌వే ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించనుంది. గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు రక్షణ శాఖ భూములు, భవనాలు ఉన్నాయి. సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోవాలనే అంశంపై అధికారులు దృష్టిసారించారు. రోప్‌వే కోసం వివిధ దేశాల్లో ఉన్న ఆధునిక సాంకేతికతను సైతం అధ్యయనం చేయనున్నారు.

**రెండింతలు పెరిగే అవకాశం**

గతంలో హుస్సేన్‌సాగర్ వద్ద రోప్‌వే నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. అక్కడి పరిస్థితుల దృష్ట్యా రోప్‌వేకు బదులు స్కైవాక్ నిర్మించాలని భావిస్తున్నారు. ఇక్కడ ఆకాశమార్గంలో 11 కిలోమీటర్ల మేర సైకిల్ ట్రాక్ రానుంది. ఈ కారణంగా హుస్సేన్‌సాగర్‌కు బదులు రోప్‌వేను గోల్కొండ కోట నుంచి సెవన్ టూంబ్స్ వరకు చేపడితే పర్యాటకుల సంఖ్య రెండింతలు పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. రోప్‌వేను పీపీపీ భాగస్వామ్యంలోనే ఏర్పాటు చేయనున్నట్లు ఓ అధికారి తెలిపారు.

# భూ వివాదాల పరిష్కారానికి 'జనతా గ్యారేజ్'!

మెదక్: మెదక్ జిల్లా కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ సెల్ కార్యదర్శి అనిల్‌కుమార్ హత్యకేసు విచారణ కొలిక్కి తెచ్చేందుకు పోలీసులు మరో నాలుగు బృందాలను ఏర్పాటుచేశారు. హైదరాబాద్‌లో భూ లావాదేవీల కారణంగానే ఘటన జరిగిందని నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ పోలీసుల సహకారం తీసుకుంటున్నారని సమాచారం. భూవివాదాలను పరిష్కరించేందుకు అనిల్‌తోపాటు మరికొందరు కలిసి 'జనతా గ్యారేజ్'ను ఏర్పాటుచేసినట్లు తెలిసింది. పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ ఎమ్మెల్యే సమీప బంధువుతో ఏర్పడిన వివాదమే కాల్పులకు దారితీసినట్లు పోలీసులు భావిస్తున్నారు. పదము



డు మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ ఎమ్మెల్యే సమీప బంధువే సుపారీ ఇచ్చి కాల్పులు జరిపించాడని ప్రాథమికంగా తేలినట్లు తెలుస్తోంది. కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన రౌడీషీటర్ల ప్రమేయం ఉందని నిర్ధారిస్తున్నారు. గాంధీ భవన్‌లో సమావేశం ముగిశాక, అనిల్ అనుచరులతో కలిసివస్తుండగా రెండు వాహనాల్లో వెంబడించినట్లు సీసీ ఫుటేజీలతో తేలింది. వీటి ఆధారంగానే పోలీసులు విచారణ ప్రారంభించారు.

# అధ్యయనం.. ఆధునికతకు మార్గం

సిరిసిల్ల : మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్ టు ఓనర్ పథకం అమలుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. కార్మికుల ఆర్థిక స్థితిగతులు, పరిశ్రమకు ఏడాది పొడవునా వచ్చే ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్ల పరిస్థితులు, బ్యాంకులిచ్చే రుణాలకు వాయిదాల చెల్లింపులు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం జరుగుతోంది. ఈ పథకం ప్రారంభంలో 1104 మంది కార్మికులకు లబ్ధి చేకూర్చడం లక్ష్యం. కాగా ఈ మొత్తానికి రూ.220 కోట్లపైనే వెచ్చించాల్సి రావడంతో.. ఒకేసారి ఇంత మొత్తం నిధులు సమకూర్చడం, దానికి బ్యాంకు రుణాలు, కార్మికుడి వంతు చెల్లింపుల వంటి అంశాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా విడతల వారీగా పంపిణీకి ప్రణాళికలు చేస్తున్నారు.

**తొలుత వందమంది ఎంపిక**

చేనేత, జౌళీ శాఖ అమలు చేస్తున్న త్రిఫ్ట్ ఫండ్ పొదుపు పథకంలోని నేత కార్మికులను తొలుత వంద మందిని గుర్తించారు. వీరి పొదుపు ఖాతాల ఆధారంగా ఆయా బ్యాంకుల్లో వీరు జమ చేస్తున్న నగదు, సిబిల్ స్కోర్ బాగున్నవారిని ఎంపిక చేస్తున్నారు. ఇటీవల మరమగ్గాల తయారీ సంస్థలతో అధికారులు సమావేశమయ్యారు. మార్కెట్లోని పోటీని తట్టుకునే సెమీ ఆటోమెటిక్, అండర్‌పిక్ పద్ధతిలో రంగుల నూలుతో నడిచే మరమగ్గాలను చూపించారు.పలు సంస్థలు ఇచ్చిన ధరల ప్రకారం ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ.10 లక్షలు ఖర్చు చేయనున్నారు. దీనిలో పదిశాతం కార్మికుడికి వాటా చెల్లించాల్సి ఉంటుంది. 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంకుల ద్వారా రుణం అందజేస్తారు. దీనిలో బ్యాంకర్ల వాటాలో పరిశ్రమలకు వర్తించేలా వివిధ రాయితీలను ఈ పథకానికి వర్తించేలా చూస్తున్నారు.కార్మికుల వంతుగా చెల్లింపుల్లోనే ఎలాంటి పరిస్థితి ఉంటుందనేది ప్రణాళిక చేస్తున్నారు.

# 'సమస్యలకు వసతి' గృహాలు



హైదరాబాద్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహాలు చింతల్‌బస్తీ, మెహిదీపట్నం, సైదాబాద్, అంబర్‌పేట-1లో దాదాపు 600 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ హాస్టళ్లకు కనీసం తాగునీరు కూడా సరఫరా చేయడం లేదు. విద్యార్థులే తమ డబ్బులతో మార్కెట్లో నీటిశుద్ధి కేంద్రాల నుంచి రూ.20 పెట్టి నీటి బబుల్ కొనుక్కొని తాగుతున్నారు. చింతల్‌బస్తీ, అంబర్‌పేట-1లో ఆరు నెలలుగా నీటి శుద్ధి కేంద్రాలు పనిచేయడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

నగరంలో పోస్ట్‌మెట్రిక్ 24, ప్రీ మెట్రిక్ 8 సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కొరవవడడం, నాణ్యత లేని ఆహారం, భవనాలకు మరమ్మతులు చేయకపోవడంతో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. వాటిని పరిశీలించగా ఎన్నో సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

**మాకొద్దీ నీళ్ల చారు**

అంబర్‌పేట-1లో 150 మంది విద్యార్థులకు సగం బకెట్ సాంబారు మాత్రమే చేస్తున్నారని, రోజూ తినలేక పోతున్నామన్నారు. మెనూ ప్రకారం వెజిటేబుల్ కర్రీ, సాంబారు వడ్డించాలి. రోజూ నీళ్ల చారు మాత్రమే ఉంటుందని చెప్పారు.

**తలుపులు, కిటికీలకు అడ్డుగా దుప్పట్లు**

చింతల్‌బస్తీ, మెహిదీపట్నం, అంబర్‌పేట-2, కట్టెలమండీ వసతిగృహాల్లో గదుల తలుపులు, కిటికీలు విరిగిపోవడంతో విద్యార్థులు దుప్పట్లు, తువ్వాళ్లు అడ్డుగా కట్టుకున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది విద్యార్థులకు అనారోగ్యం ముప్పు పొంచి ఉంది. నల్లులు బెడదతో రాత్రిపూట నిద్ర కరవవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**నిర్వహణ లోపం**

చింతల్‌బస్తీ, మెహిదీపట్నం, అంబర్‌పేట-2, సైదాబాద్‌లోని హాస్టళ్లలో వార్డెన్ రెండు వారాలకు ఒక్కసారి కూడా అందుబాటులో ఉండటం లేదని విద్యార్థులు తెలిపారు. అంబర్‌పేట-2 వసతిగృహంలో 80 మంది విద్యార్థులకు కేవలం 5 శౌచాలయాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. చాలా మరుగుదొడ్లు ఉపయోగించలేని పరిస్థితిలో ఉండడంతో మూసివేశారన్నారు. వర్షాకాలం కావడంతో అవి చిత్తడిగా మారి దుర్వాసన వెలువడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారానికి ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదని చెప్పారు.

**పని చేయని సీసీ కెమెరాలు**

అమీర్‌పేట్‌లోని సాంఘిక ప్రభుత్వ సంక్షేమ బాలికల కళాశాల వసతిగృహంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. విద్యార్థుల రక్షణకు భరోసా లేకుండా పోయింది. వెంటనే అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

**ప్రమాదకరంగా విద్యుత్తు బోర్డులు**

కొన్ని వసతిగృహాల్లో స్విచ్ బోర్డులు ప్రమాదకరంగా ఉన్నాయి. కనీసం స్విచ్‌లు, ప్లగ్‌లు కూడా లేవు. తీగలన్నీ బయటకి తేలి ఉన్నాయి. మరుగుదొడ్లలో విద్యుత్ దీపాలు లేవు. గదుల్లో ఫ్యాన్లు తిరగడం లేదు. విద్యార్థులు భయంతో గడుపుతున్నారు.

# అనుబంధ గుర్తింపు లేకుండా ఇంజినీరింగ్ కౌన్సెలింగ్!




హైదరాబాద్ : ఇంజినీరింగ్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు లేకుండానే అధికారులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు ఇచ్చిన నివేదికను జేఎన్‌టీయూ అధికారులు గోప్యంగా ఉంచడంతో అనుమానాలు వస్తున్నాయని తెలంగాణ స్కూల్స్, టెక్నికల్ కాలేజీ ఎంప్లాయిస్ అసోసియేషన్(టీఎస్‌టీసీఈఏ) తెలిపింది. టీఎస్‌టీసీఈఏ ప్రతినిధులు సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరగా.. జేఎన్‌టీయూ అధికారులు.. ఇంకా పరిశీలన కొనసాగుతోందంటూ సమాధానం ఇచ్చారు. ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న కళాశాలల జాబితాను ఇవ్వకుండా కౌన్సెలింగ్ జాబితాలో చేర్చడం సమంజసం కాదని గురువారం టీఎస్‌టీసీఈఏ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ అన్నారు. రెండునెలల క్రితం తాము అధికారులను సంప్రదించగా.. 14 రోజుల క్రితం సమాధానం ఇచ్చారన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**సభ్యుల పేర్లు.. కళాశాలల వివరాలు లేవు**

ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి గుర్తింపుతో పాటు జేఎన్‌టీయూ అనుబంధ గుర్తింపు తప్పనిసరి.. ఇందుకు ఏటా జనవరి నుంచి మార్చి వరకు నిజనిర్ధారణ కమిటీ సభ్యులు కళాశాలలకు వెళ్లి తనిఖీలు నిర్వహించి నివేదికను జేఎన్‌టీయూ ఉన్నతాధికారులకు సమర్పిస్తారు. ఈ సారి కూడా తనిఖీలు పూర్తిచేశారు. కొన్ని కళాశాలలపై కొందరు సభ్యులు ఉదారంగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో టీఎస్‌టీసీఈఏ ప్రతినిధులు 2025, మే 31న సమాచార హక్కు చట్టం కింద జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌ను వివరాలు కోరారు.

నిజనిర్ధారణ కమిటీ నివేదిక, అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న కళాశాలల జాబితాను సహ చట్టం కింద కోరిన వారికి వివరాలు ఇవ్వాలంటూ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ జూన్ 11న డైరెక్టర్ ఆఫ్ అఫ్లియేషన్, అకడమిక్ ఆడిట్‌కు లేఖ రాశారు. గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అందుకే నిజనిర్ధారణ కమిటీ సభ్యుల పేర్లు వెల్లడించలేమంటూ జులై 3న సమాధానం ఇచ్చారు.

ఈ నెల 6న వెబ్ ఆప్షన్లలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల జాబితాను కౌన్సెలింగ్ అధికారులు ఏ ప్రాతిపదికన ఉంచారో బహిర్గతం చేయాలని సహ చట్టం కింద దరఖాస్తు చేసుకున్న డా.ఎం.ఉపేందర్ కుమార్ కౌన్సెలింగ్ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

# కమలంలో వర్గపోరు

కరీంనగర్ : 'భాజపాలో గ్రూపులు లేవు. ఉన్నదంతా మోదీ గ్రూపే'నని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హుజూరాబాద్‌లో ప్రకటించగా.. మరోవైపు వీణవంక మండలంలో భాజపా నాయకులు తమకు పార్టీలో సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ శుక్రవారం సమావేశాన్ని నిర్వహించనుండటం రాజకీయంగా చర్చనీయాం శమైంది. ఇప్పటికే జమ్మికుంట మండలానికి చెందిన భాజపా నాయకులు తమకు పార్టీ కార్యక్రమాల సమాచారాన్ని ఇవ్వడం లేదని.. భవిష్యత్తులో పార్టీలో టికెట్లు వస్తాయో రావోననే ఆవేదనను వ్యక్తం చేస్తూ ఈ నెల 16న సమావేశాన్ని నిర్వహించడంతో పార్టీలో దుమారం తలెత్తింది. హుజూరాబాద్ నియోజకవర్గంలో భాజపాలో బయటకు కనిపించకుండా లోలోపల వర్గ పోరు నడుస్తోందని ఈ సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో వీణవంకకు చెందిన పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని గురువారం ప్రకటించడం చర్చనీయాంశమైంది. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడం పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది.

**జిల్లా అధ్యక్షుడి ఇలాకాలో...**

పార్టీ జిల్లా అధ్యక్షుడైన గంగాడి కృష్ణారెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన నాయకుడు. ఆయన ఇలాకాలోనే పార్టీలో ఇలాంటి ఇబ్బంది ఎదురవడం ఒకింత ఆయనకు తలనొప్పి వ్యవహారంగానే మారింది. ఈ నియోజకవర్గం నుంచి 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా నుంచి ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో అప్పట్లో పెద్దఎత్తున నియోజకవర్గ వ్యాప్తంగా పలు పార్టీల నుంచి నాయకులు ఈటల రాజేందర్‌తోపాటు అప్పుడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరారు. తరువాత 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈటల రాజేందర్ ఇక్కడ పోటీ చేసి ఓడిపోవడం.. తరువాత ఎంపీ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి



నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికవడం జరిగాయి. దీంతో ఈటల ఇక్కడికి రావడం తగ్గింది. దీంతో ఆయన అనుచరులు, ఇతర నాయకులు ఈటల వర్గంగా పార్టీలో ముద్ర పడ్డారు. వారు.. గతం నుంచి పార్టీలో ఉంటున్నవారు అంటీముట్టనట్లు ఉంటున్నా ఇప్పటి వరకు ఎక్కడా బాహాటంగా మాట్లాడలేదు. అయితే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమ రాజకీయ ఉనికికి ఇబ్బంది ఎదురవుతుందనే ఉద్దేశంతో ఈటల వర్గంగా పేరు పడిన నాయకులు మండలాల వారీగా సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈటలను కలిసి నిర్ణయాన్ని తీసుకోవాలని కొందరు భావిస్తుండగా.. ఇంకొందరు పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం లేదంటూ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఈ పార్టీలో ఉన్న వర్గపోరును ప్రత్యర్థి పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకుని భాజపా నాయకుల్ని తమ వైపునకు తిప్పుకొనే వ్యూహ రచనలో నిమగ్నమయ్యాయి.

# పొలం చెంత.. చినుకు చింత

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో చినుకు జాడ లేక రైతన్నలు నింగికేసి దిగాలుగా చూస్తున్నారు.. వేసిన పంటకు నీరందక.. నారు మడులు బీటలు వారి ఆవేదనలో మునిగిపోయారు.. వర్షాకాలం ప్రారంభమై రెండో నెల ముగిసే తరుణం సమీపిస్తున్నా భారీ వర్షాలు లేక ఉసూరుమంటున్నారు..

**లోటు ఇలా..**

మొత్తం 63 మండలాలకుగానూ 11 మండలాల్లో సాధారణ లోటు కనిపిస్తుండగా మిగతా 52 మండలాల్లో తీవ్రమైన లోటు వర్షపాతం ఉంది. జగిత్యాల, రాయికల్, గన్నేరువరం, తిమ్మాపూర్, చిగురుమామిడి, సైదాపూర్, శంకరపట్నం, హుజూరాబాద్, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఫరవాలేదనే పరిస్థితి ఉంది. ఇక అత్యధికంగా ఓదెల మండలంలో 65 శాతం లోటు వర్షపాతం నమోదవగా రామగుండం (61 శాతం), ఎలిగేడు (60), సుల్తానాబాద్ (60), కరీంనగర్ గ్రామీణం (59), మంథని (57), రామగిరి (57), గంగాధర (55), ధర్మారం (55), జూలపల్లి (55), రుద్రంగి (55), పెద్దపల్లి (54), వీణవంకలో (54), గొల్లపల్లి (51), చొప్పదండి (51), కరీంనగర్ (50), అంతర్గాం (50), కమాన్‌పూర్ మండలంలో 50శాతం లోటు నమోదైంది.

**పంటల పరిస్థితి..!**

ఈ సీజన్‌లో 12,47,811 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గానూ ఇప్పటి వరకు 3,47,263 ఎకరాల్లో మాత్రం వరి సహా అన్ని పంటలు వేశారు. మొత్తంగా 27.82 శాతం పంటలు వేశారు.



జులై రెండోపక్షం వచ్చిందంటే వాతావరణం పూర్తిగా చల్లబడాలి. కానీ ప్రస్తుతం పగలు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటూ ఉక్కపోత ఉంటోంది.

వీచే గాలులు, గాలిలో తేమశాతం తగ్గి పొడి వాతావరణం నెలకొనడం, రుతుపవనాల మందగమనం, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడకపోవటం, ద్రోణిప్రభావాలు తగ్గి పంటలకు కష్టమవుతోంది.

ఈ వాతావరణం వల్ల నాలుగు జిల్లాల్లో విత్తుకున్న పత్తిలో రసం పీల్చు పురుగులు, మక్కలో కత్తెరపురుగు, వరిలో మొగిపురుగు తదితరాలు కొన్ని చోట్ల ఆశిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

పత్తి, సోయా చిక్కుడు పెరుగుదలకు కిలో 19:19:19ను నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేస్తే మంచిది. వరి నారుమడిలో మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చల్లాలి.

# నది.. గతి తప్పితే ముప్పే..!

కొత్తగూడెం : నదులు ప్రకృతి జీవనాడులు.. నాగరికతలను పోషించే పుష్కరిణులు. అవి నీటి ప్రవాహాలు మాత్రమే కాదు.. సంస్కృతి, జీవనోపాధికి ఆధారం. అయినా ఒక్కసారి గతి తప్పిన నది గ్రామాలను ముంచెత్తుతుంది. పచ్చని పంటలను నాశనం చేస్తుంది. జీవనాధారాలను నీటిలోకి నెట్టేస్తుంది. నది దిశ మార్పులతో పర్యావరణం, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇందుకు మానవ తప్పిదాలు, ప్రకృతి విపత్తులు కారణమవుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోని నదుల ప్రవాహం గతి తప్పటం వల్ల సంభవించిన పరిణామాలపై ప్రత్యేక కథనం.పినపాక మండలం ఏడూళ్లబయ్యారంలో పెద్దవాగు సృష్టిస్తున్న విలయమిది. 30ఏళ్ల క్రితం నదికి 100 మీటర్ల దూరంలో గ్రామస్థులు పదుల సంఖ్యలో ఇళ్లు నిర్మించుకున్నారు. కాలక్రమేణా నది తన దిశను మార్చుకోవటంతో తీరం కోతకు గురవుతోంది. ఐదేళ్లలో అది తీవ్రరూపం దాల్చి ఇళ్ల వద్దకు చేరింది. రెండేళ్లలో ఒక మసీదు, పదుల సంఖ్యలో మరుగుదొడ్లు నీటిమట్టమయ్యాయి. ప్రస్తుతం 14 ఇళ్లకు ప్రమాదం పొంచి ఉంది. ఏటా వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా, తీవ్ర వరదల కారణంగా నది గతి తప్పుతోందని స్థానికులు చెబుతున్నారు.

ములకలపల్లి మండలం గుండా ప్రవహించే పాములేరు వాగు ప్రవాహం గతి తప్పటంతో తాళ్లపాయి శివారులోని ఆర్అండ్‌బీ రహదారి కోతకు గురవుతోందిలా. రోడ్డు మమర్మతులకు ఇప్పటికే అధికారులు రూ.40లక్షలు వెచ్చించినట్లు తెలుస్తోంది. అయినా ప్రమాదకంగానే దర్శనమిస్తోంది. గతంలో నిర్వహించిన ఇసుక ర్యాంపుల కారణంగా తాళ్లపాయితో పాటు రాజుపేట, తిమ్మంపేట సమీపంలో వాగు తన సహజ ప్రవాహానికి విరుద్ధంగా దిశను మార్చుకోవటంతో పంట పొలాలు కోతకు గురయ్యాయని, రూ.9కోట్లతో



నిర్మించిన తిమ్మంపేట ఎత్తిపోతల పథకానికి నీరందటం లేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**పరిష్కార మార్గాలివి..**

నది పరీవాహక ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను నియంత్రించటానికి ప్రభుత్వం, స్థానిక సమాజాలు కృషి చేయాలి.

నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై కఠినంగా వ్యవహరించాలి. చట్టాలను పక్కాగా అమలుచేయాలి.

నది తీరాల వెంట పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం చేపట్టాలి.

తీరప్రాంతాల్లో అక్రమ కట్టడాలు నదుల సహజ ప్రవాహాలకు అడ్డంకిగా మారుతున్నాయి. ఆకస్మికంగా సంభవించే భారీ వర్షాల వల్ల నదుల సామర్థ్యానికి మించి నీరు రావటంతో నది తీరాలు కోతకు గురవుతున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల భూగర్భజలాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. నదుల లోతు ఎక్కువై వరదల ఉద్ధృతి పెరుగుతోంది.మోతీలాల్, డీఈ, నీటిపారుదలశాఖ, ములకలపల్లి

# పంటల బీమా.. అమలైతేనే ధీమా

కాల్వశ్రీరాంపూర్: అన్నదాతలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికందే సమయంలో వడగళ్ల వానలు, గాలి దుమారాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. దీంతో జిల్లాలో ఏటా వేలాదిమంది అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. దీని నుంచి కాపాడేందుకు పంట బీమా పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించింది. ఈ సీజన్ నుంచే బీమా కల్పించాలన్నది రైతన్న ఆశ.

**ఏటా విపత్తుతో ఆందోళన**

భారాస హయాంలో పంట బీమా పథకం అమలుకాలేదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం ఫసల్ బీమా యోజనతో పెద్దగా ప్రయోజనం ఉండదని పేర్కొంది. పంట నష్టపోయిన ప్రతిసారి ఇన్‌పుట్ సబ్సిడీ కింద మాత్రం పరిహారం అందించలేకపోయింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. నష్ట పరిహారం ఏటా భారంగా మారకుండా, బీమాను అమల్లోకి తీసుకురావడమే ప్రత్యామ్నాయమని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో పంట బీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు గతేడాది అక్టోబర్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు.

**యాసంగిలో నష్టాలపాలు**

ఈ ఏడాది యాసంగిలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలి



దుమారాలకు వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. వడగళ్ల వానలకు ధాన్యం గింజలు రాలిపోయాయి. మామిడి రైతులు సైతం తీవ్రంగా నష్టపోయారు. సుమారు జిల్లాలో యాభై వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వ సంస్థలతోనే న్యాయం..**

బ్యాంకులు పంట రుణాలు మంజూరుచేసే సమయంలోనే.. బీమా ప్రీమియంలోని రైతు వాటాను మినహాయించుకొనేవి. మిగతా మొత్తాన్ని నిబంధనల మేరకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భరించేవి. అయితే సదరు ప్రైవేటు బీమా సంస్థలు లాభాపేక్షతో రైతు పరిహారం చెల్లించే పరిస్థితులు ఉండటం లేదని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పథకం నిర్వహణ బాధ్యతను ప్రభుత్వ రంగ బీమా సంస్థలకు అప్పగించి న్యాయం చేయాలని వారు స్పష్టం చేస్తున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి స్పందిస్తూ.. పథకం అమలుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే తగిన కార్యాచరణ చేపడతామని తెలిపారు. గ్రామాల వారీగా ఏ పంటకు ప్రాధాన్యం ఉందో ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

వానాకాలం సీజన్ వివరాలు

సాగుదారులు: 1.61 లక్షల మంది

విస్తీర్ణం: 2.76 లక్షల ఎకరాలు

ప్రధాన పంటలు: వరి, మొక్కజొన్న

# సౌర వెలుగులపై అస్పష్టత.. అన్నదాత కలత

కరీంనగర్ : పర్యావరణ పరిరక్షణ, రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం-కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకాన్ని తీసుకొచ్చింది. రైతులు, రైతు సంఘాలు, సహకార, మహిళా సంఘాలు సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడానికి ఈ పథకం అవకాశం కల్పిస్తోంది. యూనిట్ల ఏర్పాటుకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 465 దరఖాస్తులు రాగా, వీరిలో 131 మంది 170.9 మెగావాట్లకు మెగావాట్‌కు రూ.లక్ష చొప్పున ఈఎండీలు చెల్లించారు. గత నెల 10వ తేదీతో డిపాజిట్ గడువు ముగిసింది.

**ఫలించిన ఎదురుచూపులు**

పొలాల్లో సౌరవిద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ఈఎండీలు చెల్లించిన రైతుల ఎదురుచూపులు ఎట్టకేలకు ఫలించాయి. యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి మార్గదర్శకాలు వెలువడ్డాయి. కొత్త డబ్బు డిపాజిట్ (ఈఎండీ) చెల్లించిన అన్నదాతలతో విద్యుత్తు సంస్థలు విద్యుత్తు విక్రయ ఒప్పందం జరుగుతోంది.

**తీరని అయోమయం**

ప్రాజెక్ట్ ఖర్చు పెరిగిందని, రుణాల విషయంలో బ్యాంకులు ఆసక్తి చూపడంలేదని రైతులు కలత చెందుతున్నారు. వర్షాలు బాగా కురిసే అవకాశం ఉండటంతో వ్యవసాయ పనులు ప్రారంభించాలా.. లేక ప్లాంట్లు ఏర్పాటు చేయాలా? అనే సందిగ్ధంలో పడ్డారు. డిసెంబరు



15 వరకు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**రుణాల సంగతి ఏమిటి?**

ఒక్క మెగావాట్ విద్యుదుత్పత్తి సామర్థ్యం గల సౌర ప్లాంట్‌కు నాలుగు ఎకరాల భూమి, రూ.3.50 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. దీనిలో బ్యాంకులు 70 శాతం రుణంగా ఇవ్వనుండగా, 30 శాతం లబ్ధిదారు వాటాగా చెల్లించాల్సి ఉంటుందని సమాచారం. ఈ విషయంలో స్పష్టత రాలేదు. మొదట్లో బ్యాంకులు 90 శాతం రుణాలు ఇస్తాయని, లబ్ధిదారుడు కేవలం 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని అధికారులు చెప్పినట్లు పలువురు తెలిపారు.

ఒప్పందాలు జరుగుతున్నాయి- అజయ్, మేనేజర్, రెడ్కో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 131 దరఖాస్తులకు సంబంధించి 170.9 మెగావాట్లకు ఈఎండీలు చెల్లించారు. వీటికి సంబంధించి ప్రస్తుతం విద్యుత్తు విక్రయ ఒప్పందాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత ప్లాంట్ పనులు ప్రారంభించే వీలుంటుంది. రుణాల విషయం బ్యాంకులు చూసుకుంటాయి. ఎంతమంది ఒప్పందం చేసుకున్నారో వివరాలు లేవు.

# ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల సందడి



హైదరాబాద్ : ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు కొత్త విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 41 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ప్రవేశానికి వందల సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారు. కొన్ని కళాశాలల్లో ఖాళీలు లేవని ప్రిన్సిపాళ్లు చెబుతున్నా... ప్రజాప్రతినిధులు, అధికారుల సిఫార్సు లేఖలు తీసుకొస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, జిల్లాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో గతేడాదితో పోలిస్తే ప్రవేశాల సంఖ్య భారీగా పెరిగింది. హైదరాబాద్ జిల్లాలో 22 ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో గతేడాది 7వేల మందికి పైగా విద్యార్థులు చేరగా.. ఈ ఏడాది జూన్ మొదటివారంలోనే 6వేల మందికి పైగా దరఖాస్తులు సమర్పించారు. మూడేళ్ల నుంచి ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని హైదరాబాద్ జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈవో) దాసరి ఒడ్డెన్న తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటం, ప్రయోగశాలలు ఏర్పాటు చేయడం విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తోందన్నారు.

**భారం భరించలేక... :** ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివించాలంటే ఏటా రూ.లక్ష నుంచి రూ.1.6లక్షలు ఖర్చు కావటం పేద, మధ్యతరగతి వారికి భారమవుతోంది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరాలంటే గ్రేడ్‌ల వారీగా రూ.1.2లక్షల నుంచి రూ.1.6లక్షల ఫీజు చెల్లించాలి. స్టడీ మెటీరియల్‌కు మరో రూ.15వేలు ఇవ్వాలి. రెసిడెన్షియల్ పద్ధతిలో చదివితే... రూ.2.4లక్షల నుంచి రూ.2.6లక్షల వరకు కట్టాలి. హైదరాబాద్‌లో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు సుమారు 300 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో జీపీఏ 10 పాయింట్లు సాధించిన వారిలో చాలామంది ప్రైవేటులో చేరుతున్నారు. రెండేళ్ల నుంచి వారూ ప్రభుత్వ కళాశాలల వైపు మొగ్గుచూపుతున్నారు.

**సదుపాయాల కల్పన.. :** ప్రభుత్వ కళాశాలల్లో చదివేందుకు విద్యార్థులు ముందుకు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం మెరుగైన విద్యా బోధనపై దృష్టి సారిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని జూనియర్ కళాశాలల్లో ఇటీవల అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేసింది. సమస్యలను ఇంటర్ బోర్డు అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల దృష్టికి తీసుకెళ్లటంతో కొన్నింటిని పరిష్కరించారు. త్వరలో కళాశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పనకు సీఎం హామీ ఇచ్చారు.

# ఏఐ.. విద్యార్థినులు సై



హైదరాబాద్ : ఇంజినీరింగ్‌ను ఎంచుకుంటున్న విద్యార్థినుల్లో ఎక్కువమంది కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ (ఎంఎల్) సబ్జెకులపైనే మొగ్గుచూపుతున్నారు. గతంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, సివిల్ బ్రాంచుల్లో చేరేందుకు ఆసక్తి ప్రదర్శించిన వీరు.. క్రమంగా ఏఐ, ఎంఎల్‌పై దృష్టి పెడుతున్నారు. జూన్ 23న అంతర్జాతీయ మహిళా ఇంజినీరింగ్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ఎడ్‌టెక్ కంపెనీ బైటెక్సెల్ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల్లోని పన్నెండు ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సర్వే చేశారు. 35 విద్యాసంస్థల్లో 38వేల మంది విద్యార్థుల అభిప్రాయాలను బైటెక్సెల్ ప్రతినిధులు సేకరించారు. కృత్రిమ మేధ, మిషన్ లాంగ్వేజ్‌లను ప్రధాన సబ్జెక్టులుగా వ్యవహరిస్తున్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలకు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం లభించనుందని విద్యార్థినులు వివరించారు.

**వెల్లడైన అంశాలు..**

బైటెక్సెల్ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్, విజయవాడ, ఒంగోలు, తిరుపతి, జలంధర్, డెహ్రాడున్, చండీగఢ్, వడోదర, నాగ్‌పుర్, పుణె, మధుర, కోయంబత్తూరులలో పర్యటించారు. వృత్తిపరంగా ఎదిగేందుకు, నైపుణ్యం పెంచుకునేందుకు ఎఐ/ఎంఎల్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నామని 49శాతం మంది విద్యార్థినులు తెలిపారు. నైపుణ్యాలున్న వారికే వేగంగా ఉద్యోగాలు లభిస్తున్నాయని, సృజనాత్మకత ఉన్నవారు అంకుర సంస్థలు ప్రారంభిస్తున్నారని అందుకే... కృత్రిమమేధ, చాట్‌జీపీటీ, మిషన్ లెర్నింగ్‌లను నేర్చుకోవడంతో పాటు అత్యుత్తమ నైపుణ్యాలు సాధించాలని వివరించారు.

కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ సబ్జెక్టులు భవిష్యత్తులో పరిశ్రమల రంగానికి ఉపయోగపడనున్నాయని, సృజనాత్మకతకు, విజ్ఞాన పరివర్తనకు ప్రయోజనకరంగా ఉంటుందని వడోదరలోని ఓ ప్రైవేటు వర్సిటీ విద్యార్థినులు తమ మనోగతాన్ని పంచుకున్నారు.

ప్రథమశ్రేణి నగరాలు, పట్టణాల్లో ఇంజినీరింగ్ విద్యార్థినుల్లో 37.9శాతం మంది ఎఐ/ఎంఎల్‌ను ఎంచుకోగా.. హైదరాబాద్, పుణె, నగరాల్లో ఇంజినీరింగ్ అమ్మాయిల్లో 53.9శాతం కృత్రిమ మేధపై మొగ్గు చూపారు. ఇంజినీరింగ్ విద్యలో వస్తున్న మార్పులు, విద్యాసం స్థలు, పరిశ్రమలకు అనుసంధానంగా ప్రభుత్వాలు చేపడుతున్న చర్యల ప్రభావం విద్యార్థినులపై ఏ మేరకు ఉందని తెలుసుకునేందుకు ఈ సర్వే నిర్వహించామని బైటెక్సెల్ సీఈవో కరుణ్ తాడేపల్లి తెలిపారు.

# నిర్లక్ష్యం అధికారులది.. ఇక్కట్లు సామాన్యులవి



కోరుట్ల: కల్లూర్‌రోడ్‌లోని భవనంపైనున్న 33 కేవీ విద్యుత్తు తీగలు తగిలి జనవరి 15, 2024న ఇద్దరు ఇద్దరు బాలురు తీవ్రగాయాలపాలయ్యారు. ఓ భవనంపై గాలి పటాలు ఎగురవేస్తుండగా పక్క భవనంపై గాలిపటం పడటంతో దానిని తెచ్చుకునేందుకు అక్కడికి వెళ్లారు. దానిపైనున్న 33 కేవీ విద్యుత్తు తీగలను గమనించక విద్యుదాఘాతానికి గురయ్యారు. అప్పటి నుంచి భవనం ఎక్కేందుకు యజమానులు జంకుతున్నారు. ప్రకాశంరోడ్‌లోని ఓ భవనాన్ని ఆనుకొని 33 కేవీ ప్రధాన తీగలున్నాయి. రెండేళ్ల కిందట భవనంపై ఆడుకునేందుకు ఎక్కిన ఓ బాలికకు విద్యుత్తు తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడింది. తర్వాత విద్యుత్తు తీగలు తగలకుండా ఉండేందుకు భవనంపై ప్రత్యేక కంచెను ఏర్పాటు చేసుకొని బిక్కుబిక్కుమని జీవనం సాగిస్తున్నారు..

కోరుట్ల పట్టణంలో ఇళ్లపైనుంచి ఉన్న 33 కేవీ విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వెళ్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు.. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్తుశాఖ, పురపాలక సంఘం అధికారులు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోరుట్ల శివారులోని వ్యవసాయక్షేత్రాల నుంచి సుమారు 60 ఏళ్ల కిందట 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. ఈలైను పెద్దగుండు వద్దనున్న 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కల్లూర్‌రోడ్‌లో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ వరకు సుమారు 4 కి.మీల పొడవున ఉంది. కల్లూర్‌రోడ్, ఝాన్సీరోడ్, ప్రకాశంరోడ్, అయిలాపూర్‌రోడ్‌ల మీదుగా 33 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. గతంలో వ్యవసాయ భూములుండగా పట్టణం విస్తరించి నివాస ప్రాంతాలుగా మారాయి. ప్రజలు ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. సుమారు రెండేళ్ల కిందట 33 కేవీ విద్యుత్తు లైన్‌ను మార్చేందుకు అప్పటి విద్యుత్తుశాఖ అధికారులు సర్వేలు చేపట్టారు. లైన్ పైభాగంలో రైల్వేస్టేషన్ భూములు ఉండటంతో అందులో వేయడం కుదరదని విడిచి పెట్టారు. గతేడాది కల్లూర్‌రోడ్‌లో ప్రమాదం జరిగినచోట్ల నూతన స్తంభాలను ఏర్పాటు చేసి కొంతమేర విద్యుత్తు తీగలను ఇళ్ల మీది నుంచి తొలగించి వేరేచోట ఏర్పాటు చేసేందుకు రూ.58 లక్షలతో విద్యుత్తుశాఖ అధికారులు అంచనాలు తయారు చేసి మున్సిపల్ అధికారులకు నివేదించారు. మున్సిపల్ అధికారులు నిధులు చెల్లిస్తే వెంటనే నూతన లైన్ ఏర్పాటు చేస్తుండేవారు. బల్దియా అధికారులు ఏడాది గడిచినా నిధులు చెల్లించకపోవడంతో అది అటుకెక్కింది.

నిబంధనల ప్రకారం 33 కేవీ విద్యుత్తు ప్రధాన తీగల కింద ఎలాంటి ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టకూడదు. అనుమతి లేని ఇళ్లకు మున్సిపల్ నుంచి ఇంటి నంబర్లు కేటాయించి ఏటా పన్నులు వసూలు చేస్తున్నారు. విద్యుత్తుశాఖ అధికారులు మీటర్లను ఏర్పాటు చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మేల్కోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈవిషయమై ఏఈ రఘుపతిని వివరణ కోరగా కల్లూర్‌రోడ్‌లో 33 కేవీ విద్యుత్తు తీగలను మార్చేందుకు మున్సిపల్‌కు రూ.58 లక్షల డిమాండ్ నోటీసును జారీ చేశామన్నారు. డబ్బులు చెల్లిస్తే వెంటనే పనులు చేస్తామన్నారు.

# భువన్ సర్వే సక్రమంగా సాగేనా?

ఆదిలాబాద్ : బల్దియాలో నివాస, వ్యాపార, వాణిజ్య భవన సముదాయాల ఆస్తి పన్ను మదింపు చేసేందుకు భువన్ సర్వే ప్రారంభమైంది. రెండో విడత భువన్ సర్వేలో మ్యాపింగ్ చేయకుండా మిగిలిపోయిన ఆస్తులకు తాజాగా రెవెన్యూ సిబ్బంది కొలతలు తీసే పనిలో పడ్డారు. రెండో విడత భువన్ సర్వే 2020లో ప్రారంభమైంది. అప్పటికి 40 వేలకు పైగా ఆస్తులు ఉండగా కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ కారణంగా 30 వేల అసెస్‌మెంట్లను మాత్రమే సర్వే చేశారు. మిగిలిన ఆస్తులను సర్వే చేయలేదు. తాజాగా మిగిలిన ఆస్తులను, కొత్తగా నమోదైన 18వేల అసెస్‌మెంట్లను సర్వే చేసి వివరాలను నమోదు చేయనున్నారు. బల్దియాలో అన్ని రకాల ఆస్తులకు సంబంధించి 48 వేలకు పైగా అసెస్‌మెంట్లు ఉండగా రూ.14కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. గతంలో ఇంటి విస్తీర్ణానికి సంబంధించిన కొలతలు, అంతస్తులను సరిగా నమోదు చేయక ఆస్తి పన్ను తక్కువగా వస్తోంది. దీంతో బల్దియాలో ప్రస్తుతం 18 వేల ఆస్తులు సర్వే చేయాల్సి ఉంది. 15 మంది రెవెన్యూ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, ట్యాబ్‌లను అందజేసి సర్వే చేయిస్తున్నారు. తాజా సర్వేతో ఆస్తి పన్ను డిమాండ్ మరింత పెరిగే అవకాశముంది.

**తప్పుల తడకగా..**

రాష్ట్ర ప్రభుత్వం పురపాలికల్లో ఆస్తుల లెక్కను తేల్చేందుకు 2017లో తొలివిడత భువన్ సర్వే నిర్వహించింది. రెండో విడత 2020లో



చేపట్టింది. నివాస, వ్యాపార, వాణిజ్య భవన సముదాయాల కొలతలు తీసుకుని, ట్యాబ్‌లో చిత్రాలను తీసి జియోట్యాగింగ్ చేశారు. రెండో విడతలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇళ్లు లేకున్నా ఉన్నట్లుగా ఖాళీ ప్లాట్లకు ఇంటి నెంబర్లు వేసి భువన్ సర్వేలో నమోదు చేశారు. వాస్తవానికి ఖాళీ ప్లాట్లకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధించాలి. ఇంటి నెంబర్లు ఉన్న ఆస్తులనే భువన్ సర్వేలో నమోదు చేయాలి. అప్పట్లో కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శించి ఇష్టానుసారంగా సర్వేలో నమోదు చేశారు. కేఆర్కే కాలనీ, బంగారుగూడ, జీఎస్ ఎస్టేట్ కాలనీ, ఖానాపూర్, అంబేడ్కర్‌నగర్, 170 కాలనీల్లో ఇప్పటికీ ఆ వివరాలు ఆస్తి పన్నుల జాబితాలోనే కొనసాగుతున్నాయి. ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇవ్వడంతో అక్రమార్కులు లింకు డాక్యుమెంట్లు పొంది రిజిస్ట్రేషన్లు చేసుకుని క్రయవిక్రయాలు సాగించారు.

**సీడీఎంఏకు లేఖ రాస్తాం**

కల్యాణ్, ఆర్ఓ, బల్దియా

బల్దియాలో రెండో విడత చేసిన సర్వేలో మిగిలిపోయిన 18వేల ఆస్తులకు సిబ్బంది భువన్ సర్వే చేస్తున్నారు. ఆస్తుల కొలతలు పక్కాగా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో లేని ఇళ్లకు జియోట్యాగింగ్ చేసిన అసెస్‌మెంట్ల వివరాలను సేకరించి బల్దియా కమిషనర్ ద్వారా సీడీఎంఏకు లేఖ రాస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# అందరి దృష్టి రిజర్వేషన్లపైనే..

ఆదిలాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయనే ప్రచారం జరుగుతుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ మొదలైంది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఉండటంతో పాతస్థానంలో కొత్త రిజర్వేషన్ రానుంది. ఏమొస్తుందనేది నేతల్లో ఆసక్తి నెలకొంది. జడ్పీ ఛైర్మన్ పదవి నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి అన్ని స్థానాల్లో ఈ రొటేషన్ పద్ధతి అమలు కానుండటంతో అందరి దృష్టి రిజర్వేషన్లపైనే నెలకొంది.

గ్రామపంచాయతీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులకు గత ప్రభుత్వం రెండు దఫాలకు వర్తించేలా పంచాయతీరాజ్ చట్టం(2018) తీసుకొచ్చింది. పదేళ్లపాటు అదే రిజర్వేషన్ ఉంటుందని భావించినా డిసెంబరులో నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు-2024కు ఆమోదం లభించడంతో ఒకే దఫా మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుంది. తద్వారా ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ మారనుండటంతో పోటీకి ఆసక్తి ఉన్న వారిలో కొత్త రిజర్వేషన్‌పై ఉత్కంఠనెలకొంది. రిజర్వేషన్ల కేటాయింపుల్లో తొలుత ఎస్టీలకు రిజర్వు స్థానాలు కేటాయిస్తారు. ఎస్టీ తరువాత ఆ స్థానం రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, అనంతరం బీసీకి రిజర్వు చేస్తారు. ఒకవేళ ఎస్సీ స్థానాలు ఇతరచోట సర్దుబాటు జరిగితే ఆ స్థానం రొటేషన్ పద్ధతిలో బీసీలకు కేటాయిస్తారు. ఆదిలాబాద్ జిల్లా పరిషత్ పదవి ఎస్టీకి రిజర్వు అయి పదవీకాలం ముగియడంతో మళ్లీ ఎస్టీకి కేటాయించే అవకాశం లేదు. జడ్పీ స్థానాల్లోనూ ఇదివరకు ఉన్న రిజర్వేషన్లు మారనున్నాయి. ఎంపీటీసీ, సర్పంచి పదవుల్లోనూ ఇదే పద్ధతిని అనుసరించనున్నారు.

ఏజెన్సీ మండలాలైన ఇంద్రవెల్లి, ఉట్నూరు, నార్నూరు, గాదిగూడల్లో



ఎంపీపీలు, సగం ఎంపీటీసీలు, 473 పంచాయతీల్లోని 251 నోటిఫైడ్(ఏజెన్సీ) గ్రామపంచాయతీల్లో సర్పంచి పదవులు మాత్రం ఎస్టీలకే రిజర్వు అయి ఉంటాయి. మహిళా రిజర్వు ఉంటే అది ఎస్టీ జనరల్ కిందకు మారుతుంది. ఇంతకుముందు 17 మండలాల్లో జడ్పీటీసీలకు 8 స్థానాలు రిజర్వేషన్ కింద కేటాయించారు. ఆ 8 రిజర్వేషన్ స్థానాలను జనరల్ కింద ఉన్న మిగతా 9 జడ్పీటీసీ స్థానాల్లో సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఒకటి తిరిగి జనరల్‌గా మిగిలే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్తగా భోరజ్, సాత్నాల, సొనాల మూడు మండలాలు ఏర్పడడంతో అక్కడ మాత్రం జడ్పీటీసీకి కొత్తగా రిజర్వేషన్ స్థానాల సంఖ్య రానుంది. ప్రస్తుతం జిల్లా 20 మండలాలుగా ముఖచిత్రం మారడంతో సగం రిజర్వేషన్ లెక్కన 10 స్థానాలు రిజర్వుచేయాలి. ఈ మేరకు 8 నుంచి 10కి రావాలంటే మరో రెండు జడ్పీటీసీ రిజర్వేషన్‌లు పెరగనున్నాయి. కొత్తగా ఏర్పడిన మూడు మండలాలకు ఈ రెండు రిజర్వేషన్లు వస్తాయని తెలుస్తోంది. మొత్తానికి 10 రిజర్వేషన్, మరో 10 జనరల్ కింద కేటాయిస్తారు.


**మూడు మండలాల్లో ఎంపీటీసీలకు** కొత్తగా ఏర్పడిన మూడు మండలాల్లోని ఎంపీటీసీ స్థానాలకు మాత్రం కొత్త రిజర్వేషన్ అమలు చేయనున్నారు. ఎంపీపీ కొత్త రిజర్వేషన్ రానుంది. కొత్తగా ఏర్పడిన పంచాయతీలు పూనగూడ, ఎల్లమ్మగూడ, ఏసాపూర్, అత్నంగూడ, వడెగల్‌పూర్‌లకు ఇదే పద్ధతిలో కొత్త రిజర్వేషన్ అమలు చేయనున్నారు.

# శ్రమయేవ స్వయం వృద్ధి

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన ఎస్సీ కార్పొరేషన్‌ను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అర్హులైనవారికి రుణాలిచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. సంప్రదాయ యూనిట్లకు భిన్నంగా సాంకేతికత జోడించి కొత్త యూనిట్లు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. రుణాల పంపిణీకి సంబంధించి మూడుగా విభజించారు. మొదటి విభాగం రూ.3 లక్షల లోపు, రెండో విభాగం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు, విభాగంలో రూ.10 లక్షల లోపు యూనిట్లు ఉంటాయి.

**బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పెద్దఎత్తున రుణాలిచ్చారు. కేంద్ర ప్రభుత్వం.. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద గతంలో రుణాలిచ్చింది. వీటితో చాలామంది ఇన్నోవా వాహనాలతోపాటు వ్యవసాయ యంత్రాలు తదితరాలు కొనుగోలు చేశారు. 2015 నుంచి 2018 వరకు ఈ రుణాలు తీసుకుని పలువురు ఆర్థికంగా స్థిరపడ్డారు. కానీ చాలామంది లబ్ధిదారులు బ్యాంకులకు రుణాలు చెల్లించలేదు. సుమారు రూ.50 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు సమాచారం. వీటిని వసూలు చేసేందుకు ప్రత్యేకంగా రికవరీ అధికారులను నియమిస్తున్నారు. వీరి ద్వారా బకాయిలు త్వరగా వసూలు చేయాలని ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయించారు.



**సృజనాత్మకత జోడించేలా..**

సంప్రదాయ పద్ధతుల్లో కాక సాంకేతికత, సృజనాత్మక జోడించి వ్యాపారం చేసేలా ప్రభుత్వం ఎస్సీ యువతను ప్రోత్సహిస్తోంది. పూల బొకేల వ్యాపారం, వర్మీ కంపోస్టు, ఐటీ సేవలు, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్ఈడీ బల్బుల తయారీ, నీళ్ల సీసాల రీఫిల్లింగ్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్లు తదితరాలు మొదటి విభాగంలో ఉన్నాయి.

చరవాణుల మరమ్మతులు, సబ్బుల తయారీ, మొబైల్ కార్‌వాష్, అడ్వెంచర్ టూరిజం, పట్టు పరిశ్రమ, వెడ్డింగ్ ఫ్యాబ్రికేషన్ యూనిట్, జూట్ బ్యాగ్, సౌరశక్తి పరికరాల అమరిక, సోలార్ ప్యానెళ్లు, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఆయుర్వేదిక్, హెర్బల్ స్టోర్, బ్యూటీపార్లర్, మెడికల్ ల్యాబ్, బేకరీ, బ్రిక్ ఫ్లైయాష్, ఈవీ బ్యాటరీ తయారీ విభాగాలు రెండో విభాగంలో ఉన్నాయి.

ప్యాసింజర్ కారు, ఆటో, రవాణా రంగంలో వాహనాలు, వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం తదితరాలు మూడో విభాగంలో ఉన్నాయి. ప్రభుత్వం మంజూరు చేసే రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా స్థిరపడేలా యువతకు అవకాశం కల్పించనున్నారు.

# ఇటుక పెట్టలేదు.. ఇటువైపు చూడలేదు

పెనుగొండ : పిల్లర్ల దశలో కనిపిస్తున్న ఈ నిర్మాణం పెనుగొండ మండలం ములపర్రులోని గ్రామ సమాఖ్య భవనం. సుమారు ఆరేళ్ల కిందట దీని నిర్మాణం చేపట్టగా.. ప్రభుత్వం మారడంతో ఇలా వదిలేశారు. బేస్‌మెంట్‌తో పాటు పిల్లర్లు సైతం పాడయ్యాయి.

గ్రామాల్లో డ్వాక్రా మహిళల కార్యకలాపాల నిర్వహణకు సొంత భవనాలు లేక ఇబ్బంది పడుతున్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వీలుగా గతంలో ప్రభుత్వం మండల సమాఖ్య వ్యవస్థను తీసుకొచ్చింది. దీని ద్వారా మహిళలు తమ సమస్యలను చర్చించుకోవడం, శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవడం, ఆర్థికంగా నిలదొక్కునేందుకు వ్యాపార పరమైన ఆలోచన చేయడం వంటి ఎన్నో నిర్ణయాలు ఇక్కడ చేసేవారు.

ఇవన్నీ సత్ఫలితాలు ఇవ్వడంతో గత తెదేపా ప్రభుత్వం వీటిని విస్తరించేందుకు ప్రతి పంచాయతీలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2017లో ఉపాధి పథకం నుంచి రూ.7 లక్షలు, డీఆర్‌డీఏ నుంచి రూ.6 లక్షలతో నిర్మించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. కొన్ని చోట్ల వీటి నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురాగా.. మరికొన్ని చోట్ల నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.

గాలికి వదిలేసిన వైకాపా ప్రభుత్వం.. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని పూర్తిగా విస్మరించింది. దీంతో పలు చోట్ల భవనాలు శిథిల దశకు చేరుకోగా, మరికొన్ని చోట్ల పిచ్చి మొక్కలు మొలిచాయి. కొన్ని చోట్ల ఈ అసంపూర్తి భవనాలను స్థానికులు తమ అవసరాలకు వినియోగించుకుంటూ క్రమంగా ఆక్రమించుకుంటున్నారు.

**వాటికి కేటాయించడంతో..** వైకాపా ప్రభుత్వ నిర్ణయంతో కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా మహిళలు ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోయింది. సచివాలయం, ఆర్బీకేల ఏర్పాటు పేరుతో వీటి కార్యకలాపాలను ఈ భవనాల్లో ప్రారంభించారు. దీంతో డ్వాక్రా సమావేశాలన్నీ గుడులు, చెర్వుగట్లు, మండపాల్లో నిర్వహించుకుంటున్నారు. పైగా గ్రామ సమాఖ్య కార్యకలాపాల కోసం కొనుగోలు చేసిన కంప్యూటర్లు, ఇతర కార్యాలయ సామగ్రి సైతం సచివాలయాలకు అప్పగించారు. ఈ భవనాల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్ తెలిపారు.

ఇది వీరవాసరం మండలం వడ్డిగూడెంలోని గ్రామ సమాఖ్య భవనం. కొద్దిపాటి పనులు చేసి వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నా.. దీనిని పట్టించుకోలేదు. ఫలితంగా ప్రాంగణం గడ్డి, ఇతర వ్యర్థాలతో నిండి విష సర్పాలు, కీటకాలకు ఆవాసంగా మారింది.

**జిల్లాలో పరిస్థితి ఇదీ**

మంజూరైన భవనాలు- 372
కేటాయించిన నిధులు- రూ.48.36 కోట్లు
నిర్మాణం పూర్తయినవి -144
గ్రామ సమాఖ్యలకు అప్పగించినవి -81
ఇతర శాఖలు వినియోగిస్తున్నవి -43
ఇంకా ప్రారంభం కానివి -20
వివిధ దశల్లో ఉన్నవి- 228

# అంధకారంలో వదిలేశారు!



రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జాతీయ రహదారి 16, 216ఏలపై ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నా నియంత్రణకు అడుగులు పడడంలేదు. మూడు నెలలకో సారి రహదారి భద్రత సమావేశాలు నిర్వహిస్తున్నా ఆ నిర్ణయాలు అమలవడంలేదు. అధిక శాతం ప్రమాదాలు రాత్రివేళల్లోనే.. హైవేలపై కనీసం దీపాలు వేయలేని పరిస్థితి. మలుపులు, కూడళ్ల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంలేదు. మొత్తంగా 104 ప్రమాదకర ప్రదేశాలున్నాయి.

**532 సౌర దీపాలు ఏమయ్యాయి?**

తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో సుమారు 377 కి.మీ మేర (రాజమహేంద్రవరం ఎన్‌హెచ్ పీడీ పరిధి) జాతీయ రహదారులు ఉన్నాయి. వాటిపై 64 ప్రమాద ప్రదేశాలు, 40 బ్లాక్‌స్పాట్లు కనిపిస్తాయి. ఆయాచోట్ల రూ.13 కోట్లతో 532 సౌర దీపాల ఏర్పాటుకు జనవరిలోనే నిర్ణయించినా నేటికీ టెండర్ల దశ దాటలేదు. మూడునెలల క్రితం రాజమహేంద్రవరంలో నిర్వహించిన రహదారి భద్రత సమావేశంలోనూ చర్చకు వచ్చినా చర్యలు లేవు.

**ఎన్‌హెచ్ 16లో ఇవీ ప్రమాదకర ప్రదేశాలు**

జాతీయ రహదారి 16పై అనకాపల్లి నుంచి అన్నవరం మధ్యలో 27 ప్రమాద ప్రదేశాలున్నాయి. అన్నవరం డిగ్రీ కళాశాల, మండపం సెంటర్ నుంచి గుడి వరకు 100 మీటర్ల పరిధి.. టి.తిమ్మాపురం, అన్నవరం ఆర్చ్ వద్ద ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

అన్నవరం-దివాన్‌చెరువు మధ్యలో 19 ప్రదేశాలు ఉన్నాయి. అవి: వెన్నుపూడి కూడలి, ధర్మవరం శివారు, రాచపల్లి క్రాస్ రోడ్డు, ప్రత్తిపాడు సంతోషిమాత ఆలయం..చిన్నింపేట, ఎర్రవరం, కృష్ణవరం, తాళ్లూరు దాబా, కత్తిపూడి పెట్రోల్‌బంక్, గండేపల్లి, నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంతాలు.

కొవ్వూరు- దేవరపల్లి- గుండుగొలను సెక్షన్‌లో పుల్లలపాడు పెట్రోలు బంక్, కప్పలగుంట వేబ్రిడ్జి, గున్నంపల్లి, బుట్టాయిగూడెం, సీతంపేట, డైమండ్ జంక్షన్ ఉన్నాయి.

దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద 14 దీపాలు ఉంటే ఆరు వెలగడం లేదు. కొత్తగూడెం దిగువ ప్రాంతం, గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి యాదవోలు వరకు అంధకారమే.

216ఏలో ఎక్కడెక్కడంటే..

దివాన్‌చెరువు-సిద్ధాంతం, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక సెంటర్, చొప్పెళ్ల, జొన్నాడ ఆంజనేయస్వామి గుడి, దివాన్‌చెరువు పండ్ల మార్కెట్, ఆటోనగర్, హౌసింగ్‌బోర్డు కూడలి, బొమ్మూరు, ఆలమూరు, రావులపాడు

ఎన్‌హెచ్ 216లో కత్తిపూడి - కాకినాడ బైపాస్ పరిధిలో విరవాడ వద్ద ఎక్కువ ఘటనలు జరుగుతున్నాయి.

కోనసీమ జిల్లా పరిధిలో 216 రహదారిపై ఎక్కడా దీపాలు లేవు.

**31న టెండర్లు తెరుస్తాం..**జాతీయ రహదారులపై సౌర దీపాల ఏర్పాటుకు టెండర్ల గడువు ఈనెల 30తో ముగుస్తుంది. 31న తెరిచిన తరువాత ఏజెన్సీని ఖరారు చేసి ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. అక్టోబరు నాటికి పనులు ప్రారంభిస్తాం.

రోహిత్‌కుమార్, ఎన్‌హెచ్ పీడీ (ఎఫ్ఏసీ), రాజమహేంద్రవరం)

# రుణం కొండంత.. రికవరీ గోరంత



చిత్తూరు : నా ఎస్సీలు అంటూ ఊరూరా ఊదరగొట్టిన జగన్ అధికారంలోకి రాగానే వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. తెదేపా హయాంలో అమలు చేసిన పదుల సంఖ్యలో పథకాలు రద్దు చేసి ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. ఐదేళ్లలో కనీసం ఒక్క పథకం అమలు చేయలేదు. 2021-22లో ఉమ్మడి జిల్లాలో రూ.28.77 లక్షలతో ఏడు యూనిట్లు మాత్రమే మంజూరు చేశారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులను దారి మళ్లించారు. రుణాలు మంజూరు చేయకపోగా, పాతవాటిని రికవరీ చేయలేదు.

తెదేపా ప్రభుత్వ హయాంలో 2015-18 మధ్య ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 736 మందికి నేషనల్ షెడ్యూల్డు కులాల ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్ఎఫ్‌డీసీ) పథకం కింద స్వయం ఉపాధి, వాహనాల కొనుగోలు, ఆటో, కార్లు, భూ కొనుగోలుకు రూ.23.50 కోట్లు రుణం మంజూరు చేశారు. ఇందులో రూ.5.57 కోట్లు రికవరీ చేయగా, మిగిలిన రుణం వడ్డీతో కలిపి రూ.19.90 కోట్లు బకాయిలు ఉన్నాయి. నేషనల్ సఫాయి కర్మచారీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఎఫ్‌కేఎఫ్‌డీసీ) పథకం కింద 396 మందికి రూ.6.50 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.52.10 లక్షలే రికవరీ చేయగా, ఇంకా వడ్డీతో కలిపి రూ.6.44 కోట్లు బకాయిలు ఉన్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో వైకాపా ప్రభుత్వంలో ఏడుగురికి రూ.27.93 లక్షలు రుణమిచ్చి, రూ.95 వేలు రికవరీ చేశారు. వడ్డీతో కలిపి రూ.28.77 లక్షలు బకాయిలు ఉన్నాయి. మొత్తంగా రూ.23.63 కోట్లు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయగా, రూ.6 కోట్లు మాత్రమే రికవరీ చేశారు. ఇంకా 20.52 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది.

**బకాయిదారులకు తాఖీదులు..**

వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్‌ను గాలికి వదిలేయడంతో కొత్త రుణాలు ఇవ్వకపోగా, అంతకు ముందు ఇచ్చిన రుణాలను రికవరీ చేయడంలోనూ విఫలమైంది. దీంతో రుణం తీసుకున్న వారిలో పలువురు యూనిట్లను మూసేయగా, వాహనాలు విక్రయించేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో రుణాలు చెల్లించలేదు. దీంతో కొత్త వారికి అవకాశం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేస్తోంది. మొండి బకాయిల రికవరీకి చర్యలు చేపట్టింది. రుణాలు తీసుకున్న వారితో పాటు, వారికి జామీను ఇచ్చిన వారికీ తాఖీదులు సిద్ధం చేసింది. పాతవి రికవరీ అయితే కొత్త వారికి రుణాలు అందనున్నాయి.

**రికవరీకి చర్యలు చేపడుతున్నాం..**

ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలు పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయి. రుణం తీసుకున్న వారితో పాటు, జామీనుదారులకు తాఖీదులు ఇస్తున్నాం. త్వరలో బకాయిలు రాబట్టి, మరింత మంది ఎస్సీ నిరుద్యోగులకు రుణం మంజూరయ్యేలా కృషి చేస్తాం.

శ్రీదేవి, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

ఉమ్మడి జిల్లాలో రుణాలు ఇలా..

లబ్ధిదారులు 1,139
మంజూరు చేసిన రుణం రూ.26,63,29,212
రికవరీ రూ.6,10,92,920
బకాయిలు రూ.20,52,36,292

# ద్రవిడ.. సాంకేతిక తోవ..!

కుప్పం : ద్రావిడ సంస్కృతి.. సంప్రదాయాలను పరిరక్షించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ద్రవిడ విశ్వవిద్యాలయం సాంకేతికత వైపు అడుగులేస్తోంది. కాలానుగుణంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ విద్యను ప్రవేశపెట్టింది. తొలి అడుగులోనే కూటమి ప్రభుత్వం ద్రవిడ విశ్వవిద్యాలయానికి సీఎస్ఈ, సీఎస్ఎం (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) రెండు కోర్సులకు అనుమతి ఇచ్చింది. ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ప్రకటించడంతో ఇంజినీరింగ్ చదవాలనే ఎంతోమంది నిరుపేదలకు వరంలా మారింది.

**సీఎస్ఈ విభాగంలో..**

కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపై అవగాహన కల్పించడంతో పాటు ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, డేటా బేస్ మేనేజ్‌మెంట్, నెట్ వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ తదితర విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కోర్సు చదువుకున్నవారికి సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డిజైనర్, సిస్టమ్ ఎనలిస్ట్, నెట్‌వర్క్ ఇంజినీర్, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్టులుగా కార్పొరేట్, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగావకాశాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

**సీఎస్ఎంలో..**

ఈ కోర్సులో డీప్ లెర్నింగ్, డేటా సైన్స్, న్యూరల్ నెట్‌వర్క్స్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, రోబోటిక్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కోర్సు చదువుకున్న వారికి ఏఐ ఇంజినీర్, డేటా సైంటిస్ట్, మెషిన్ లెర్నింగ్ డెవలపర్, బిగ్ డేటా ఎనలిస్ట్ తదితర రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.



**కార్పొరేట్‌కు దీటుగా బోధన**

ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ద్రవిడ విశ్వవిద్యాలయానికి ఇంజినీరింగ్ కోర్సులను మంజూరు చేసింది. ప్రస్తుతం ఏపీఈఏపీ సెట్ ద్వారా అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం. రెండు కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఒక్కో కోర్సులో 60 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తాం. ద్రవిడలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇంజినీరింగ్ విద్యార్థులకు విద్యాబోధన చేపడతాం.

ఆచార్య దొరస్వామి, ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం

# లేఖ ఉంటే ఇచ్చేయ్.. లేకుంటే వదిలేయ్!

విజయనగరం : సీతానగరం మండలానికి చెందిన ఓ యువతి బొబ్బిలి మండలంలో పనిచేస్తోంది. ఆమె భర్త బొబ్బిలిలో ప్రభుత్వ ఉద్యోగం చేయడంతో స్పౌజ్ కోటాలో కోమటిపల్లి, మెట్టవలస, బూర్జవలస ప్రదేశాలను ఎంచుకున్నారు. అలజంగి, పెంట సచివాలయాల్లోనూ ఖాళీలున్నాయి. ఇవేవీ ఇవ్వకుండా పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేటకు స్థానచలనం చేశారు. సీనియార్టీ, స్పౌజ్ కేటగిరీలను పరిగణనలోకి తీసుకోలేదు. ఆమె కన్నా సీనియార్టీ తక్కువున్న ఇద్దరిని అలజంగి, పెంట కార్యాలయాలకు పంపించారు.

ఇటీవల జరిగిన గ్రామ, వార్డు సచివాలయాల బదిలీల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేతల సిఫార్సులు, లేఖలకే అధికారులు ప్రాధాన్యం ఇచ్చారని, కేటగిరీలను పట్టించుకోకుండా నచ్చిన ప్రాంతాలకు పంపించారని ఇటీవల పలువురు ఉద్యోగులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. గురువారం కొందరు మహిళా డిజిటల్ అసిస్టెంట్లు న్యాయం చేయాలని కోరుతూ జేసీ సేధు మాధవన్ దగ్గర ఆవేదన వినిపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు సొంత మండలం ఇవ్వకూడదు. అంధులు, మానసిక, శారీరక దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందినవారికి తొలుత ప్రాధాన్యమిచ్చి దగ్గర కార్యాలయాలు కేటాయించాలి. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉ



ద్యోగులైతే పక్కపక్క సచివాలయాలు లేదా ఒకేచోట అవకాశం ఇవ్వాలి. కానీ ఉమ్మడి జిల్లాలో ఈ నిబంధనలు అమలు కాలేదు. నేతల సిఫార్సులకే అధికారులు పెద్దపీట వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అన్ని శాఖల్లో అదే తీరు!**

సర్వేశాఖలో సిఫార్సు లేఖలపై సంబంధిత అధికారులే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడం గమనార్హం. పశుసంవర్ధక శాఖకు సంబంధించి సుమారు వంద మందిని సిఫార్సులు చేస్తూ ప్రజాప్రతినిధులు లేఖలు ఇచ్చినట్లు ఆ విభాగం పేర్కొంది. అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.


**రిలీవ్ చేయని ఎంపీడీవోలు**

హేతుబద్ధీకరణలో భాగంగా పంచాయతీశాఖలో గ్రేడ్-5 కార్యదర్శులు, పట్టు పరిశ్రమ, విద్యుత్తుశాఖ మినహా 12 శాఖల్లో బదిలీలు నిర్వహించారు. ఇందులో పురపాలక/అర్బన్ డెవలప్‌మెంట్, 11 ఇతర విభాగాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 3,815 మంది ఉద్యోగుల బదిలీలకు ప్రక్రియ చేపట్టారు. ఇప్పటివరకు 90 శాతం మంది కేటాయించిన స్థానాల్లో చేరారు. కొన్ని మండలాల్లో ఎంపీడీవోలు రిలీవ్ చేయకపోవడంతో విధుల్లో చేరని పరిస్థితి ఉంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, మక్కువ, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో ఈ పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని సచివాలయాల అధికారిణి ఎస్.రోజారాణి తెలిపారు. నిబంధనల ఉల్లంఘన విషయం తమకు సంబంధం లేదన్నారు.

# ప్రైవేటుకు తగ్గిన విద్యార్థులు

విజయనగరం : ఇంటర్మీడియట్‌లో రెండు విడతల ప్రవేశాల ప్రక్రియ పూర్తయింది. గతేడాదితో పోల్చితే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు విద్యార్థులు తగ్గుముఖం పట్టారు. ప్రభుత్వ యాజమాన్యాల్లో పెద్దగా మార్పు లేదని అధికారులు చెబుతున్నారు. గతేడాది ప్రైవేటు విద్యాలయాల్లో 15,631 మంది చేరగా.. ఈ సారి 13,988 మందే ముందుకొచ్చారు. జేఈఈ, నీట్, ఏపీఈఏపీసెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఇతర జిల్లాలకు వెళ్లినట్లు తెలుస్తోంది. కొందరు ఐటీఐ, డిప్లొమా, ఐఐఐటీల్లో చేరి ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఇంకా కొరతే..** జిల్లా వ్యాప్తంగా 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి అన్ని యాజమాన్యాల్లో 19,021 మంది ప్రవేశాలు పొందారు. గతేడాదిలో 20,903 మంది చేరారు. ఇంకా 1882



మంది విద్యార్థుల కొరత కనిపిస్తోంది. ప్రభుత్వ విద్యలో స్వల్ప వ్యత్యాసమే నెలకొంది. గతేడాది 2,636 మంది ఆశ్రయించగా.. ఈసారి 2,482 మంది చేరారు. కొందరు కళాశాలల్లో నమోదైనప్పటికీ ఆన్‌లైన్‌లోకి రాలేదని అధికారులు చెబుతున్నారు. సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైనందున ఇంకా వస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడో విడత కౌన్సెలింగ్‌పై ఆశలు పెట్టుకున్నారు.

**ప్రభుత్వ విద్యలో..**

కూటమి వచ్చిన తర్వాత ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న వారికి మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. గత ప్రభుత్వం నిలిపివేసిన ఈ పథకాన్ని పునరుద్ధరించింది. పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసింది. ఈ విద్యాసంవత్సరంలో ఏప్రిల్ నుంచే ప్రవేశాలు ప్రారంభించింది. నెల రోజుల పాటు బ్రిడ్జికోర్సు నిర్వహించింది. జాతీయ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని మెటీరియల్‌ను అందజేసింది. పాఠశాల తరహాలోనే విద్యార్థి మిత్ర, తల్లికి వందనం పేరుతో కిట్లను అందజేశామని ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్.తవిటినాయుడు తెలిపారు. ఈ నెలాఖరు వరకు ప్రవేశాలకు గడువుందని చెప్పారు.

# సాగుకు డ్రోన్ దన్ను



అనంతపురం : కూటమి ప్రభుత్వం వ్యవసాయంలో రైతులకు అండగా నిలుస్తోంది. రాయితీపై విత్తనాలు, పరికరాలను అందిస్తోంది. సాగులో సాంకేతికత వినియోగానికి సంబంధించి.. గత ప్రభుత్వ కాలంలో మూలన పడిన కిసాన్ డ్రోన్ల పథకం నిబంధనలు సడలించింది. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు పురుగుమందులు పిచికారీ చేసేలా డ్రోన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. వాటికోసం రైతులు ఆసక్తి చూపుతూ ముందుకొస్తున్నారు.

**నిబంధనల సడలింపు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మండలానికి 3 చొప్పున 189 డ్రోన్లను రైతులకు ఇవ్వాలని 2023లో వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. ఎవరూ ముందుకు రాకపోవడంతో మండలానికి ఒకటి మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ల తరహాలో రైతు గ్రూపులను ఏర్పాటు చేసి అందించాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో డిప్లొమా, బీటెక్ వ్యవసాయ (బీఎస్సీ) విద్యార్హతతోపాటు పాస్‌పోర్టు విధిగా ఉంటేనే డ్రోన్ ఇస్తామని నిబంధన విధించారు. దీంతో ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం తాజాగా నిబంధనలను సడలించింది. విద్యార్హత ఇంటర్ ఉంటే చాలు. డ్రోన్ మంజూరు అయ్యేలోపు పాస్‌పోర్టు తెచ్చుకునే వెసులుబాటు కల్పించారు. గ్రూపులో ఐదుగురు సభ్యుల కంటే ఎక్కువమంది ఉండాలి. వారిలో ఒకరు ఇంటర్ చదివి, పట్టాదారు పాసుపుస్తకం ఉంటే పైలెట్‌గా తీసుకుంటారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. తొలుత రైతు గ్రూపు సభ్యులు, నిరుద్యోగ యువతను ఎంపిక చేస్తారు. ఆ జాబితాను జిల్లా వ్యవసాయశాఖ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు పంపుతారు. ఆ తర్వాత గుంటూరులోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 12 రోజులు డ్రోన్లపై ఉచిత శిక్షణ ఇస్తారు. ఎంపికైన వారికి సాంకేతిక పరిజ్ఞానం, మెడికల్ సర్టిఫికెట్ పరిగణనలోకి తీసుకుంటారు.

**సమయం, డబ్బు ఆదా**

ఉమామహేశ్వరమ్మ, అనంతపురం జిల్లా వ్యవసాయాధికారి

ఉమ్మడి జిల్లాలో రైతులు పంటలకు తరచూ పురుగుమందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. అందుకు ఎక్కువ సంఖ్యలో కూలీలు అవసరం. తద్వారా సమయం, డబ్బు అధికంగా ఖర్చయ్యేది. డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. రైతులు మందులు పిచికారీ, ఇతరులకు అద్దెకు ఇవ్వచ్చు. ఆదాయం వస్తుంది, సమయం ఆదా అవుతోంది.

**రాయితీ ఇలా..**మొత్తం కిసాన్ డ్రోన్లు: 70

ఒక్కో దాని విలువ : రూ.9.80 లక్షలు

రైతువాటా : రూ.4.90 లక్షలు

బ్యాంకు రుణం : రూ.4.90 లక్షలు

డ్రోన్ అందించిన తర్వాత రూ.2 లక్షలు

రైతు వాటా పోను, మిగిలిన రూ.7.80 లక్షలు ప్రభుత్వం రైతు గ్రూపు ఖాతాలకు జమ చేయనుంది.

# వరద తగ్గింది.. దందా మొదలైంది

పి.గన్నవరం: గోదావరి నదికి పదిహేను రోజుల క్రితం వరదనీరు రావడంతో ఇసుక అక్రమ తవ్వకాలకు వీలు లేకుండాపోయింది. ప్రస్తుతం వరద తగ్గి ఇసుకతిన్నెలు బయటపడటంతో అక్రమార్కులు మళ్లీ రంగంలోకి దిగారు. లంకలగన్నవరం వద్ద వశిష్ఠ నదీ పాయలోంచి గురువారం పడవల్లో ఎగుమతి చేసి రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి వరదల సీజన్‌కు ముందే ఈ అక్రమ ర్యాంపు నుంచి విచ్చలవిడిగా ఇసుక తవ్వి రవాణా చేయాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. కొంతమంది నాయకుల మధ్య ఈ వ్యవహారంలో సయోధ్య ఏర్పడటంతో మళ్లీవారు రంగంలోకి దిగారు. ఇక్కడ పడవల ద్వారా ఇసుక తీయడం మొదలు పెట్టారు. వరద ఎక్కువగా వచ్చేవరకు తీయాలని కార్యాచరణ చేసుకున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అనుమతులు ఇచ్చారంటూ సమాధానం



చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అక్టోబరు వరకు నదీపాయల్లో ఇసుక తీయకూడదని ఇటీవల జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. ఎవరైనా తీస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించిప్పటికీ అక్రమార్కులు బేఖాతరు చేస్తున్నారు.

**కేసులు పెడతాం..**

లంకలగన్నవరం వద్ద ఇసుక తీస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఆర్.ఐ., సిబ్బందిని అక్కడికి పంపించాం. తవ్వకాలను నియంత్రించాం. అక్టోబరు మాసాంతం వరకు గోదావరిలో ఎవరూ ఇసుక తీయకూడదు. ఎలాంటి అనుమతులు లేవు. అక్రమాలకు పాల్పడితే కేసులుపెడతాం.

పి.శ్రీపల్లవి, తహసీల్దార్, పి.గన్నవరం

## చిత్తూరు కార్పొరేషన్ భూమికే ఎసరు!

చిత్తూరు: ఆక్రమణలతో చిత్తూరు నగర పాలక సంస్థకు చెందిన భూములు మాయం కాగా.. ఇప్పుడు కొందరు అక్రమార్కులు డంపింగ్ యార్డు స్థలానికే ఎసరు పెట్టారు. మంగసముద్రం రెవెన్యూ లెనిన్‌నగర్ సర్వే నంబరు 113లో నగరపాలక సంస్థకు 1.50 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం దీని విలువ రూ.6 కోట్లు. దశాబ్దాలుగా అడంగల్‌లో డంపింగ్ యార్డు స్థలంగా చూపుతోంది. తాజాగా కొందరు ఆ భూమి చుట్టూ రాతి కూసాలు నాటి వెంచర్ వేసేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి కబ్జా వ్యవహారం వెళ్లడంతో ఆయన ఆఘమేఘాలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులను అక్కడకు పంపారు. కమిషనర్ నరసింహ ప్రసాద్.. సిబ్బందితో స్తంభాలు తొలగింపజేశారు. కొందరు తమకు గతంలో పట్టాలు ఇచ్చారని చెప్పగా



అభ్యంతరం ఉంటే రెవెన్యూ యంత్రాంగంతో మాట్లాడాలని సూచించారు. స్థానిక వీఆర్వోకు కబ్జా గురించి తెలిసినా అక్రమార్కులకు సహకరించారనే ఆరోపణలున్నాయి. తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ప్రమేయం ఉందని కలెక్టరేట్ వర్గాలు భావిస్తున్నాయి.

**సహకరిస్తే కఠినచర్యలు తప్పవన్న కలెక్టర్**

కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది.. రాజకీయ నాయకులతో కలిసి ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేయడాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్లను హెచ్చరించారు. డిజిటల్ కీలు దుర్వినియోగం చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## అర చేతిలో వ్యవసాయ విద్య

గుంటూరు : వ్యవసాయం, అనుబంధ రంగాలపై మీకు ఆసక్తి ఉందా.. పుట్ట గొడుగులు, చిరుధాన్యాలు, తేనెటీగలు పెంచాలని ఉన్నా మెలకువలు తెలియడం లేదా..? మీ కోసమే ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం కొత్త కోర్సులు తీసుకొచ్చింది. ఇంటి వద్ద ఉంటూనే ఆన్‌లైన్లో తరగతులకు హాజరై పరిజ్ఞానం పెంచుకోవచ్చు. వ్యవసాయ విద్యను రైతులు, మహిళలు, యువత, ఆసక్తి ఉన్న అందరికీ అందించాలనే ఉద్దేశంతో దూరవిద్య కేంద్రాన్ని ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ప్రారంభించింది. వ్యవసాయంలో నైపుణ్యం పెంచుకోవాలని అనుకున్నవారికి ఇదో చక్కటి అవకాశం.



**అందరూ అర్హులే..**

మొత్తం ఎనిమిది వారాల పాటు సర్టిఫికెట్ కోర్సులుంటాయి. తెలుగు రాయడం, చదవడం వస్తే చాలు. ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. వయో పరిమితి లేదు. అభ్యర్థుల వద్ద కంప్యూటర్ లేదా ఆండ్రాయిడ్ చరవాణి ఉండాలి. కోర్సుల్లో భాగంగా ఆరు ఆన్‌లైన్ తరగతులు, ఎంపిక చేసుకున్న స్టడీ సెంటర్‌లో అనుభవ పూర్వక, ప్రయోగాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారంలో ఒకరోజు 2-3 గంటల ఆన్‌లైన్ తరగతి ఉంటుంది. వరి వారంలో జరిగే పరీక్ష రాయాలంటే 100 శాతం హాజరు తప్పనిసరి. విశ్వవిద్యాలయమే పాఠ్య పుస్తకాలు ఇస్తుంది. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే ధ్రువపత్రం అందజేస్తారు.

ఇలా నమోదు చేసుకోండి..

%www.angrau.ac.in% వెబ్‌సైట్‌ను సందర్శించి నమోదు పత్రం డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తి వివరాలు నింపి రూ.1,500 డీడీ, మని ఆర్డర్‌ను ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్ ఏఎన్‌జీఆర్ఏయూ పేరుతో గుంటూరులో చెల్లే విధంగా తీసి పంపించాలి. మరిన్ని వివరాలకు జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం లేదా 90632 19959 నంబరును సంప్రదించాలని కురుపాం కేవీకే శాస్త్రవేత్త డా.తేజేశ్వరరావు తెలియజేశారు.

# కార్పొరేట్‌కు దీటుగా.. జీజీహెచ్



రాజమహేంద్రవరం : వైద్యం..ప్రస్తుతం అత్యంత ఖరీదుగా మారిపోయింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే మెరుగైన చికిత్స అందుతుందన్న ఆలోచనలతో చాలా మంది వాటిని ఆశ్రయించి ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ కార్పొరేట్ ఆస్పత్రుల మాదిరి స్పెషాలిటీ వైద్య చికిత్స అందిస్తున్నారు. రోగులకు అవగాహన లేక వీటిని సక్రమంగా వినియోగించుకోవడం లేదు. ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వీటికి సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

**ఊబకాయం నుంచి క్యాన్సర్ వరకు చికిత్స**

జీజీహెచ్‌లో విభాగాలుగా ప్రారంభించి సేవలందిస్తుంటే మరికొన్నింటిని ఓపీ ప్రాతిపదికన చూస్తున్నారు. గతేడాది జీజీహెచ్‌లో న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆంకాలజీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వాటితోపాటు జీవన విధానంలో మార్పుల కారణంగా వచ్చే ఊబకాయం, బీపీ, మధుమేహం, పోషకాహార లోపం వంటి వ్యాధులకు చికిత్స, అవగాహన కల్పించడానికి వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభించారు. స్క్రీనింగ్ చేసి ముందే క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారు. చికిత్సకు ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం యూరాలజీ సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు కూడా అందిస్తున్నారు. కొత్తగా ఇద్దరు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు.

**ఏ సేవలు.. ఎప్పుడు.. ఎక్కడ..**

ఉదర సంబంధిత వ్యాధులకు ఇద్దరు యూరాలజిస్టులు ఉన్నారు. బుధ, శుక్రవారాల్లో జీజీహెచ్ మొదటి అంతస్తులోని 45వ నంబరు గదిలో ఓపీ సేవలకు అందుబాటులో ఉంటారు. మిగిలిన రోజుల్లోనూ విధుల్లో ఉంటున్నా వారికి ప్రత్యేకంగా విభాగం కేటాయించకపోవడంతో కొంత ఇబ్బంది ఎదురవుతోంది. ఊబకాయం, పోషకాహార లోపం, బీపీ, మధుమేహం వంటి జీవనశైలి సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఓపీ గది నంబరు 222లో సంప్రదించవచ్చు. సోమ, బుధవారాల్లో ఈ సేవలందుతాయి.

క్యాన్సర్ మహమ్మారిని ముందస్తుగా గుర్తించడానికి ప్రివెంటివ్ ఆంకాలజీ పేరిట జీజీహెచ్‌లో ఓపీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఎన్‌సీడీ సర్వేలో వ్యాధి లక్షణాలున్న అనుమానితులను వైద్య సిబ్బంది ఇక్కడకు పంపితే ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తున్నారు. జీజీహెచ్ దిగువ అంతస్తులోని ఓపీ గది నంబరు 222లో మంగళ, గురువారాల్లో ఈ సేవలందుతాయి. సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలైన న్యూరో, న్యూరో సర్జరీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ వైద్య విభాగాలు గతేడాదే ప్రారంభించారు. మంగళ, గురు, శనివారాల్లో న్యూరాలజీ సేవలు మొదటి అంతస్తు 45 ఏ గదిలో అందుబాటులో ఉంటాయి. సోమ, బుధ, శుక్రవారాలు న్యూరో సర్జరీ సేవలు 45 బి గదిలో, మంగళ, గురు, శనివారాల్లో సర్జికల్ ఆంకాలజీ 45 డి, సోమ, బుధ,శుక్రవారాల్లో ఆంకాలజీ సేవలు 45సిఓపీ గదుల్లో అందిస్తున్నారు.

# హంద్రీనీవాలో కృష్ణమ్మ పరవళ్లు



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా ప్రజలు.. రైతులకు తీపి కబురు ఇది. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్)కి ఎన్నడూ లేనివిధంగా ముందస్తు జలాలను విడుదల చేయడం సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంప్‌హౌస్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా నీటిని విడుదల చేశారు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుకుంటూ అనంత జిల్లా సరిహద్దులోని 144 కి.మీ. వద్దకు ఈనెల 21 రాత్రి లేదా 22న ఉదయం చేరే అవకాశం ఉందని హంద్రీనీవా ఎస్ఈ అన్నవరం స్వరూప్‌కుమార్ తెలిపారు. గతేడాది ఆగస్టు 1న జలాలు విడుదల అయ్యాయి. ఈదఫా రెండు వారాలు ముందుగానే నీటిని పంపింగ్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధాన కాలువలో 3,850 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగేలా వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టారు. తొలిరోజు మూడు పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నారు. క్రమంగా ఈనెల 19వ తేదీ నాటికి గరిష్ఠంగా 12 పంపుల ద్వారా నిర్దేశిత ప్రవాహాన్ని కొనసాగించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది.

**24న జీడిపల్లికి చేరిక**

జిల్లా సరిహద్దు సమీపంలో ఉన్న రాగులపాడు పంప్‌హౌస్‌కు జలాలు చేరగానే నీటిని ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి 216 కి.మీ. వద్ద ఉన్న జీడిపల్లి జలాశయానికి ఈనెల 24న చేరే అవకాశం ఉంది. ఈ జలాశయం సామర్థ్యం 1.681 టీఎంసీలు కాగా.. ఇప్పటికే ఒక టీఎంసీకిపైగా నీరు నిల్వ ఉంది. ఇక్కడికి కృష్ణమ్మ చేరగానే ఒకట్రెండు రోజుల తర్వాత నేరుగా పీఏబీఆర్ జలాశయానికి సరఫరా చేయాలని నిర్ణయించారు. ప్రధాన కాలువ తొలి, మలి దశల్లో ఇప్పటికీ లైనింగ్ పనులు కొనసాగుతున్నాయి. అందుకే కనీసం రెండు వారాలపాటు పీఏబీఆర్‌కు పంపిస్తారు. ఈ జలాశయం కుడి కాలువ కింద ఉన్న అనంత, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని చెరువులను నింపాలని భావిస్తున్నారు. నీటిని విడుదల చేసిన నేపథ్యంలో హంద్రీనీవా ప్రధాన కాలువను గురువారం ఎస్ఈ స్వరూప్‌కుమార్ సారథ్యంలో అధికారులు పరిశీలించారు. కాలువ వెడల్పు పనులు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు.

# సంకల్ప బలం.. కళల సాకారం

తిరుపతి : విత్తనానికి జీవం కల్పించినట్లే కృషితో సంకల్పానికి రూపకల్పన చేయాలి. అప్పుడే కష్టాలెన్ని ఎదురైనా విజయతీరాలు చేరవచ్చంటున్నారు ఈ విద్యార్థినులు. ఊహతెలియని వయసులో తల్లిదండ్రుల్ని కోల్పోయినా ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు ప్రవల్లిక, రేవతి, దీపిక.. కటిక పేదరికంతో తల్లిదండ్రులు తమను చదివించలేక శరణాలయంలో చేర్పించినా.. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ పీజీ విద్యనభ్యసిస్తున్నారు జ్యోత్స్న, త్రివేణి. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ సంగీతం, నృత్యం, కళల విభాగంలో ఎంఏ భరతనాట్యం కోర్సు చదువుతున్న వీరి జీవితంలో ఎన్ని అడ్డంకులెదురైనా నృత్యకారిణులుగా రాణించాలనే సంకల్పంతో సాగుతున్నారు. హైదరాబాదులోని శ్రీసత్యసాయి సేవాసంఘ్ సహకారంతో ప్రాథమికవిద్యను ప్రారంభించి పీజీ స్థాయికి ఎదిగారు. 'న్యూస్‌టుడే'తో వారు తమ అనుభవాలు పంచుకున్నారు.

**పేదరికం అడ్డు కాకూడదని : జ్యోత్స్న**

మాది శ్రీకాకుళం. అమ్మ గృహిణి. నాన్న చిన్న ప్రైవేటు ఉద్యోగం చేస్తారు. పేద కుటుంబం కావడంతో మమ్మల్ని చదివించలేని పరిస్థితిలో తల్లిదండ్రులు శ్రీసత్యసాయి సేవాసంఘ్‌లో చేర్పించారు. ఆసక్తి కొద్దీ నృత్యం కోర్సులో చేరా. కళలు అంటే క్రమశిక్షణ. మనిషి తన జీవితాన్ని



ఎలా గడపాలో కళలు మనకు నేర్పిస్తాయి. హైదరాబాదు, తిరుపతిలో భరతనాట్య ప్రదర్శనలిచ్చా.

**తల్లిదండ్రుల ప్రేమ తెలియదు : రేవతి**

మాది మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూరు. నాలుగేళ్ల వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. ప్రాథమిక విద్యనుంచి పీజీ వరకు సత్యసాయి సంస్థ సహకారారంతోనే చదువుతున్నాం. కళలపై ఉన్న ఇష్టంతో ఎంఏ భరతనాట్యం కోర్సులో చేరా. అనేక ప్రదర్శనలిచ్చా. కొంచెం ఆసక్తి ఉంటే కళల్లో రాణించవచ్చు.

**అబ్దుల్ కలాం స్ఫూర్తితో: ప్రవల్లిక**

నాకు రెండేళ్లు ఉండగా ప్రమాదవశాత్తు తల్లిదండ్రులు చనిపోయారు. మేనత్త సహకారంతో సత్యసాయి సేవాసంఘ్‌లో చేరా. సిద్ధిపేటలో ఇంటర్, గుల్బర్గాలో డిగ్రీ భరతనాట్యం కోర్సు చేశా. మహిళా వర్సిటీలో ఎంఏ భరతనాట్యం కోర్సు చదువుతున్నా. సంకల్పబలంతో ప్రపంచ ఖ్యాతి సాధించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నాకు స్ఫూర్తి.

**ఆశయాన్ని బలపరచుకోవాలి: త్రివేణి**

మాది శ్రీకాకుళం జిల్లా. అమ్మ గృహిణి, నాన్న ప్రైవేటు ఉద్యోగి. మేం ముగ్గురు సంతానం. పేదరికం కారణంగా నాన్న నన్ను సత్యసాయి సంస్థలో చేర్పించారు. కష్టాలు వస్తుంటాయి పోతుంటాయి. వాటిని తలచుకుని బాధపడితే ఏదీ సాధించలేం. భవిష్యత్తులో గొప్ప నృత్యకళాకారిణి కావాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నా. చదువుతోపాటు యోగా, కరాటేలో శిక్షణ తీసుకుంటున్నా.

**మొలకెత్తని విత్తనంగా ఉండకూడదు : దీపిక**

మనలో మనం గమనించని ఎన్నో అద్భుత శక్తులున్నాయి. వాటిని వెలికితీసే ప్రయత్నం చేయనంతకాలం మొలకెత్తని విత్తనంగా ఉండిపోతాం. అలా ఉండటం నాకు ఇష్టం లేదు. తొమ్మిదేళ్ల వయసులో అమ్మ, 13 ఏళ్ల వయసులో నాన్న చనిపోయారు. ఉన్నత స్థానానికి వెళ్లాలంటే గట్టి ప్రయత్నం చేయాలని చదువుపై దృష్టిపెట్టా. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చా. భవిష్యత్తులో దేశం గర్వించే నృత్యకళాకారిణి కావాలనేదే నా లక్ష్యం.

## పేరు సం'క్షేమం'.. తీరు సం'క్షామం'

ఏలూరు : భీమడోలు మండలం గుండుగొలనులోని ఎస్సీ బాలికల వసతి గృహం ఆరేళ్ల కిందట శిథిలమై కూలిపోయింది. అప్పట్నుంచి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు గదుల్లో 65 మంది బాలికలు వసతి పొందుతున్నారు. పాత భవనం ఆవరణలోని అధ్వాన మరుగుదొడ్లే వినియోగిస్తున్నారు.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యల ఊబిలో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతున్నాయి. చాలా చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. మరుగుదొడ్లకు తలుపుల్లేవు. కిటికీలకు దోమ తెరల్లేవు. వర్షాకాలంలో దోమలు విజృంభిస్తే.. విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదముంది. కొన్నిచోట్ల అరకొరగా దుప్పట్లు ఇవ్వగా.. మరికొన్నిచోట్ల అసలు ఇవ్వలేదు. అద్దె భవనాల్లో సరైన వసతుల్లేక పిల్లలు అల్లాడిపోతున్నారు.

**కూటమి పాలనలో ఉపశమనం..**

వైకాపా సర్కారు నిర్లక్ష్యం కారణంగా సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, 13 బీసీ బాలుర వసతి గృహాలకు ఒక్కోదానికి రూ.1.50 లక్షలు చొప్పున కేటాయించింది. 52 ఎస్సీ వసతి గృహాలకు 5.75 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో అధికారులు సదుపాయాలు



మెరుగుపరుస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విశ్వమోహన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగరాణి తెలిపారు. ఉంగుటూరు మండలం కైకరంలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఎక్కడికక్కడ శ్లాబు పెచ్చులూడుతోంది. కిటికీలకు తలుపులు, దోమ తెరల్లేవు. జంగారెడ్డిగూడెం బీసీ బాలుర వసతి గృహంలో పరుపులు, దోమ తెరలు చిరిగిపోయాయి. చేతి పంపు పని చేయడం లేదు. ముసునూరు బీసీ బాలుర వసతి గృహం భవనం శ్లాబు పెచ్చులూడుతోంది. చిన్నపాటి వర్షానికే చెమ్మగిల్లుతోంది.

చురకలు



## చిత్రావతిలో ఇసుక దొంగలు

పుట్టపర్తి : సత్యసాయి నడయాడిన చిత్రావతి నదిలో దొంగలు పడ్డారు. నిత్యం యంత్రాలతో ఇసుకను తవ్వేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా పట్టణాలకు తరలించి ఒక ట్రిప్పు రూ.1,500 నుంచి రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. ఇలా.. రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. కొంత కాలంగా ఈ దందా సాగుతోంది. అధికారులకు తెలిసినా కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. పవిత్రమైన చిత్రావతినది పరిసరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తుండగా, కొందరు స్వార్థం కోసం ఇసుకను తవ్వుతున్నారు.

**ఉచితం మాటున దోపిడీ:** ఉచిత ఇసుక విధానంలో ప్రజాప్రతినిధులు, నాయకులు జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే సూచిస్తున్నా.. ఆచరణలో మాత్రం పాటించడం లేదు. ధనార్జనే



ధ్యేయంగా ఉచితం మాటున కొందరు పొక్లెయిన్లతో పుట్టపర్తి చిత్రావతి నది, కొత్తచెరువు వంగపేరు నుంచి ఇసుకను తరలించేస్తు న్నారు. నదులను తవ్వేయడం వల్ల వరద వచ్చినప్పుడు భూములు కోతకు గురవుతాయని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతున్నారు. దీనిపై జేఈ సుధాకర్‌రాజు వివరణ కోరగా చిత్రావతినదిలో ఇసుక తరలించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## నాణ్యత దిగువకే

ఆలూరు : సాగు, తాగునీటికి ఆధారమైన తుంగభద్ర దిగువ కాలువ ఆధునికీకరణ పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నా బోర్డు అధికారులు తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. ఫలితంగా గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆంధ్ర, కర్ణాటక ప్రజల జీవనాడైన తుంగభద్ర దిగువ కాలువ వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. చివరి ఆయకట్టుకు సైతం నీరు అందించాలన్న ఉద్దేశంతో తుంగభద్ర బోర్డు పరిధిలోని 0 నుంచి 250 కి.మీ. వరకు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

**రూ.448 కోట్లు వెచ్చించి..**

దిగువ కాలువలో రూ.448 కోట్లతో లైనింగ్ పనులు చేపట్టారు. దీనిని తొమ్మిది ప్యాకేజీలుగా విభజించి ప్రారంభించారు. జిల్లా పరిధిలోని 135 కి.మీ. నుంచి 205 వరకు పనులు దక్కించుకున్న గుత్తేదారులు 2022 జూన్‌లో హడావుడిగా చేపట్టారు. ఆ తర్వాత 2022-2023, 2023-24లో కొంతమేర పనులు చేపట్టారు. ప్రస్తుతం 136 కి.మీ. నుంచి 138 కి.మీ. వరకు, 155-156, 220 కి.మీ నుంచి 222 కి.మీ. వరకు పనులు జరుగుతున్నాయి.



**ఎక్కడెక్కడ ఎలా చేస్తున్నారంటే...**

155 కి.మీ. నుంచి 156 కి.మీ. వద్ద కాలువ చిన్నదిగా.. లోతుగా ఉండేది. ప్రస్తుతం అక్కడ వెడల్పు చేయడంతోపాటు లోతు తగ్గించి లైనింగ్ చేపట్టాలి. గట్టుకు, లైనింగ్‌కు మధ్యలో గుత్తేదారుడు రాళ్లేసి దానిపై మట్టిని పోశారు. వర్షం పడితే లైనింగ్‌పై ఒత్తిడి పెరిగి కొట్టుకుపోయే ప్రమాదముంది. బెడ్డింగ్ కింద మట్టి బస్తాలు వేసి లైనింగ్ చేపట్టడం గమనార్హం. 136 కి.మీ. నుంచి 138 కి.మీ. వరకు జరిగే పనుల్లో కాలువ లైనింగ్ కోసం ముందుగా ఎర్రమట్టి వేయాలి. అలాకాక పొలంలో లభించే మట్టి పోశారు. ఈ మట్టిలో గట్టితనం ఉండదు. త్వరగా చెదిరిపోయే ప్రమాదం ఉంటుంది. 202 కి.మీ. నుంచి 222 కి.మీ. పరిధిలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. చాలాచోట్ల సిమెంటు తేలిపోయి కంకర కనిపిస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే జులై చివర్లో లేదా ఆగస్టు మొదట్లో కాల్వకు నీటిని వదిలినప్పుడు ఏమాత్రం నిలుస్తుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సరిగమపద.. కళాశాల పిలుస్తోంది..!

విజయనగరం : మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల.. కళలకు కాణాచీగా నిలిచిన విజయనగరానికి మరింత గుర్తింపు తీసుకొచ్చింది. పూసపాటి రాజ వంశీయుల సహకారంతో ఎందరో ఔత్సాహికులను సంగీత సరస్వతులుగా తీర్చిదిద్దింది. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఈ విద్యాలయంలో సంగీత విద్య అభ్యసించి తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారెందరో ఉన్నారు. ప్రముఖ సంగీత దర్శకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరు రాజేశ్వరరావులు ఓనమాలు దిద్దింది ఇక్కడే. ఆదిభట్ల నారాయణదాసు, నేదునూరి కృష్ణమూర్తి, నూకల చినసత్యం ప్రధానాచార్యులుగా సేవలందించారు. ప్రస్తుతం 505 మందితో నడుస్తోంది. కళాశాలలో ఉన్న కోర్సులు, సౌకర్యాలు ఓ సారి పరిశీలిస్తే...

**చేరేందుకు అర్హతలు..**

ఈ కళాశాలలో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ అర్హతలు నిర్ణయించింది. అభ్యర్థులు 10 ఏళ్ల వయస్సు నిండి ఉండాలి. వయోపరిమితి 60 ఏళ్లు. డిప్లొమా కోర్సులో ప్రవేశానికి సంబంధిత డిసిప్లిన్‌లో సర్టిఫికేట్ కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు.

**ఇవీ కోర్సులు...**సంగీత కళాశాలలో పలు కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, భరతనాట్యం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 50 నుంచి 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 12 తరగతి గదులు ఉన్నాయి. అన్నింట్లో సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. ప్రిన్సిపల్, 8 మంది అధ్యాపకులు, 8 మంది ఇతర సిబ్బంది పని చేస్తున్నారు.

**ఫీజులు ఇలా..**కళాశాలలో సర్టిఫికేట్, డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉంది.

ముందుగా సర్టిఫికేట్ కోర్సులో ప్రవేశానికి విద్యార్థులు ఏడాదికి రూ.1600 చెల్లించాలి. దీనికి నాలుగేళ్ల కాలపరిమితి.

డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏడాదికి రూ.2100 చెల్లించాల్సి ఉంటుంది. ఇది రెండేళ్ల కోర్సు. జులై 1వ తేదీ నుంచి 31వ తేదీ మధ్య చేరే విద్యార్థులకు పైన తెలిపిన ఫీజు నిర్ణయించారు. తర్వాత అపరాధ రుసుము చెల్లించి చేరవచ్చు.

తరగతుల వేళలు..ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. గృహిణులు, ఉద్యోగులకు అనుకూల సమయంగా విద్యార్థులకు సాధారణ విద్యకు ఆటంకం లేకుండా ఈ సమయాలను ప్రభుత్వం నిర్ణయించింది.

సదుపాయాలు ఇవీ..విద్యార్థులకు సరిపడా సదుపాయాలు సమకూర్చారు. ఆరేళ్ల కిందట సుమారు రూ.కోటితో కళాశాలలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించారు. ప్రాంగణంలోని తరగతి గదులు బాగుచేయించి, పంకాలు, ఇతర స్టేషనరీ సమకూర్చారు.

# అరుణమ్మా.. ఇదేమిటమ్మా..?




చిత్తూరు : చిత్తూరు నగరపాలక సంస్థలో ప్రజాధనం హారతి కర్పూరంగా మారింది. చట్టవిరుద్ధంగా ఇష్టానుసారం ఖర్చుచేసి ఆడిందే ఆట.. పాడిందే పాటగా పాలన సాగించారు.. పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాలకు సంబంధించి ఆడిట్ అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడం మరిచారు.. గత వైకాపా ప్రభుత్వానికి వీరవిధేయరాలుగా గుర్తింపు పొంది నాటి నాయకుల కనుసన్నల్లో కొనసాగిన కమిషనర్ అరుణ పలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. నిధుల మళ్లింపు, పన్ను వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం, అసంబద్ధంగా రికార్డుల నిర్వహణ ఇలా పలు ఆసక్తికరమైన అంశాలు ఆడిట్‌లో వెలుగుచూస్తున్నాయి.. 2023-24లోనే ఎన్నడూ లేనంతగా 93 అభ్యంతరాలకు సంబంధించి రూ.157.53 కోట్లకు లెక్కల్లేవంటూ ఆడిట్ శాఖ ఆర్‌డీడీ గోవిందప్ప ఇటీవల ధ్రువీకరించారు.

**ఆస్తిపన్ను వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం..**

నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను ప్రధాన ఆర్థిక వనరు. పేద, మధ్య తరగతి కుటుంబాలను తీవ్ర ఒత్తిడికి గురిచేసి వాటిని వసూలు చేస్తారు. అదే రాజకీయ పలుకుబడి, పెద్ద నాయకుల నుంచి ఆస్తిపన్ను వసూళ్ల జోలికి వెళ్లరు. అధికారుల నిర్లక్ష్యంతో వాణిజ్య పన్నుల అద్దె బకాయిలు రూ.1.23 కోట్లు, ఆస్తి పన్ను బకాయిలు రూ.41.34 కోట్ల వసూళు విస్మరించారు. గడువు ముగిసినప్పటికీ ఇద్దరు ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా నగరపాలక ఖాతా నుంచి రూ.4.80 లక్షలు చెల్లించారు. జగనన్న మాల్‌కు సబ్బులు, సరకులు కొనుగోలు చేసినట్లు రూ.13.83 లక్షలు చెల్లించారు. దీనికి ఎలాంటి ఓచర్లు, బిల్లులు లేవు. మెప్మాలో లెక్కలు లేవు. జగనన్న సురక్ష కింద రూ.27.01 లక్షలు ఖర్చుచేసినా రికార్డులు లేవు. రూ.13.50 కోట్ల పనులకు ఎం.బుక్‌ల్లేవు. పలు అభివృద్ధి పనులకు రూ.11.70 కోట్లు చెల్లించారు. వాటికి సంబంధించి ఎం.బుక్‌లు, ఓచర్‌లు, బిల్లులు, రికార్డులే లేవు.

**అమృత్ పథకం ఖాతాకు లెక్కల్లేవు..**

అమృత్ పథకం కింద రూ.44.98 లక్షలు చెల్లించారు. వీటికి ఓచర్లు, ఎం.బుక్‌ల ఊసేలేదు. వాణిజ్య దుకాణాలు నిర్మించినట్లు రూ.49.43 లక్షలు చెల్లించారు. రికార్డులు లేవు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు నగరపాలక నిధులు రూ.24.19 లక్షలు ఖర్చు చేశారు. మళ్లీ ఆయా నిధులు నగరపాలక పద్దుకు జమ చేయలేదు. ఓచర్లు, బిల్లులు సమర్పించలేదు. అద్దెల రూపం లో వసూలైన రూ.1.56 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు బిల్లులు చెల్లించారు. వాటి ఓచర్లు, రికార్డులు పత్తాలేవు. ఈపీఎఫ్ నుంచి వివిధ అభివృద్ధి పనులకు రూ.97.58 లక్షలు చెల్లించారే తప్ప బిల్లులు లేవు.

**అస్తవ్యస్తంగా రికార్డుల నిర్వహణ..**

నగరపాలక సంస్థలో ఏ విభాగాన్ని చూసినా రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఆడిట్ అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని విభాగాల్లో నిధులు జమ, ఖర్చులకు సంబంధించి ఎం.బుక్‌లు, ఓచర్లు, రికార్డులు లేవు. గ్రాంట్లు, రుణాల రిజిస్టర్లు సమర్పించలేదు.

**పత్తాలేని 15వ ఆర్థిక సంఘం నిధులు**

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.25 కోట్లు చట్ట విరుద్ధంగా ఖర్చుచేశారు. వీటికి రికార్డులు, ఓచర్లు, బిల్లులు, టెండర్లు లేవు. క్లాప్ అకౌంట్ నిధులు రూ.78.58 లక్షలు ఖర్చుచేశారు. బిల్లులు, ఓచర్లు లేవు. చట్టవిరుద్ధంగా ట్రెజరీ నుంచి రూ.81.83 లక్షలు డ్రా చేశారేగానీ క్యాష్ బుక్‌లో నమోదు చేయలేదు.

**రూ.1.15 కోట్ల రికవరీకి చర్యలు** అక్రమంగా రూ.1.15 కోట్లు డ్రాచేసి ఖర్చు చేశారు. ఈ ఉదంతానికి బాధ్యులైన ఉద్యోగుల నుంచి నగదు రికవరీ చేసి జనరల్ ఫండ్‌కు జమ చేయాలని ఆడిట్ అధికారులు ఆదేశించారు. -వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి జీఎస్టీ, ఆదాయపన్ను రూపంలో వసూలైన రూ.23.31 లక్షలు నగరపాలిక ఖాతాకు జమచేయలేదు.-పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి డీఅండ్ ఓ ట్రేడర్స్ వివరాలు లేవు. రికార్డులు ఇవ్వలేదు. ఇతర పనుల ఓచర్లు లేవు. వీటి విలువ రూ.1.18 కోట్లు.

**నాటి కమిషనర్‌కు నోటీసులిచ్చాం..**నగరపాలక సంస్థ 2023-24 ఆడిట్ అభ్యంతరాలు నాలుగు నెలల్లో పరిష్కరించుకోవాలని అప్పటి కమిషనర్, అధికారులకు నోటీసులిచ్చాం. పరిష్కరించుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవు. గోవిందప్ప, ఆర్‌డీడీ, ఆడిట్ శాఖ

# ఉద్యాన తోటల సాగుపై ఆసక్తి




అనకాపల్లి : జిల్లాలో రైతులు ఉద్యాన తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వమూ రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. వరి, చెరకు, మినుము, పెసర తదితర పంటలు సాగు చేసినా కలిసి రావడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో కొబ్బరి, మామిడి, జీడిమామిడి తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటల సాగుకు ఇదే సరైన సమయం. జిల్లాలో 57,250 హెక్టార్లలో ఈ పంటలను సాగు చేస్తున్నారు. అనకాపల్లిలో ఉద్యాన పరిశోధన క్షేత్రం ఉంది. ఇక్కడ మామిడి 15 వేలు, కొబ్బరి 45 వేలు, జీడి మామిడి 8 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎం.ఎ.రహీమ్ పేర్కొన్నారు.జిల్లాలో 9,500 హెక్టార్లలో కొబ్బరి సాగవుతోంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. సముద్రతీర ప్రాంతాల్లో ఎక్కువ మంది కొబ్బరి తోటలు వేస్తున్నారు. ప్రైవేటు నర్సరీల్లో ఒక్కో మొక్క రూ. 200 నుంచి రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. హైబ్రీడ్ రకమని మూడేళ్లలోనే కాయలు వస్తాయని చెబుతున్నా.. నాటిన తర్వాత ఐదేళ్లు అవుతున్నా.. పంట చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యాపారులు చెప్పే రకం ఒకటి, ఇచ్చే మొక్కలు మరో రకంగా ఉన్నాయని రైతులు రాంబాబు, మహేశ్ చెబుతున్నారు. ఉద్యాన శాఖ నర్సరీల్లో బుట్టతో ఒక్కో మొక్క రూ.90 కి లభిస్తోంది. ఈస్ట్‌కోస్ట్ స్టాల్ రకం మొక్కలు అందుబాటులో ఉన్నాయని రహీమ్ చెప్పారు.మెట్ట ప్రాంతాల్లో జీడి మామిడి 27,900 హెక్టార్లలో సాగవుతోంది. అన్ని పంటల కంటే దీని విస్తీర్ణమే ఎక్కువ. ప్రైవేటు వ్యాపారులు మొక్కను రూ.100 చొప్పున విక్రయిస్తుండగా, ఉద్యాన శాఖ రూ.40కి ఇస్తోంది. ప్రస్తుతం వి-3, 4 రకాల మొక్కలు ఉన్నాయి. మామిడి తోటలు జిల్లాలో 10,900 హెక్టార్లలో సాగవుతున్నాయి. ప్రైవేటు నర్సరీల్లో మొక్క వయసును బట్టి రూ.200 నుంచి రూ.800 చొప్పున విక్రయిస్తున్నారు. ఉద్యాన శాఖ నిర్వహిస్తున్న నర్సరీల్లో రూ.45కే అందిస్తున్నారు. బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలు, పెద్ద రసాలు, సువర్ణరేఖ, పందూరి వంటి రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

# నిర్లక్ష్యం.. గూడు'గట్టు'కొని

కోవెలకుంట్ల: గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎస్సార్బీసీ ఆయకట్టు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉప కాలువల నిర్వహణ కోసం ఒక్క పైసా కూడా కేటాయించలేదు. ఫలితంగా లైనింగ్ దెబ్బతింది. జిల్లా పరిధిలో ఎస్సార్బీసీ 1.53 లక్షల ఆయకట్టు ఉంది. దీని పరిధిలో గోరుకల్లు, అవుకు జలాశయాలు ఉన్నాయి. ఈ మధ్యలో 11 డిస్ట్రిబ్యూటరీలు పనిచేస్తున్నాయి. అవుకు వద్ద 116 కి.మీ. నుంచి 142 కి.మీ. వరకు 12 నుంచి 16 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వీటి కింద అవుకు, సంజామల, ఉయ్యాలవాడ, వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు వద్ద పెద్దముడియం వరకు 39 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. బనగానపల్లి ఎస్సార్బీసీ డివిజన్ పరిధిలో 8, 9, 10, 11, 11ఎ బ్లాకులు ఉండగా 47 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోంది.

**తెదేపా హయాంలోనే పనులు..**

ఎస్సార్బీసీ ఉప కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. 2017-18లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో మాత్రమే మరమ్మతు పనులు జరిగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ఉప కాలువలు రూపుకోల్పోయాయి. లైనింగ్ దెబ్బతింది. కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి నీరు ముందుకు ప్రవహించని పరిస్థితి ఏర్పడింది. గట్లు బలహీనంగా మారాయి. తరచూ గండ్లు పడుతూ పొలాలను ముంచెత్తుతున్నాయి. గతేడాది అక్టోబరులో అవుకు మండల పరిధిలో 111 కి.మీ. వద్ద ప్రధాన కట్ట కుంగి ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదే నెలలో 23వ తేదీన కోవెలకుంట్ల, గుంజలపాడు గ్రామాల



మధ్య 10వ బ్లాక్ వద్ద గండి పడింది.

**ఐదెకరాల్లో పంట కోల్పోయా: నాగేశ్వరరెడ్డి, రైతు**

ఎస్సార్బీసీ పదో బ్లాక్ పరిధిలోని 14ఎల్ కాలువ కింద గతేడాది ఐదెకరాల్లో శనగ సాగు చేశా. ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టా. కోత పనులు చేపట్టాలనుకున్న సమయంలో కాలువకు నీరు ఎక్కువగా వదలడంతో పొంగి పంటంతా దెబ్బతింది.

**రూ.1.16 కోట్లు మంజూరు: సురేంద్ర, ఎస్సార్బీసీ ఏఈ**

ఎస్సార్బీసీ మరమ్మతులు, లైనింగ్ పనులు, కాలువ కట్ట బలోపేతానికిగాను బనగానపల్లి డివిజన్‌లో రూ.1.16 కోట్లతో 13 పనులు మంజూరయ్యాయి. తొమ్మిదో బ్లాక్‌కు 2 పనులు, 5, 8, 10, 11, 11ఏ బ్లాక్‌లకు ఒకటి చొప్పున, ప్రధాన కాలువకు 3 పనులు మంజూరయ్యాయి.

# సర్వజన కష్టాలే

నంద్యాల : నంద్యాల జిల్లా ఆసుపత్రిని సర్వజన ఆస్పత్రిగా మార్చి మూడేళ్లవుతున్నా ఆ స్థాయిలో వైద్యులను నియమించలేదు. గతంలో 200 ఉన్న పడకల సంఖ్య 650కు పెరిగింది. సేవలు మాత్రం అధ్వానంగా ఉంది. సూపర్ స్పెషాలిటీ వైద్యం అందిస్తామని అధికారులు పదేపదే చెబుతున్నా సాధారణ సేవలు కూడా అందడం లేదు. వైద్యుల కొరతతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఉన్న వైద్యులు సెలవు పెడితే ఆరోజు ఓపీ సేవలు పూర్తిగా ఆపేయాల్సిన దుస్థితి నెలకొంది.

**అన్ని విభాగాల్లోనూ అంతే..**

ఆసుపత్రిలో చిన్నపిల్లల విభాగం, డెర్మటాలజీ, అనస్థీషియా, పల్మనాలజీ, డెంటల్, రేడియాలజీ, ఆర్థో విభాగాల్లో ఒక ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసరు చొప్పున తక్కువగా ఉన్నారు. వీరితో పాటు ప్రతి విభాగంలో ఇద్దరు, ముగ్గురు సీనియర్ రెసిడెన్సీ వైద్యుల కొరత ఉంది. ఉన్నవారితోనే మూడేళ్ల నుంచి నెట్టుకొస్తున్నారు.

డెంటల్ విభాగంలో ఒక ప్రొఫెసరు, ఒక అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. వారు సెలవు తీసుకుంటే ఓపీలో వైద్యుల్లేక రోగులు వెనుదిరగాల్సి వస్తోంది. పల్మనాలజిస్టు, రేడియాలజిస్టుల కొరత ఉంది. ఆర్థో విభాగంలో ఉన్న వైద్యులు సదరం శిబిరాల నిర్వహణకే సరిపోతున్నారు.




ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌తో పాటు మూడు ఎస్ఆర్ పోస్టులు తక్కువగా ఉన్నాయి.

**గైనకాలజీ వార్డులో..**

ఆసుపత్రిలోని గైనకాలజీ విభాగానికి రోజుకు 50 నుంచి 80 మంది వరకు వస్తుంటారు. ఇక్కడ ఇద్దరు ప్రొఫెసర్లు, సహాయ వైద్యులు ఉన్నప్పటికీ సీనియర్ రెసిడెన్సీ (ఎస్ఆర్)లు ముగ్గురు తక్కువగా ఉన్నారు. సీనియర్ వైద్యులు అందుబాటులో లేకపోతే గర్భిణులను అత్యవసర వైద్యం నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేయాల్సి వస్తోంది.

**సాయం చేసేవారు కరవు**ఆసుపత్రిలోని ప్రతి విభాగంలో సహాయ సిబ్బంది కొరత ఉంది. ఒప్పంద, పొరుగు సేవల కింద పనిచేసే సిబ్బంది పోస్టులు తక్కువగా ఉన్నాయి. దీంతో నడవలేని రోగులను స్ట్రెచర్లు, చక్రాల కుర్చీలపై తీసుకెళ్లేవారు కరవయ్యారు. రోగుల సహాయకులు, కుటుంబ సభ్యులే అవస్థలు పడుతూ వారిని ఓపీకి, వైద్యుల వద్దకు తీసుకెళ్లాల్సి వస్తోంది.**బదిలీల్లో ఖాళీలు చూపాం: డా.మల్లీశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంటు**ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఆసుపత్రిలోని ప్రొఫెసర్ల ఖాళీలను చూపించాం. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ద్వారా డీఎంఈకి నివేదిక అందించాం. ప్రస్తుత బదిలీల్లో కొంతమంది వైద్యులు వచ్చే అవకాశం ఉంది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.


## వసతి లేక.. వలస బాట

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో పశ్చిమాన కరవు పరిస్థితులు ప్రజా జీవనాన్ని చిదిమివేస్తున్నాయి. ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకపోవడంతో చాలామంది వలస వెళుతున్నారు. పిల్లలు సైతం తల్లిదండ్రులతో కలిసి ఉపాధి బాట పడుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పిల్లల విద్యాభివృద్ధిలో కీలకమైన ప్రభుత్వ వసతిగృహాలు ఈ ప్రాంతంలో పెరగాల్సిందిపోయి క్రమంగా మూతపడుతున్నాయి. కొన్ని మండలాల్లో వసతిగృహాలే కానరావడం లేదు.

కర్నూలు జిల్లాలో బీసీ ప్రీమెట్రిక్ వసతి గృహాలు 31 ఉండగా ఇందులో 22 బాలురు, 9 బాలికలకు చెందినవి ఉన్నాయి. వీటిలో 6,967 మంది చదువుతున్నారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాలు 29 ఉండగా 18 బాలురకు, 11 బాలికలకు ఉన్నాయి. వీటిల్లో 5,348 మంది విద్యనభ్యసిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో మూడు ఆశ్రమ పాఠశాలలు, మరో మూడు రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 66 వివిధ **రకాల వసతిగృహాలు ఉండగా..** గత పదేళ్లలో కొన్ని మూతపడ్డాయి. ఫలితంగా వేలాది మంది పేద విద్యార్థులు నష్టపోయారు.

ఆదోని ప్రాంతంలో సుమారు 15 మండలాల్లోని కొన్ని జడ్పీ పాఠశాలల్లో గత పదేళ్ల కాలంలో 'పది' ఫలితాలను పరిశీలిస్తే 60 శాతం మించడం లేదు. బడి మధ్యలో మానేస్తున్నవారి సంఖ్య ఈ మండలాల్లో ఎక్కువగా ఉంటోంది. హాస్టళ్లు అసలు లేని కౌతాళం, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో గత మూడేళ్లలో పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నట్లు విద్యాశాఖ గణాంకాలే చెబుతున్నాయి.

**కానరాని సీజనల్ వసతి గృహాలు**



పశ్చిమ ప్రాంతంలో ప్రత్యేకించి ఆదోని డివిజన్‌లో 245 పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కరవు ఉంటుంది. రైతులు కాడి వదిలేసి వలస వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం 71 వరకు సీజన్ వసతి గృహాలు ఏర్పాటు చేసేది. విద్యార్థులు సుగ్గి బాట పట్టకుండా వీటిల్లో ఉండేవారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ వసతిగృహాలను పట్టించుకోలేదు.

**20 ఎస్సీ హాస్టళ్ల మూసివేత**

జిల్లాలో 2016లో సుమారు 20 ఎస్సీ వసతిగృహాలను మూసేశారు. ఇందులో ఎక్కువభాగం పత్తికొండ, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల్లోనే ఉన్నాయి. అప్పటి ఉమ్మడి జిల్లాలో 50 ఎస్సీ వసతిగృహాలను మూసివేయగా ఇందులో కర్నూలు జిల్లాలో 20 వరకు ఉన్నాయి. ప్రత్యేకించి వీటికి సొంత భవనాలు లేకపోవడంతో మూతపడ్డాయి.

**ప్రయత్నించినా సీటు దొరకలేదు: రాజేశ్వరి, ఏడో తరగతి, పొదలకుంట**

న్యూస్‌టుడే, కౌతాళం: మా అమ్మానాన్న ఏటా వలస వెళ్తుంటారు. నన్ను హాస్టల్‌లో చేర్చాలని ప్రయత్నించినా సీటు రాలేదు. పక్కనున్న మదిరె గ్రామంలోని పాఠశాలలో చేరా. అమ్మానాన్న వలస వెళ్తే వారి వెంట వెళ్లాల్సిందే.

# రెండు కి.మీ. దూరం.. నిత్యం ప్రాణసంకటం..

పెందుర్తి : అనకాపల్లి–ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. దీన్ని 2014–19 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించింది. అప్పట్లో పలుచోట్ల భూ వివాదాలు తలెత్తాయి. వాటన్నింటినీ పరిష్కరించినా.. పెందుర్తి మండలం సరిపల్లి సమీపంలో నెలకొన్న వివాదం నేటికీ అపరిష్కృతంగానే ఉండిపోయింది. దీంతో రాంపురం సమీపం నుంచి పాత పెందుర్తి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు పూర్తికాలేదు. ముఖ్యంగా రింగు రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో నగరంలోకి వచ్చే వాహన చోదకులు కిలోమీటర్ల దూరం ముందుకెళ్లి.. తిరిగి వెనక్కి రావాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఎందరో ప్రమాదాలకు గురవుతున్నారు.
ఈ సమస్య పరిష్కారానికి గత వైకాపా ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పరిహారం విషయమై రైతులు కోర్టును ఆశ్రయించడంతో ఎక్కడి పనులు అక్కడే స్తంభించిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఈ సమస్యను పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సంఘటన–1**



రెండేళ్ల క్రితం రాంపురం సమీపంలో ఓ కారు ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఇదే ప్రదేశంలో గతంలోనూ రెండు వేర్వేరు ప్రమాదాల్లో రోడ్డు దాటుతున్న ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల అక్కడే ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది.

**సంఘటన–2**

ఈ నెల 1న పెందుర్తి పెద్ద చెరువు సమీపంలో ద్విచక్ర వాహన ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. గతంలో ఒక అంబులెన్సు బోల్తా పడి రోగి సహా నలుగురు గాయాల పాలయ్యారు. ఇటీవల ఓ లారీ కాలిబాటపైకి దూసుకెళ్లడంతో రెయిలింగ్ ధ్వంసమైంది.

**ఆ రోడ్డు మలుపు.. ప్రమాదాలకు పిలుపు..**

పెందుర్తి పెద్ద చెరువు సమీపంలో నిలిచిపోయిన పనుల వద్ద రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ పల్లంగా ఉన్న మలుపు వద్ద వాహనాలు వేగంగా వెళుతూ అదుపు తప్పుతున్నాయి. అదే విధంగా అసంపూర్తి రహదారిలో పలువురు యువకులు ద్విచక్ర వాహనాలతో ఫీట్లు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి ఈ పనులు పూర్తయ్యేందుకు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# ఫార్మాసిటీలో రసాయన జలాల కలకలం

పరవాడ : జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఫార్మా వ్యర్థ జలాలు కలకలం రేపుతున్నాయి. రాంకీ కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (సీఈటీపీ) ప్రహరీ ఆనుకుని ఉన్న వరద నీటి కాలువల్లో ఆదివారం నలుపు రంగులో ఉన్న ఫార్మా వ్యర్థ జలాలు ప్రవహించడం స్థానికుల్లో ఆందోళన కలిగించింది. వీటిని శుద్ధి చేయకుండా బయటికి వదిలేస్తుండడంతో ఈ ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతోందని వాపోతున్నారు. గత నెలలో వర్షాల సమయంలో రెండు పర్యాయాలు రాంకీ ఫార్మా రసాయన జలాలను బయటికి విడిచిపెట్టడంతో అవి భరణికం మోల్లోడు గెడ్డవాగులోకి చేరి దుర్గంధం వ్యాపించింది. అప్పట్లో స్థానికులు, రైతులు ఆందోళనలు చేయడంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గతనెల 18, 19 తేదీల్లో మోల్లోడు గెడ్డ వాగులో నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్‌లో జరిపిన పరీక్షల్లో



గెడ్డవాగులో ఫార్మా రసాయనాలు కలిశాయని, సీటీవో అండ్ హెచ్‌డబ్ల్యూపీ నిబంధనలు పాటించలేదని నిర్ధారించారు. దీనిపై కొద్దిరోజుల క్రితం రాంకీ సంస్థకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర పీసీబీ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపారు. ఇప్పుడు మళ్లీ రాంకీ సంస్థ రసాయనాలను బయటకు విడిచిపెట్టడంపై రాష్ట్ర పీసీబీ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.
ఫార్మాసిటీలో సీఈటీపీ ప్రహరీని ఆనుకుని వరద నీటి కాలువల్లోకి చేరుకున్న రసాయన జలాలు వర్షాలు పడితే మోల్లోడు గెడ్డ వాగులోకి ప్రవహిస్తాయని, దీంతో చెరువులు, గెడ్డవాగులు కాలుష్య కాసారంగా మారుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పీసీబీ ఈఈ ముకుందరావును సంప్రదించగా కాలువల్లోని ఫార్మా వ్యర్థ జలాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# నాడు వదిలేస్తే.. నేడు నిధులిస్తే..!

కుప్పం : క్రీడలంటే మక్కువ ఉన్నా సరైన క్రీడా స్థలం లేదు.. నియోజకవర్గం మొత్తానికి ఉన్నది ఒకేఒక మైదానం.. దానినీ ఐదేళ్ల వైకాపా పాలనలో పట్టించుకునే వారు కరవయ్యారు. దీంతో క్రీడలకు దూరమై.. తమలో ప్రతిభను వెలికితీసే పరిస్థితి క్రీడాకారులకు లేకపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం పురపాలిక పరిధిలోని వడ్డిపల్లె వద్ద గత తెదేపా హయాంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం పేరుతో.. ఓపెన్ స్టేడియం, ఇండోర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేశారు. వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టడంతో క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి.
**మైదానం అభివృద్ధికి రూ.22 కోట్లు..**కుప్పం ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.22 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు నాలుగు మండలాల పరిధిలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.

# ఎండకు ఎండుతూ.. నేలకు వాలుతూ



నర్సీపట్నం : ఏటా లక్షల్లో మొక్కలు నాటుతున్నా కొన్నిచోట్ల సంరక్షణను గాలికొదిలేస్తున్నారు. వన మహోత్సవాన్ని సందడిగా నిర్వహించిన అధికారులు వర్షాలు ముమ్మరం కాగానే మరిన్ని నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది అటవీ శాఖ, సామాజిక అటవీ విభాగం దాదాపు 40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వచ్చే ఏడాది రెట్టింపు లక్ష్యాన్ని ప్రభుత్వం ఇప్పటికే నిర్దేశించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ లక్షల్లో మొక్కలు నాటిస్తోంది. ఈ ఏడాదైనా సంరక్షణపై శ్రద్ధ చూపితే జిల్లాలో పచ్చదనం పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసిన వారమవుతాం. నాతవరం మండలం తాండవ కూడలి నుంచి నాతవరం వెళ్లే మార్గంలో కొన్ని మొక్కలను గత ఏడాది నరికేస్తే ఉపాధిహామీ పథకం సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వీలైనంత వరకు విద్యుత్తు తీగల కింద నాటకపోవడం మేలు. రైతులకు సరఫరా చేసినవి మొక్కలను వారు పెంచుకుంటున్నారు. ఎకరాకు 80 శాతం నుంచి 90 శాతం వరకు మొక్కలు మూడేళ్లపాటు బతికిస్తే ఉపాధిహామీ పథకం నుంచి ఎకరాకు 1.5 లక్షలు వరకు ఇస్తున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో గ్రామాల్లో చెరువు గట్లపై నాటిన కొబ్బరి మొక్కలు ఆయా పంచాయతీలకు ఆదాయ వనరుగా మారాయి. పట్టణాలకు సమీపంలోని చెరువు గట్లపై నాటిన వాటిలో కొన్నింటిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. కంచె లేనిచోట పశువులు పాడు చేస్తున్నాయి.రోడ్డు పక్క వేసిన ఎవెన్యూ ప్లాంటేషన్లలో వేసిన మొక్కలు ఏపుగా ఎదిగిన తర్వాత కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని నరికేస్తున్నారు.
నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, కోటవురట్ల, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లో సగటున ఐదు వందల ఎకరాలకు తగ్గకుండా రైతులు మొక్కలు నాటారు. పల్లె వనాల పేరిట సామాజిక స్థలాల్లో నాటిన మొక్కల్లో కొన్ని సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో పశువులకు ఆహారంగా మారాయి. 'పేపరు మిల్లుల యాజమాన్యాలు ఏటా 40 లక్షల వరకు సరుగుడు మొక్కలను రైతులకు ఇస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 12 లక్షల వరకు పంపిణీ చేశారు. వరుణుడు కరుణిస్తే మొక్కలన్నీ నిక్షేపంలా ఎదుగుతాయి. మొక్కలను సంరక్షించడం అందరూ బాధ్యతగా భావించాల'ని సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ కోరారు.'అమ్మ పేరుతో మొక్క నాటండి' (ఏక్ పేడ్ మా కే నామ్). మన్‌కీ బాత్ కార్యక్రమంలో గత ఏడాది జూన్ నెలాఖరున ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు పిలుపు ఇచ్చారు. వన మహోత్సవానికి ఊతమివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ మొక్క నాటాలన్న ప్రధాని విజ్ఞప్తిని అందరూ పాటిస్తే జిల్లాలో ప్రస్తుతం 20 శాతంగా ఉన్న అడవుల విస్తీర్ణం 33 శాతానికి పెరుగుతుంది.
సామాజిక అటవీ విభాగం ద్వారా 1.5 మీటర్ల ఎత్తులో ఉన్న మొక్కలను ఎవెన్యూ ప్లాంటేషన్లలో నాటుతున్నారు. పశువులు తినడానికి వీల్లేని విధంగా ఆకుపచ్చని మ్యాట్‌తో కంచె వేస్తున్నారు. వీటిలోనూ కొన్నిచోట్ల మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు విరిచేయడమో, నీళ్లు లేక కొన్ని ఎండిపోవడమో జరుగుతోంది. నర్సీపట్నం కొత్తవీధి రోడ్డులో గత ఏడాది నాటిని కొన్ని మొక్కలు ఎండిపోయాయి.

# మహిళల ఉపాధికి డిజిలక్ష్మి ఊతం



అనంతపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే పొదుపు సంఘాల మహిళలకు సంబంధించిన పలు పథకాలు చేరువ చేసి వారికి దన్నుగా నిలుస్తోంది. ప్రస్తుతం ఏ తరహా సేవలు పొందాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా, రేషన్ కార్డు పొందాలన్నా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా పథకాలు వర్తించాయా లేదా? అని సరి చూసుకోవాలన్నా కచ్చితంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నగర, పట్టణాల్లోని పేదల ముంగిట్లోనే సేవలు అందించేందుకు ఆయా ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు 'డిజిలక్ష్మి' ద్వారా సేవలు అందివ్వడానికి కియోస్క్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సరికొత్త పథకాన్ని మహిళలకు చేరువ చేసింది. ఉమ్మడి జిల్లాలో అర్హులైన, ఆసక్తి ఉన్న మహిళలను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఎంపిక ప్రక్రియ అనంతరం వీరికి అందివ్వాల్సిన శిక్షణపై దృష్టిసారిస్తారు.

**ఎంపికకు ప్రామాణికం**

మీ సేవా కేంద్రాల్లో అందించే వివిధ రకాల డిజిటల్ సేవలన్నీ.. డిజిలక్ష్మి పథకానికి ఎంపికైన స్వయం సహాయక సంఘాలు అందిస్తాయి.
సంఘం ఏర్పాటు చేసుకొని మూడేళ్లు పొదుపు చేసి ఉండాలి.
డిగ్రీ పూర్తి చేసి, కంప్యూటర్‌లో నైపుణ్యం ఉండాలి.
21 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలి.
ఎంపికైన మహిళలకు రూ.2 లక్షల రుణం అందజేస్తారు. ఆ రుణంతో కంప్యూటర్, ప్రింటర్, టేబుళ్లు ఇతరత్రాలు కొనుగోలు చేసుకోవాలి. ఒక్కో కేంద్రం నుంచి ఇద్దరు, ముగ్గురు మహిళలకు ఉపాధి లభించడంతో పాటు నెలకు రూ.40 నుంచి రూ.50 వేలు ఆదాయం వస్తుందని అంచనా.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పలు సేవల్ని సర్వీసు కేంద్రాల ద్వారా డిజిలక్ష్మి అందించేందుకు అనుసంధానం చేస్తారు.

**సేవలు త్వరలో అందుబాటులోకి**

– విశ్వజ్యోతి, మెప్మా పీడీ

డిజిలక్ష్మి ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం అయింది. ఆసక్తి ఉన్న వారితో కేంద్రాలు ఏర్పాటు చేయిస్తాం. త్వరలోనే సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. ఆయా ప్రాంతాల అవసరం మేరకు కేంద్రాలకు అనుమతి ఇస్తాం.

# పనులు నాసిరకం.. నిధులు దుర్వినియోగం

గుత్తి : గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లో ఎంపీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. పదేళ్లల్లో రూ.కోట్లను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. ప్రధానంగా వైకాపా ప్రభుత్వ హయాంలో ఎంపీ నిధుల కింద శ్మశాన వాటికల్లో సౌకర్యాలు, వసతులకు భారీగా నిధులు ఇచ్చారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా శ్మశానాలకు నిధులు వెచ్చించారు. ఆయా పనులు నాయకులు ఇష్టానుసారంగా చేసి బిల్లులు దండుకున్నారు.

**గ్రామాల్లో ఇదీ పరిస్థితి..**

గుత్తిలో 5 ఏళ్ల కిందట పలుకాలనీల్లో సిమెంట్‌రోడ్లు నిర్మించారు. అనంతపురం రోడ్లులో నిర్మించిన సిమెంట్‌రోడ్లు నాసిరకంగా ఉండటంతో పంచాయతీరాజ్ ఇంజినీర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. లచ్చానిపల్లిలో పీర్లమకానం కట్టించి సామాజిక భవనం నిర్మించినట్లు బిల్లులు తీసుకున్నారు. అలాగే శ్రీపురంలో ఓ నాయకుడు ఆలయాన్ని విస్తరించాడు. ఆ విస్తరించిన నిర్మాణాలను సామాజిక భవనం అని చూపిస్తూ బిల్లులు తీసుకున్నాడు. బేతాపల్లిలో ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఇంటివద్ద సామాజిక భవనాన్ని నిర్మించగా అది ఆయన ఆధీనంలోనే ఉండిపోయింది. తాడిపత్రిలో రూ.2 కోట్లతో రింగురోడ్డు నిర్మించారు. పనులు నాసిరకంగా ఉండటంతో కంకర తేలింది. రోడ్డు గుంతలమయంగా మారింది. నాయకులు మిగులుబాటు కోసం నాసిరకం పనులు చేపట్టి నిధులు దండుకున్నారు.గుత్తి మండలంలోని ఊబిచర్ల, తొండపాడు గ్రామాల్లో నాలుగు శ్మశానాల్లో పనులకు రూ.40



లక్షలు వెచ్చించారు. పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రహరీలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నీటి సౌకర్యం కోసం బోర్లు వేశారు. ట్యాంకులను ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వలేదు. వైకాపాకు చెందిన ఓ బలమైన సామాజిక వర్గానికి చెందిన గ్రామ నాయకుడి ప్రయోజనం కోసం నిధులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.ఊబిచర్లలో శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించారు. తొండపాడులో మూడు శ్మశాన వాటికలకు నిధులు ఇవ్వగా ప్రహరీలు నిర్మించారు. ఇక్కడా నీటి సౌకర్యం లేదు. గుంతకల్లు మండలంలోని ఓబుళాపురంలో శ్మశాన వాటికు ప్రహరీ నిర్మించారు. అలాగే నీటి తొట్టె ఏర్పాటు చేయగా, నీటి తొట్టి శిథిలమవుతోంది.

# సచివాలయాల బదిలీల్లో సిఫార్సుల యత్నం

పుత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం వార్డు, గ్రామసచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించి జీవో జారీ చేసింది. నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఉన్నతాధికారులు బదిలీలకు సంబంధించి ఇప్పటికే మార్గదర్శకాలను విడుదల చేశారు. 2025 మే 31 నాటికి ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు విధిగా బదిలీ కావాల్సిందేననే నిబంధన పెట్టారు. భారీగా బదిలీలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే పలువురు బదిలీల కోసం సిఫార్సు లేఖల కోసం రాజకీయ నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టాక వార్డు, గ్రామ సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తద్వారా నగరాలు, పురపాలక సంఘాల్లో వార్డు సచివాలయాలు, పంచాయతీల్లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. తద్వారా సేవలను ప్రజలకు చేరువ చేశారు. ఒక్కో సచివాలయంలో 8 నుంచి 11 మంది సిబ్బంది



ఉండేలా నియామకాలు చేపట్టారు. అయితే సచివాలయాల్లో పనిచేసే వారిలో కొందరికే పనిభారం మరి కొందరు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలున్నాయి. మరికొన్ని సచివాలయాల్లో అయితే సిబ్బంది అరకొరగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థపై దృష్టి సారించింది. వాటి స్థానంలో క్లస్టర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు తీసుకున్న ప్రభుత్వం సిబ్బందిని హేతుబద్ధీకరణ చేయాలని తలచింది.
**క్లస్టర్ వ్యవస్థతో సేవలు..:** చిత్తూరు జిల్లాలో చిత్తూరు నగరపాలక సంస్థతో పాటు నగరి, కుప్పం, పలమనేరు, పుంగనూరు పురపాలక సంఘాలు, 34 మండలాలున్నాయి. అందులో 612 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన సచివాలయ సిబ్బందిని హేతుబద్ధీకరణ చేశారు. సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించారు. అందులో 2500 లోపు జనాభా ఒక కేటగిరీగా, 2500నుంచి 3500 రెండవ కేటగిరీగా, 3500పైన ఉన్న జనాభా ప్రాతిపదికన విభజన చేశారు. ఈ మేరకు క్లస్టర్లు విభజన చేపట్టనుండడం గమనార్హం. దీంతో రెండు, మూడు సచివాలయాలు కూడా ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం జరిగింది.
**కొందరికి వెసులుబాటు..:** సచివాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు ప్రభుత్వం వెలుసుబాటు కల్పించింది. ఎవరైనా దృష్టిలోపం, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి నిబంధనలు అనుసరించి తాము కోరుకున్న చోటుకు బదిలీ చేస్తారు. భార్యభర్తలు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులయితే వారికి దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో బదిలీపై వెళ్లే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.
నియామకం ఇలా: ఏ కేటగిరి సచివాలయంలో ఆరుగురు సిబ్బంది, బీ కేటగిరిలో 7 మంది, సి కేటరిగిలో 8 మంది ఉద్యోగులు ఉండేలా ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను విడుదల చేశారు. మిగిలిన ఉద్యోగులను బదిలీల అనంతరం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసే ప్రక్రియ కొనసాగనుంది. జిల్లా వివరాలు వార్డు, గ్రామ సచివాలయాలు: 612 పనిచేసే ఉద్యోగులు: 4,400 మంది కొత్తగా క్లస్టర్లు: 300

# చెత్త చెంతనే చదువులెలా?

అనకాపల్లి : విద్యా సంవత్సరం ప్రారంభమైంది. విద్యార్థులంతా ఉల్లాసంగా పాఠశాలకు వచ్చారు. ఎప్పటిలాగే డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దుర్గంధంతో ఇబ్బందులు తప్పలేదు. నగరపాలక ఉన్నత పాఠశాల సమీపంలోనే జీవీఎంసీ అనకాపల్లి జోన్‌కు చెందిన ఖాళీ స్థలంలో డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో సేకరించిన చెత్తను ఇక్కడ నిల్వ ఉంచి లారీల్లో కాపులుప్పాడ తరలిస్తున్నారు. రోజూ తరలించాల్సి ఉండగా ఆదివారం లారీలు కదలడం లేదు. సోమవారం ఉదయాన్నే పాఠశాలకు వస్తే దుర్వాసన భరించలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని ఏళ్ల తరబడి వేడుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. ఎన్నికల సమయంలో యార్డును తరలించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా అతీగతి లేదు. ఈ విద్యా సంవత్సరం నుంచి డంపింగ్ యార్డు సమస్య ఉండదని విద్యార్థులు భావించినా.. ఇబ్బందులు తప్పేలా లేవని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 316 మంది విద్యార్థులున్నారు.



పట్టణం నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డు వల్ల విద్యార్థులతోపాటు చుట్టుపక్కల నివాసం ఉండే వారంతా ఇక్కట్లకు గురవుతున్నారు.

**చదువుకోలేక పోతున్నాం**

డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో పాఠశాలలో చదువుకోవడానికి ఇబ్బందిగా ఉంటోంది. ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేయడం లేదు. గదిలో కిటికీలు మూసుకుని చదువుకుంటున్నాం. ఆరో తరగతి నుంచి ఇక్కడే చదువుతున్నా. పదో తరగతికి వచ్చినా సమస్యకు పరిష్కారం చూపలేదు. ఆర్.సుమంత్, విద్యార్థి

**వర్షం వస్తే తీవ్ర దుర్గంధం**

వర్షం కురిస్తే డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్గంధంతో చాలామందికి వాంతులు అవుతున్నాయి. ఒక్కోసారి అస్వస్థతకు గురవుతున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. వి.మహేష్, విద్యార్థి

## ఓవర్ నైట్ స్టార్‌డం.. ఈమె కొత్త నేషనల్ క్రష్

ఒకప్పుడు సినిమాలు హిట్ అయితే హీరోయిన్స్‌కి సోషల్ మీడియాలో పాపులారిటీ దక్కేది. కానీ ఇప్పుడు సోషల్ మీడియాలో పాపులారిటీ దక్కించుకున్న తర్వాత హీరోయిన్స్ అవుతున్నారు. సినిమాలు హిట్ అయ్యి ఓవర్ నైట్‌లో స్టార్స్ అయిన హీరోలు, హీరోయిన్స్ చాలా తక్కువ మంది ఈమధ్య కనిపిస్తున్నారు. హీరోలు, హీరోయిన్స్ స్టార్‌డం దక్కించుకోవడంకు చాలా కష్టపడాల్సి వస్తుంది. కానీ తాజాగా అహన్ పాండే, అనీత్ పడా లు ఓవర్ నైట్‌లో స్టార్‌డం దక్కించుకున్నారు. వీరు నటించిన 'సయ్యారా' సినిమా గత శుక్రవారం విడుదల అయింది. ఒక్క శుక్రవారం వీరి జాతకాన్ని మార్చేసింది. మొన్న శుక్రవారం నుంచి వీరి గురించి జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. చుంకీ పాండే ఫ్యామిలీ హీరో అయిన అహాన్ పాండే నటుడిగా భలే ఎంట్రీ దక్కించుకున్నాడు. ఇకపై అతడు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ లవ్ ఫిల్మ్స్ యంగ్ హీరో కావడం ఖాయం. లవ్ సినిమాలు అంటే ఇక మీదట అహాన్ పాండే గుర్తుకు రావాల్సిందే. సినిమాలో అతడి లుక్‌తో పాటు, నటన కూడా బాగుంది. అందుకే అతడు ఓవర్ నైట్ స్టార్ అయ్యాడు. ఇక హీరోయిన్ అనీత్ పడా సైతం ఓవర్ నైట్ స్టార్ అయింది. ప్రస్తుతం హిందీ ప్రేక్షకులు మాత్రమే కాకుండా అన్ని భాషల సినీ ప్రేక్షకులు, ఫిల్మ్ మేకర్స్ అనీత్ గురించి



మాట్లాడుకుంటున్నారు. దాంతో ఈమె ఓవర్ నైట్‌లో స్టార్‌డం దక్కించుకోవడం మాత్రమే కాకుండా కొత్త నేషనల్ క్రష్‌గానూ మారింది. 22 ఏళ్ల అనీత్ పడ్డా ఇండస్ట్రీలో సయ్యారా సినిమాతో అడుగు పెట్టిందని చాలా మంది అనుకుంటున్నారు. కానీ సయ్యారా కంటే ముందు అనీత్ పడ్డా సలాం వెంకీ సినిమాలో నటించింది. ఆ సినిమాలో పెద్దగా ఆకట్టుకోలేక పోయింది. అంతే కాకుండా బిగ్ గర్ల్స్ డోంట్ క్రై అనే వెబ్ సిరీస్‌లో నటించింది. అది కూడా అనీత్ కి నటిగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. దాంతో ఆఫర్లు పెద్దగా రాలేదు. లక్కీగా వచ్చిన సయ్యారా సినిమాలో ఆమె తనను తాను నిరూపించుకుంది. వచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకున్న అనీత్ పడ్డా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా నిలదొక్కుకున్నట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సయ్యారా సినిమా ప్రస్తుతం బాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ వసూళ్లను రాబడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. సయ్యారా విడుదలకు ముందు నుంచే పాజిటివ్ బజ్ ను క్రియేట్ చేసింది. ఈమధ్య కాలంలో ఏ కొత్త హీరో హీరోయిన్ సినిమాలు దక్కించుకోని భారీ ఓపెనింగ్స్‌ను దక్కించుకుంది. అంతే కాకుండా విడుదల తర్వాత వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్‌తో మొదటి రోజు ఏకంగా 20 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం అందుతోంది. ఇప్పటికే సినిమా రూ.50 కోట్ల వసూళ్లు పూర్తి చేసింది. వీకెండ్ పూర్తి అయ్యేప్పటికి ఈ వసూళ్ల నెంబర్ ఎంత వరకు చేరుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమాకు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ నేపథ్యంలో మొదటి వారం రోజుల్లో దాదాపుగా రూ.100 కోట్ల వసూళ్లు సాధించినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. దాంతో అనీత్ పడ్డా బాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల సినిమాల్లోనూ వరుస ఆఫర్లను సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. మరి అనీత్ పడ్డా ఈ క్రేజ్‌ను, స్టార్‌డంను ఎలా కాపాడుకుంటూ సినిమాలు చేస్తుందో చూడాలి.

## రష్మిక జీవితంలో కొత్త మలుపు

రష్మిక జీవితంలో ఊహించని మలుపును చూడబోతున్నాం. త్వరలోనే ఈ భామ ఎంటర్ ప్రెన్యూర్ కాబోతోంది. బాలీవుడ్ టాలీవుడ్ లో ఇప్పటికే చాలా మంది కథానాయికలు ఎంటర్ ప్రెన్యూర్లుగా ఎదుగుతున్నారు. ఇప్పుడు వారి బాటలోనే రష్మిక కూడా అనూహ్యమైన స్టెప్ తీసుకుంటోంది. రష్మిక త్వరలోనే వ్యాపార రంగంలో అడుగుపెట్టబోతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునేందుకు ఈ కూర్గ్ (కన్నడ) బ్యూటీ ప్రయత్నాలు ప్రారంభించిందని తెలుస్తోంది. అయితే రష్మిక ప్రారంభించబోయే వ్యాపారం ఏమై ఉంటుంది? అంటే దానికి ఇంకా ఎలాంటి సమాధానం లేదు. చాలా మంది అగ్ర కథానాయకలు వస్త్ర వ్యాపారంలో ఉన్నారు. రకరకాల ఫ్యాషన్ లేబుల్స్ ప్రారంభించి భారీగా లాభాలార్జిస్తున్నారు. దీపిక పదుకొనే, సోనమ్ కపూర్, ఆలియా భట్ వంటి ప్రముఖులు ఫ్యాషన్ రంగంలో



రాణిస్తున్నారు. ఇప్పుడు రష్మిక కూడా అదే బాటను అనుసరిస్తోందా? లేక ఏదైనా ఇతర రంగాల్లో అడుగుపెడుతుందా? అన్నది వేచి చూడాలి. రష్మిక తన జీవితంలో కొత్త మలుపు గురించి ప్రస్తావిస్తూ.... తాను త్వరలో కొత్త వ్యాపారంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వెల్లడించింది. ఈ రోజు నేను చాలా చాలా ముఖ్యమైన దాని కోసం షూటింగ్ చేయబోతున్నాను.. నువ్వు చెప్పినట్టే నేను ప్రారంభించబోయే వ్యాపారానికి సంబంధించిన షూట్ చేసాను! అని తన మామ్ కి రష్మిక వెల్లడించింది. ఈ సందర్భంగా తన తల్లి గురించి ప్రస్తావించిన రష్మిక.. అమ్మ ఎప్పుడూ ముందుగా తెలుసుకుంటుంది.. అని చెప్పింది. తన మనసులో ఆలోచనలను తన మాతృమూర్తి ముందే తెలుసుకున్న విషయాన్ని పేర్కొంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... రష్మిక తదుపరి పుష్ప 3లో నటించాల్సి ఉంటుంది. అంతకంటే ముందే రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ది గర్ల్ ఫ్రెండ్ అనే లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో కనిపించనుంది. అటు బాలీవుడ్ లోను పలు చిత్రాల్లో నటిస్తోంది.




## వీరమల్లు ఫైట్ కోసం 60 రోజులు.. లెక్క తప్పుతుంది సర్!



పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురు చూస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా విడుదలకు రెడీ అయింది. జులై 24న విడుదల కాబోతున్న ఈ సినిమాపై అంచనాలు పెంచే విధంగా చిత్ర యూనిట్ సభ్యులు ముఖ్యంగా దర్శకుడు జ్యోతికృష్ణ, హీరోయిన్ నిధి అగర్వాల్, నిర్మాత ఎఎం రత్నం లు మీడియాతో మాట్లాడుతూ ఉన్నారు. దర్శకుడు సినిమా గురించి పదే పదే హైప్ పెంచే వ్యాఖ్యలు చేస్తున్నాడు. ఈ మధ్య కాలంలో పవన్ ఫ్యాన్స్ నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న వీరమల్లు సినిమా పీరియాడికల్ డ్రామాగా రూపొందిన విషయం తెల్సిందే. ఇప్పటికే సినిమాకు ఉన్న బజ్ నేపథ్యంలో మంచి బిజినెస్ చేసిందనే వార్తలు వస్తున్నాయి. తాజాగా మీడియా ఇంట్రాక్షన్‌లో దర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. హరి హర వీరమల్లు సినిమాలో యాక్షన్ సీన్స్ అత్యంత కీలక పాత్ర పోషించబోతున్నాయి. పవన్ కళ్యాణ్ గారు ఒక ఫైట్‌ను తానే స్వయంగా కంపోజ్ చేశారు.

బ్రూస్‌లీ నటించిన ఎంటర్ ది డ్రాగన్ సినిమాలోని సీన్స్‌ను తలపించే విధంగా ఆ యాక్షన్ సీన్ ఉంటుందని ఆయన అన్నారు. సినిమాలో కీలక సమయంలో వచ్చే ఆ యాక్షన్ సీన్ ను ఏకంగా 60 రోజులు చిత్రీకరించినట్లు చెప్పుకొచ్చాడు. 60 రోజులు కూడా పవన్ కళ్యాణ్ యాక్ట్ చేశారు. ఒక్క రోజు కూడా డూప్‌తో చేయలేదని దర్శకుడు పేర్కొన్నాడు. ఒక్క యాక్షన్ సీన్ కు 60 రోజులు పట్టడం ఏంటి భయ్యా అంటూ చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్ నేపథ్యంలో సినిమాను చాలా స్పీడ్‌గా, చాలా తక్కువ షెడ్యూల్స్‌లో పూర్తి అయ్యే విధంగా షూటింగ్ చేశాడు. వీరమల్లు సినిమాను సైతం చాలా తక్కువ వర్కింగ్ డేస్‌లో పవన్ పూర్తి చేశాడు అంటున్నారు. ఇలాంటి సమయంలో దర్శకుడు ఒక్క యాక్షన్ సీన్ కోసం పవన్ కళ్యాణ్ 60 రోజులు పని చేశారు అంటూ చెప్పడంతో షాకింగ్‌గా ఉందని అభిమానులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సినిమాల ప్రమోషన్ సమయంలో దర్శకులు, నిర్మాతలు ఇలాంటి స్టేట్‌మెంట్స్ ఇవ్వడం కామన్‌గా జరుగుతూనే ఉంటుంది. 20 రోజులు చేస్తే 30 రోజులు అనడం కామన్‌గా మనం చూస్తూ ఉంటాం. కానీ ఏకంగా 60 రోజులు ఈ సినిమా కోసం వర్క్ జరిగిందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యి దాదాపుగా అయిదు ఏళ్లు అవుతుంది. మొదట కరోనా వల్ల వాయిదా పడింది, ఆ తర్వాత పవన్ రాజకీయాల కారణంగా సినిమా షూటింగ్ బ్రేక్ ఇస్తూ చేస్తూ వచ్చారు. పవన్ డేట్లు ఇవ్వడం లేదని దర్శకుడు క్రిష్ మరో ప్రాజెక్ట్‌ను వెతుక్కున్నాడు. అయినా కూడా ఒక్క యాక్షన్ సీన్ కోసం పవన్ 60 డేట్లు తీసుకున్నారు అంటే చాలా పెద్ద విషయం అని కొందరు ఈ విషయం గురించి స్పందిస్తున్నారు. ఎన్ని డేస్‌లో చిత్రీకరించారు అనే విషయాన్ని పక్కన పెడితే ప్రస్తుతం ఆ యాక్షన్ సీన్ గురించి ఆసక్తి పెరుగుతోంది. సినిమాలో పవన్ స్వయంగా ఆ యాక్షన్ సీన్ కంపోజ్ చేశాడంటే అభిమానులకు ఆసక్తి పెరగడం ఖాయం. సినిమా కు వచ్చిన పాజిటివ్ బజ్ నేపథ్యంలో అత్యధిక థియేటర్‌లలో రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నైజాంలో మైత్రి వారు ఈ సినిమాను పంపిణీ చేయబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది.

## 50లో ఇది నెవ్వర్ బిఫోర్ లుక్



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ %యావీదీ% 29 మీద బీభత్సమైన హైప్ కొనసాగుతోంది. ఇండియన్ సినిమా రేంజ్ ను దాటేలా, దాదాపు రూ.1000 కోట్ల బడ్జెట్ తో రూపొందుతున్న ఈ చిత్రం ఎప్పుడు బిగ్ స్క్రీన్ పైకి వస్తుందా అని ఫ్యాన్స్ వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కొన్ని కీలకమైన షెడ్యూల్స్ పూర్తయ్యాయి. తాజా సమాచారం ప్రకారం తదుపరి షెడ్యూల్ త్వరలోనే స్టార్ట్ కానుంది. ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి అఫీషియల్ పోస్టర్ కానీ టీజర్ కానీ విడుదల కాకపోయినా.. సినిమా మీద హైప్ మాత్రం తగ్గడం లేదు. కథ, విలన్, లొకేషన్స్, మేకింగ్.. ఇలా అన్ని విషయాల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మహేష్ బాబు ఇటీవల కనిపించిన ఓ స్టైలిష్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హీటెక్కిస్తోంద. ఫ్యాన్స్ మాత్రం ఈ లుక్ వెనుక రాజమౌళి మార్క్ ఫీలా ఉందంటూ ఊగిపోతున్నారు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఈవెంట్‌కు హాజరైన మహేష్ బాబు, బ్లాక్ హూడీ మరియు బ్లూ జీన్స్‌లో కనిపించారు. వేవీ హెయిర్, డార్క్ బార్డ్ లుక్‌తో మహేష్ సింప్లీ రాకింగ్‌గా ఉన్నారు. సింపుల్ కాస్ట్యూమ్ లోనూ ఇలా డిఫరెంట్‌గా కనిపించడం ఫ్యాన్స్‌ను శాక్‌కు గురి చేసింది. ఇది SSMB29 సినిమా కోసం చేస్తున్న లుక్ ట్రాన్స్ఫర్మేషన్‌లో భాగమేనని టాక్. మహేష్ వయసు ఇప్పటికే 50లోకీ వచ్చేసింది. ఈ క్రమంలో పాతికేళ్ల కుర్రాడిలా కనిపించడం అనేది సో స్పెషల్. ఫ్యాన్స్ మాత్రమే కాదు, నెటిజన్లు, సినిమా ప్రేమికులంతా మహేష్ బాబుని ఈ కొత్త లుక్ లో చూసి తెగ మంత్రముగ్ధులైపోతున్నారు. సోషల్ మీడియా అంతా ఆ ఫోటోలతో నిండిపోయింది. 'రాజమౌళి మిరాకిల్ మొదలైపోయింది' అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఈ స్టైలిష్ లుక్ చూస్తుంటే %యావీదీ%29లో ఆయన పాత్ర ఎంత వైవిధ్యంగా ఉండబోతుందో చెప్పకనే చెప్పినట్టే. ఈ సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఫీమేల్ లీడ్ గా నటిస్తున్నారు. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అడ్వెంచర్ యాక్షన్ జోనర్ లో తెరకెక్కుతున్న ఈ మూవీకి ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ దుర్గా ఆర్ట్స్ పై కె ఎల్ నారాయణ నిర్మిస్తున్నారు.

## అందాల బేబమ్మ రొమాంటిక్ ఫోజ్

'ఉప్పెన' సినిమాతో చిన్న వయసులోనే హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి శెట్టి. హీరోయిన్‌గా మొదటి సినిమాతోనే సూపర్ హిట్ దక్కడంతో ఇండస్ట్రీలో ఈమె పేరు మారుమ్రోగింది. అంతకు ముందు బాల నటిగా చేసినా, కమర్షియల్ యాడ్స్‌లో చేసినా కూడా రాని గుర్తింపు ఉప్పెన సినిమాతో కృతి శెట్టి దక్కించుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ కృతి శెట్టి సొంతం అంటూ చాలా మంది నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉండేవారు. మొదటి సినిమాలో పద్దతైన లంగా ఓనీ, చుడీదార్‌లో కనిపించిన శృతి శెట్టి ఆ తర్వాత కూడా అదే తరహా పాత్రలను దక్కించుకుంది. మెల్ల మెల్లగా స్కిన్ షో చేస్తూ అందాల ఆరబోత చేస్తూ వచ్చింది. కృతి శెట్టి ఇండస్ట్రీలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంది. ఉప్పెన హిట్ కారణంగా కృతికి అర డజను సినిమాల్లో ఆఫర్లు దక్కాయి. మొదట్లో వరుసగా సినిమాలు హిట్ అయ్యాయి. కానీ తెలుగులో మాచర్ల నియోజకవర్గం నుంచి మొదలుకుని వరుసగా ఫ్లాప్స్ చవిచూస్తూ వచ్చింది. దాంతో కృతి శెట్టికి తెలుగులో ఆఫర్లు తగ్గాయి. ఆమెకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు ఉంది, అంతే కాకుండా ఆమెకు సోషల్ మీడియాలో తెలుగు వారి నుంచి మంచి ఫాలోయింగ్ ఉంది. కానీ అందాల బేబమ్మకు టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ నుంచి ఆఫర్లు కనుమరుగు అయ్యాయి. కస్టడీ తర్వాత కృతి శెట్టి ఆఫర్లు తగ్గాయి.



గత ఏడాది మనమే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. టాలీవుడ్ లో ఆఫర్లు తక్కువ కావడంతో కృతి శెట్టి లక్కీగా తమిళ్, మలయాళ సినిమాల నుంచి ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. ఆ మధ్య వచ్చిన మలయాళ మూవీ ఏఆర్ఎం తో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈమె చేతిలో ఏకంగా మూడు తమిళ సినిమాలు ఉన్నాయి. వాటిల్లో ఖచ్చితంగా రెండు మంచి విజయాన్ని సొంతం చేసుకుంటాయి అనే విశ్వాసంను వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కృతి శెట్టి రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈమె షేర్ చేసిన రెడ్ టాప్, బ్లూ జీన్స్ ఔట్ ఫిట్ కృతి శెట్టి మరింతగా మెరిసేలా చేస్తుంది అనడంలో సందేహం లేదు. క్యూట్ బ్యూటీ కాస్త ఈ రొమాంటిక్ ఫోజ్‌లో చూపు తిప్పనివ్వడం లేదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈమె చేస్తున్న వా వాతియర్ సినిమా విడుదలకు ముస్తాబు అవుతోంది. ఇక ఈమె ప్రదీప్ రంగనాథన్ తో చేస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. తమిళ్‌తో పాటు తెలుగులోనూ ఈ సినిమా విడుదల కాబోతుంది. ఈ ఏడాదిలోనే విడుదల కాబోతున్న ఈ సినిమాతో కృతి శెట్టికి మరోసారి తెలుగులో మంచి పేరు వస్తుందని, తద్వారా తెలుగు సినిమా ఆఫర్లు సైతం వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు జీనీ అనే తమిళ మూవీలోనూ కృతి శెట్టి నటిస్తోంది. ఇంతకు ముందు పెద్దగా అందాల ఆరబోత చేయని కృతి శెట్టి ఇప్పుడు స్కిన్ షోకి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్న నేపథ్యంలో వరుస ఆఫర్లు, ముఖ్యంగా కమర్షియల్ పాత్రలు చేసే అవకాశాలు రావచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## తెలుగు నటి యూరప్‌లో రచ్చ రచ్చ

దక్ష నగర్‌కర్ పరిచయం అవసరం లేదు. టాలీవుడ్ లో హుషారు అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ తొలి ప్రయత్నం సక్సెసైంది. తనదైన అందం హుషారైన నటనతో యువతరంలో మంచి ఫాలోయింగ్ సంపాదించింది. అటుపై జాంబీరెడ్డి తో మరో పెద్ద సక్సెస్ ని ఖాతాలా వేసుకుంది. ఆ తర్వాత బంగార్రాజులో స్పెషల్ అప్పీరియన్స్ తో ఆకట్టుకుంది. నాగచైతన్య-నాగార్జునలతో కలిసి ఓ పాటలో కనిపించింది. దక్ష ప్రస్తుతం తెలుగు పరిశ్రమ సహా ఇరుగు పొరుగునా బిజీ నటిగా మారుతోంది. ఇక సోషల్ మీడియాలో దక్ష స్పీడ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు టెంప్టింగ్ ఫోటోలతో ఇన్ స్టాని హీటెక్కించడం ఈ భామ ప్రత్యేకత. ఇంతకుముందు జిమ్,



ఫిట్నెస్ కి సంబంధించిన ఫోటోలు, వీడియోలను షేర్ చేసిన దక్ష ఇటీవల గ్లామర్ ఎలివేషన్ కి సంబంధించిన ఫోటోషూట్లపైనా ఫోకస్ చేస్తోంది. దక్ష ప్రస్తుతం యూరప్ ట్రిప్‌లో ఫుల్‌గా చిల్ చేస్తోంది. బుడాపెస్ట్ నుంచి ఇంతకుముందే ఒక వీడియోని, కొన్ని ఫోటోలను కూడా దక్ష షేర్ చేసింది. ఈ హాలి బ్యూటీ పాక్షికంగా అందాలను హైలైట్ చేసే బ్లాక్ అండ్ బ్లాక్ లుక్ తో యువతరం హృదయాలను మరిగిస్తోంది. డార్క్ థీమ్డ్ ఫోటోషూట్ తో దక్ష అందం పదింతలైంది. యూరప్ లో దక్ష బోలెడంత రచ్చ చేయబోతోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536